ఆంధ్రమహిళ



Andhra Mahila August 1963 - 50 nP

ఆంధ్రమహిళ

మహిళాభ్యుదయ

మాస పత్రిక

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్
వ్యవస్థాపకురాలు

ప్రకటనరేట్లు

(ఒకేరంగులో)

నాలుగవ రేపరు పుట	...	రు.	100/-
లోపలి రేపరు పుట (2, 3)	...	,,	80/-
లోపలి సాదా పుట	...	,,	60/-
లోపలి అర్ధ పుట	...	,,	30/-
పావు పుట	...	,,	15/-

'ఆంధ్రమహిళ'

(మహిళాభ్యుదయ మాసపత్రిక)


వ్యవస్థాపకురాలు:
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

విడి పత్రిక-50 నయాపైసాలు   సం॥ చందా - రూ. 6-00.

సేవాసంస్థలకీ, స్త్రీల క్లబ్‌లకీ, గ్రంథాలయాలకీ, విద్యాలయాలకీ, జీవిత సభ్యులకీ
సంవత్సర చందా- 3-రు.   వ్యక్తులకీ- 6-రు.

చందా పైకము ఈ దిగువ అడ్రసుకు పంప ప్రార్థన.

మేనేజరు.
ఆంధ్రమహిళ
7. ఎ. రోజరీ చర్చిరోడ్డు   శాంథోమ్,   మద్రాసు-4



ఆంధ్ర మహిళ

సంపుటి 19 ఆగస్టు 63 సంచిక 8

విషయసూచిక

ముఖచిత్రం :

రవీంద్రనాథ ఠాకూరు

ఆంధ్ర మహిళ

7 ఎ, రోజరీ చర్చిరోడ్, శాంథోమ్ మద్రాసు-4

సన్యాసి

'కొడాలి'

మొగలి రేకుల మృదుల కపోలయుగము
కరకుటెండల వేడిమి కందువారె,
తెలిమొగిలుచాటు నెలవంక తెరగుబూని
బూది బూసిన నీ మోము మురువు కరిగె !

మధురదరహాస చంద్రికాసుధ తొరంగు
కామినీస్నిగ్ధ గండభాగమ్ములాను
కప్పురపు కమ్మతావుల కావిమోవి
పోటుపడ, నీకు వైరాగ్యవృత్తి యేల !

కన్నెప్రాయపుకౌటంపు కౌగిలింత
నవసి, నసివాడ, నీ మేనిచివురు, నేడు
కఠినహృదయమ్ములేవియు గరగిపోవ,
కటికి రానేల గదుములు కట్టెనకట !

అల్లనల్లన దరిచేరి, అలతిసిగ్గు
జాలిచూపుల క్రీగంట మేళవించి
మధుర మందస్వనంబుల మాటలాడు
ప్రణయినీ బాంధవంబెట్లు బాసినావు ?

కావిపుట్టము కటిసీమ కట్టు భాగ్య
భోగ్యరాహిత్యమైన వైరాగ్యమునకు,
జాజిపూసౌరభమ్ములు జల్లువిరియు
జవ్వనమ్మున, కెంతటి దవ్వు గలదు ?

సర్వము పరిత్యజింపగ జనును గాక,
పూపజవరాలి పొలయల్కబాపు, నాటి
ప్రణయభావమ్ము స్మరణకురాక, గడవ
జనునె నీకు, దీర్ఘ నిశీథసమయములను !

దివ్యకుసుమాంగి యీనెలుదీసి యిచ్చు
లేదముల పాకుమపులు కావటంచు,
హరిణశాబమ్ములకు తృణాంకురము లిడగ
మనసు పుట్టెనె, ఎంత యమాయికుడవు !

నవ్వేద వదేల ? నామాట నమ్మి, నీవు
నెలతకడ కేగి, తప్పు మన్నింపు మనుము,
కరకురుద్రాక్షమాలల కంఠసీమ
కమ్మసంపంగి దండలు గౌగిలింప !

('వైతాళికులు' నుంచి)

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 19 :: ఆగస్టు 1963 :: సంచిక 8

ఆంధ్రప్రదేశ్ మహిళాసభ

ఆంధ్ర రాజధానీ నగరం హైదరాబాదులో జూలై 23 వ తేదీన భారత ప్రధాని నెహ్రూ ఆంధ్రప్రదేశ్ మహిళా సభకు ప్రారంభోత్సవము జరిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రిణి శ్రీమతి సదాలక్ష్మి, నెహ్రూ గారికి స్వాగతం చెప్పారు. కేంద్ర విద్యాశాఖ ఉపమంత్రిణి శ్రీమతి సౌందరం రామచంద్రన్ మహిళలు తమ అవిరళకృషితో సంఘజీవితాన్ని బాగుపరచి దేశాభ్యుదయానికి పాటుపడాలన్నారు. స్థానికసంస్థలలో తమకు తగినంత ప్రాతినిధ్యం వుండటంలేదనీ, జిల్లా పరిషత్తులలోనూ మున్సిపల్ కౌన్సిళ్ళలోనూ పంచాయితీ సమితులలోనూ మహిళలకు ఎక్కువ ప్రాతినిధ్యం కలుగజేయమనీ ఈ మహాసభవారు పదిహేను తీర్మానాల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా బంగారం విషయంలో ప్రభుత్వము అవలంబించిన విధానాన్ని తాము మనస్ఫూర్తిగా బలపరుస్తున్నామని ఈ మహాసభవారు ఏకకంఠముతో పలకడం స్త్రీజాతికి గర్వకారణం; స్త్రీలలో ఉదయిస్తున్న నవచైతన్యానికి అది మచ్చుతునక. పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి సంగం లక్ష్మిబాయ్ ఈ మహాసభకు అధ్యక్షతవహించి కార్యక్రమాన్ని జయప్రదంగా జరిపించారు.

ప్రధాని నెహ్రూ నేటి రాజకీయపరిస్థితులు ప్రస్తావించినమీదట, స్త్రీలని ఉద్బోధిస్తూ, భారత స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు చూపిన త్యాగం ప్రశంసనీయమనీ; కాని, మహత్తరమైన బాధ్యత ముందువున్నదనీ, మన మహిళలు తమ దృష్టిని గ్రామాలవైపు మరల్చి, గ్రామపునర్నిర్మాణముతో దేశసౌభాగ్యానికి కృషి చేయాలనీ అన్నారు. మనజాతి జీవనమూ, మన దేశభవిష్యత్తూ గ్రామాలపై ఆధారపడివున్నదనీ, మన గ్రామాలు ఆరోగ్యవంతములూ ఐశ్వర్యవంతములూ అవడంలోనే మన పురోభివృద్ధిగలదనీ, ప్రధాని నెహ్రూ చేసిన హెచ్చరికను ఆంధ్రమహిళలమైన మనము మరువరాదు.

— మాలతీ చందూర్
గౌరవ సంపాదకులు

ఆరాధన

మా ఇంటి వెంబడే చిన్న బంగళాలో సి. ఐ. డి. ఇనస్పెక్టరు రఘుబాబు ఉండేవారు. ఆయన పేరు చెప్తేచాలు ఎలాంటి గజదొంగలైనా గజ గజ లాడేవారు. అంతటి ప్రతిభాశాలి ఆయన. ఆయన గంభీరమైన ముఖము చూస్తేనే చాలు, ఎలాంటివారు మాట్లాడటానికి కూడ జంకుతారు. చాలా హుందాగా వుంటాడు.

దాదాపు రిటైరింగు వయస్సులో వున్నా ఆయన ఇంకా బ్రహ్మచారిగా ఉండటం మాలో కుతూహలాన్ని రేపింది. మా రామం నేను రోజూ ఆయన ఇంటికి వెళ్ళి కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడి రావటం అలవాటు. మాతో ఆయన చాలా చనువుగా ఉంటారు.

ఒక రోజు ఆయన తోటలో కులాసాగా మాట్లాడుతూ కూర్చున్నాము. ఇంతలో మా రామం "ఏమండీ! మీరింతవరకు వివాహం చేసుకోకపోవటానికి కారణమేమిటి? " అని అడిగాడు.

దానికాయన నిట్టూరుస్తూ "ఈ జీవితంలో నాకా అదృష్టం లేదు బాబూ! నామనస్సు నాకర్షించిన యువతిని దక్కించుకోలేకపోయాను. ఆమె శ్రేయస్సు నభిలషిస్తూ జీవితచరమాంకాన్ని పూర్తి చేయటమే నాకు మిగిలిందల్లా," అన్నారాయన బరువైన కంఠంతో.

దాంతో మేము ఉత్కంఠతతో "అదేమిటో చెప్పాల్సిందే అని బలవంతం పెట్టాము, మా కున్న చనువు కొద్దీ."

ఆయన కొంచెం సేపు మౌనంగా వూరుకొని, తరువాత తన పర్సులోనించి ఒక ఫోటో తీసి చూపించి "ఈమె నా మనస్సు నాకర్షించిన యువతి, పేరు లలిత " అంటూ ప్రారంభించారు.

అది నా విద్యార్థిదశ. రెండు మూడు రోజులుగా మా వీధిలో ఒక అమ్మాయి వెళ్తూండేది. ఆమె అందరివంటి అందగత్తె కానీ, ఆమె నేత్రాల్లో తీవ్రమైన ఆకర్షణ ఉంది. ఆమె నేత్రాలలోకి చూస్తూంటే, మనస్సు స్వర్గసోపానా లెక్కుతున్నట్లు మధురానుభూతి కల్గేది. ఆమెను ధైర్యంచేసి ఒకరోజున పల్కరించాలను కున్నాను.

ఒకరోజున మామూలుగా పుస్తకాలు పట్టుకొని వెళ్తోంది.

"ఏమండీ !" అని పిల్చాను: పలుకలేదు. మళ్ళీ " ఏమండి! మిమ్మల్నే" అంటూ గట్టిగా పిల్చాను. ఆమె బెదరిన కళ్ళతో తలెత్తి చూచింది. ఆ కళ్ళు చూస్తూంటే అమాయకత ఉట్టిపడే లేడి కళ్ళుగుర్తుకొస్తాయి. ఆ కళ్ళల్లోని నిర్మలమైన అమాయకతే చాలు క్రూరమృగాల్ని సైతం నిలువరించటానికి. అలా చూస్తూ తన్మయత్వంలో మునిగిపోయిన నేను తమాయించుకొని, తెప్పరిల్లి "మీ అందాల నయనద్వయానికి నా నజరానా" అంటూ జంట గులాబి గుత్తిని అందించాను.

ఆమె సంభ్రమంతో అలాగే నిలబడి పోయింది. వెంటనే ఆ గులాబీలు ఆమె చేతిలోనుంచి చక చకా నిష్క్రమించాను. ఆరోజు మొదలుకొని నాలుగైదు రోజులదాక ఆమె దర్శనం కాలేదు. కారణం తెలియక మనస్సు అల్లకల్లోలం చెందింది. ఆమె రోజూ మా వీధిలోనుండి వెళ్తుంటే చూస్తూండే వాణ్నేగాని, ఆమె ఎక్కడుండేదో ఏమో తెలియదు.

ఆమె కోసమని ఊరంతా గాలించాను. కానీ ఆమె జాడ తెలియలేదు. నాలుగైదు రోజులైన తర్వాత నేను కాలేజినుండి మా ఊరి చెరువు మీదగా వస్తుండగా ఆమె దూరాన వెళ్తూ కనిపించింది.

వెంటనే గబ గబ అడుగులు వేస్తూ వెళ్లి ఆమెను కల్సుకున్నాను. ఆమె తలెత్తిచూసి మౌనంగా నడిచి పోసాగింది. నేనే మెల్లిగా పలుకరించాను.

"ఏమండీ!" అని

ఆమె పలుక లేదు.

"ఏమండి! మిమ్మల్నె!" అని గట్టిగా పల్కరించాను.

ఆమె తలెత్తి చూచింది. నీళ్ళు నిండిన కళ్లతో "మీకు ఒంటరిగా ఉన్న ఆడపిల్లల్ని ఏడ్పించటం హాబీయా? ఎందుకండీ నన్నిలా అల్లరి పెట్టడం" అంది గద్గద స్వరంతో.

నేను కళవళ పడిపోయాను.

"ఏమండీ! నావల్ల ఏదైనా పొరపాటుంటె క్షమించి తెల్పండి!" సరిదిద్దుకుంటాను. అంతేగానీ ఇలాంటి మాటలతో నన్ను బాధించవద్దు" అన్నాను.

ఆమె కొంచెం ఊరుకొని "మీరు ఇలా నన్ను బజారులో పల్కరించటం పూలివ్వటం ఎవరైనా చూస్తే ఏమనుకొంటారండీ! మీకేం మీరు నిర్భయంగా ఉండగలరు. మా జీవితం అలా కాదుగదా! మీకింత కంటె చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను" అంది.

"మీరనుకున్నట్లు మిమ్మల్ని అల్లరి పెట్టాలనిగాని, మరే దురుద్దేశంతోనూ మిమ్మల్ని పల్కరించలేదు. మొదటిరోజున మిమ్మల్ని మా వీధిలో పోతుండగా చూశాను. అప్పుడే నిర్మల జ్యోత్స్నాభరితాలైన మీ కళ్లు నన్నాకర్షించినయి. ఆ రోజునుండి మీకళ్లు నా స్మృతిపథాన నిశ్చలంగా నిల్చినాయి. సౌందర్యారాధనే నాధ్యేయం. అంతేగాని వేరే దురుద్దేశం లేదు. ఇందులో నా పొరపాటేదైనా ఉంటే క్షమించండి!" అన్నాను నిశ్చల స్వరంతో.

"మీరే దృష్టితోనైనా ప్రవర్తించి ఉండవచ్చు. కానీ లోకం దాన్ని చూసే దృష్టి వేరుగాఉంటుంది" అంది భారంగా.

"మీరేదో బాధతో ఉన్నట్టున్నారు. దయయుంచి మీకే అభ్యంతరము లేకపోతే చెప్పండి. కొంత భారం తగ్గుతుంది" అన్నాను.

"ఇప్పుడు కాదు లెండి" అంటు భారంగా అడుగులు వేస్తూ నిష్క్రమించింది.

తర్వాత కొన్నిరోజుల తర్వాత తెలిసింది. ఆమె మా కాలేజీలోనే ఇంటరు ఫస్టు ఇయర్ చదువుతోంది.

ఒకరోజున కాలేజీనుండి వస్తుఉండగా చెఱువు దగ్గర కలుసుకోవటం జరిగింది. ఆమెను కల్సుకుని "అలా చెఱువు గట్టున కాస్సేపు కూర్చుని వెళ్దాం రండి" అన్నాను.

ఆమె సరేనంటు దారితీసింది.

"ఏమండీ! మీ మనస్సులో బాధ ఏమిటో ఇప్పుడు చెప్పండి దానివల్ల కొంచెం ఉపశమనం కలుగుతుంది" అన్నాను. ఆమె కొంచెంసేపు ఊరుకుని ఇలా అంది.

"చెప్పటానికి ఇదేమీ మహత్తర విషయం కాదండి. సమాజని బంధనలకు మ్రగ్గిపోతున్న ఒక కుటుంబగాథ. అయినా ఇంతగా అడుగు తున్నారు గనుక చెపుతాను.

" మా నాన్నగారు విశాఖపట్టణంలో బాగా ప్రాక్టీసున్న లాయరు. రెండు చేతులా ఆర్జించేవారు. మా అన్నయ్య అప్పుడు యం.బి. ఫోర్తియియ్యర్ చదువుతుండేవాడు. అప్పుడే వాళ్ల క్లాసు సహాధ్యాయినిని ప్రేమించి ఆమెను తప్ప వివాహం చేసుకోనని మొండి పట్టుపట్టాడు. ఆమె మాకులం కాకపోవటంతో మా నాన్నగారు సనాతన సాంప్రదాయాలు వదలలేక అంగీకరించలేదు. కానీ అన్నయ్య తన మొండి పట్టు వదలలేదు. చివరకు రిజిష్టర్ ఆఫీసులో ఆమెను వివాహం చేసుకున్నాడు. దాంతో మా నాన్నగారు మా అన్నయ్యతో సంబంధం తెగత్రెంపులు చేసుకున్నారు. కానీ పుత్రవాత్సల్యం మాత్రం మరచి పోలేకపోయారు. మంచ మెక్కారు. ప్రాక్టీసు మూలపడింది. ఇక ఆ ఊరిలో ఉండలేక అక్కడ ఇల్లు అమ్మేసి ఈ ఊరు వచ్చాము. ఒకసారి నాన్నగారికి ఎక్కువగా ఉన్నదని తెలిసి అన్నయ్య, వదిన చూడ్డానికి వచ్చారు.

కానీ నాన్నగారు వాళ్లను తన గడప త్రొక్క వద్దన్నారు చేసేది. లేక వాళ్లిద్దరు ట్రావలర్సు బంగళాలో ఉండి నన్ను అక్కడకు పిలిపించుకున్నారు, అప్పుడే చూశాను వదినని. చాల సహృదయం సంస్కారం గల యువతి. అన్నయ్యకు అన్నివిధాల తగి ఉంటుంది ఆమె. కానీ సనాతన సాంప్రదాయల మధ్య పెరిగిన నాన్నగారి మనస్సు మార్చటం సాధ్యమయ్యే పనిగాదు.

****

శ్రీమతి యం. రమ

****

అన్నయ్యా కూడ నాన్నగారికి దూరం కావలసి వచ్చినందుకు చాలా బాధపడుతున్నాడు. అన్నయ్య బాధను చూసి వదిన కూడ చాలా బాధపడుతోంది. కానీ ఇద్దరు ఒకరి మీద ఒకరు ఆధారపడివున్నారు. ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తనను కబురుచేయమని తన అడ్రసు యిచ్చి అన్నయ్య వెళ్ళిపోయాడు.

నాన్నగారు అన్నయ్యను గడప త్రొక్క కుండ పొమ్మన్నారేగాని, వారి బాధ యింకా జాస్తి అయింది. ఇటు చూస్తే సనాతనాచారాల బంధం అటు చూస్తే పుత్రవాత్సల్యం ఏమి చేయలేని పరిస్థితిలో క్రుగ్గిపోతున్నారు.

నాన్నగారు అన్నయ్యతో సంబంధం తెగత్రెంపులు చేసుకున్నా కులం కాని పిల్లని వివాహమాడాడని అయిన వాళ్లింత యింటికి రావడం మానివేసారు. ఇది మా కుటుంబ పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో కలిగిన మనోవ్యాకులతతో క్రుగ్గిపోతున్నందున మీతో కఠినంగా మాట్లాడి మీ మనస్సుకు బాధకలిగించాను. క్షమించండి'' అంది దుఃఖంతో జీరపోయిన కంఠంతో.

"క్షమించండి! ఇంత బాధ మీ మనస్సులో గూడు కట్టుకొని ఉందనుకోలేదు. కానీ జీవితంలో ప్రేమ విలువ మహత్తరమయింది. దానివిలువ గుర్తించిన మీ అన్నయ్య నిజంగా అభినందనీయుడు." అన్నాను.

"ప్రేమరచయితలు వ్రాయటానికి వచ్చె చక్కని విషయం. కానీ నిత్యజీవితంలో దానివల్ల అనర్ధాలే ఎదురౌతుంటాయి'' అన్నది ఆమె.

"ప్రేమ ఎప్పుడు త్యాగం వల్ల పరిణితి చెందుతుంది ప్రతిఫలాపేక్ష లేని ప్రేమ చరితార్ధమౌతుంది" అన్నాను.

"అది అనుకున్నంత తేలికకాదండీ! బహుశ అలాంటి ప్రేమకు మన ప్రపంచంలో తావులేదేమోననిపిస్తుంది'' అన్నది ఆమె. అంతటితో ఆసంగతి వదిలేసి కాలేజీ విషయాలు మాట్లాడుకుని ఇంటికి వెళ్లాము.

ఆరోజునుండి ఆచెఱువు గట్టునే యిద్దరు కలుస్తుండేవాళ్లం. ఆమె కళ్లలోకి చూస్తుంటె ఏదో దివ్యానుభూతి కలుగుతుండేది. అలా దిన దినాభివృద్ధి చెందిన మా పరిచయం ఒకళ్లని విడిచి ఒకళ్లు ఉండలేని స్థితికి వచ్చింది.

ఇంతలో మా ఇంట్లో నా పెండ్లి ప్రయత్నాలు సాగించారు. నేను లలితను తప్ప మరొక యువతిని వివాహ మాడనని చెప్పాను. కానీ సమాజంలోనుంచి బహిష్కరించ బడ్డ ఆ కుటుంబపు అమ్మాయిని చేసుకోటానికి నాన్నగారు ఇష్టపడలేదు. లలితతో యీ విషయం చెప్పాను. కాని ఆమె ఇలా అంది.

"లేదు! రఘు! ఏదో ప్రేమ కోసం చేస్తున్నామని ఆవేశంతో చేసే ప్రతి తప్పటడుగుకు జీవితంలో ఎంతోమూల్యం చెల్లించాల్సి ఉంటుంది. దానికి అన్నయ్య జీవితమే ఉదాహరణ. అసలే కృంగి కృషించిన నా తల్లి తండ్రుల పరిస్థితి ఊహించటానికే భయంగా ఉంది. మా నాన్నగారికి నీ వొక్కడవే. ఈ ఆవేశాలవల్ల మీ నాన్నగారు మా నాన్నగారికి తోడవుతారేమో నని భయంగా ఉంది! ఇంతమందిని బాధపెట్టి మన సుఖపడపోయేది ఉండదు" అన్నది.

"అయితే నా మీద నీకు ప్రేమలేదా" అని కఠినంగా ప్రశ్నించాను.

"రఘు! ఆవేశ పడవద్దు. నీకోసం కావాలంటే నా ప్రాణాలే అర్పిస్తాను. కానీ బ్రతికి ఉండి యిటు నా వాళ్లని అటు నీవాళ్లని కూడా బాధపెట్టలేను. ఆ బాధ ఎలాంటిదో స్వానుభవం కనుక చెబుతున్నాను. మీ నాన్నగారితో సంబంధం త్రెంచుకున్న తర్వాత, సగంలో ఉన్న నీచదువు ఏమైపోతుందో ఆలోచించు, ఇప్పటి నీ చదువుతో జీవితపోరాటంలో నెగ్గటం కష్టతరము, ఇలా అంటున్నానని బాధపడక సహృదయంతో నన్నర్ధంచేసుకోకల్గితే సంతోషిస్తాను. నా మనస్సెప్పుడు సర్వదాన్నినె ఆరాధిస్తూ ఉంటుంది. ఆమరమైన మన ప్రేమ భౌతిక సంబంధాలతో కలుషితం చేయవద్దు" అని గబ గబ వెళ్లిపోయింది.

మళ్లీ ఆమె కనుపించలేదు. తర్వాత తెలిసింది వాళ్ల కుటుంబమంతా ఆ ఊరినుండి వెళ్లారని.

కాని లలిత మూర్తితో నిండిన నా మనస్సు యింకొకరితో వివాహానికి అంగీకరించలేదు. అప్పటి నుండి పిచ్చెత్తి పోయినట్లుగా దేశమంతా తిరిగి వచ్చాను రెండేళ్లపాటు. కానీ లలితను మాత్రము కలుసుకోలేకపోయినాను. సగంలో వదిలేసిన చదువు పూర్తిచేసాను. ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకపోబట్టి అలాగే కాలం వెళ్లబుచ్చసాను.

ఒకసారి నేను కలకత్తా నుండి వస్తూ, దారిలో వాల్తేరులో కాఫీ త్రాగటానికి రిఫ్రేష్‌మెంటు రూముకు వెళ్లాను. అక్కడ ప్రత్యక్షమయింది. ఆ దివ్యనేత్రాల లలిత! నా జీవన దేవత. వెంబడి ఎవరో ఒక యువకుడున్నాడు. ఆమె నన్ను చూడగానే వచ్చి పల్కరించింది.

"రఘు బాగున్నావా? వీరు మావారు" ఇక్కడ కాలేజీలో లెక్చరర్ పని చేస్తున్నారు అని నన్ను తన బాల్య స్నేహితుడంటూ వాళ్లాయనకు పరిచయం చేసింది. ఇంతలో ఆయన వాళ్ల స్నేహితుడితో మాట్లాడి వస్తానంటూ మమ్మల్ని అక్కడ వదలి వెళ్లాడు. లలిత తనే సంభాషణ ప్రారంభించింది.

"రఘు! మీకు వివాహమైందా?" అని

"ఆ ప్రశ్న కేవలం అర్థరహితం" అన్నాను బాధగా.

"మీరలా అంటారని నాకు తెలుసు. ప్రేమత్యాగంతో పరిపూర్ణత చెందుతుందని మీరేగదా చెప్పారు. అలా అని మీరే యిలా ప్రవర్తిస్తే ఎలా చెప్పండి. మీరు విద్యావంతులు మీ వల్లనే దేశానికి చాలా ఉపకారం జరగాల్సివుంది. మన ప్రేమ అమరము. ఎప్పటికీ మన మనస్సులు ఒక్కటీ! నా మీద ప్రేమే ఉంటె మీరు వెంటనే వివాహం చేసుకోని ప్రజోపయోగకరమైన కార్యకలాపాలలో పాల్గొని దేశసేవ చేయండి" అంది డగ్గుత్తికతో, నీళ్లు నిండిన కళ్లతో.

"లల్లీ! యిలా పిల్చే అధికారము ఇప్పుడు నాకు లేదని తెలుసు. అయినా నీ మనస్సెప్పుడు నాదే ననే ధైర్యంతో పిలుస్తున్నాను. నీ కోరికలో ఒక భాగం తప్ప మిగతాది తప్పక నెరవేరుస్తాను. వివాహం చేసుకొని యింకొక యువతిని సుఖపెట్టలేను. దాని వల్ల యింకొకరి జీవితం దుఃఖ భాజనం కావడం తప్ప వేరే ప్రయోజనం ఉండదు. నీవు కోరినట్లె దేశసేవలో పాల్గొంటాను. కానీ! నాచివరికోరిక తీరుస్తానని మాటివ్వు." అంటూ చేయి చాపాను.

ఆమె నాచేతిలో చేయివేస్తూ" నీకోరిక ఎలాటిదైనా తప్పక నెరవేరుస్తాను. అది నా జీవితంలో కడసారి విధిగా భావిస్తాను. " అంది చెంపలపై జారుతున్న కన్నీళ్లతో.

"ఏమీలేదు! నా అంతిమ ఘడియల్లో, దివ్య జ్యోతి ప్రభావిలసితాలైన నీ నయన ద్వయ దర్శన భాగ్యం కల్గించు చాలు. ఆ కళ్లలోకి చూస్తూ నా తుదిశ్వాలు గడపాలనేదే నాకోర్కె" అన్నాను గద్గదికతో.

"తప్పక నీవడుగు వాల్తాను రఘు!" అంది నా చేతులు కళ్లకద్దుకుంటూ జీరవోయిన కంఠంతో,

ఇంతలో వాళ్లయన అటు వస్తూ ఉండటం చూసి ఇద్దరు కళ్లు తుడుచుకొని సర్దుకున్నాము.

తర్వాత నేను ఈ సి ఐ డి ఇనస్పెక్టరుగా చేరి నా శక్తివంచన లేకుండా దేశానికి సేవచేస్తున్నాను. నా కడసారి కోర్కె ఒక్కటీ! నాలలిత దివ్యసుందర నయనాలను చూస్తూ నా చివరి శ్వాసవదలాలని" అంటూ తనచేతిలోని ఫొటోలోకి చూస్తూ తన్మయత్వంతో కళ్లు మూసుకున్నారు సి ఐ డి ఇనస్పెక్టరు రఘుబాబు.

మేము కూడ ఆయన్ని డిస్టర్బు చేయటం ఇష్టంలేక మెల్లగా యిళ్లవైపు బయల్దేశాము, ఆయనలో గుప్తమైయున్న "ప్రేమారాధనకు" ఆశ్చర్య చకితులమవుతూ!



రష్యన్‌లో

మనుస్మృతి

"మనుస్మృతి" లేదా "మానవధర్మ శాస్త్రం" అను గ్రంథం ప్రపంచ ప్రఖ్యాతిని పొందింది. మానవునిమూల పురుషుడయిన మను దీనికి కర్త అని చెప్పబడుచున్నది. కాని అసలు విషయం యిది. క్రీస్తుకు పూర్వం 6—5శతాబ్దాలలో బానిస వ్యవస్థగల పెద్ద రాజ్యాలు రూపొంద సాగాయి. అప్పుడు గణసమాజ సంప్రదాయాలు ఒకరి నుండి మరొకరికి వాచా తెలివిడి అయి అనుసరింప బడుతూ ఉండేవి. కాని ఆ పద్ధతిలో సమాజంసం తృప్త పడలేదు. కొత్తగా రూపొందుతున్న సమాజానికి అనుగుణమైన సంప్రదాయాలు స్థిరీకరింప బడటం అవసరమైనది. అందువల్లనే వేదాలు ఆధారంగా రూపొందింప బడిన ధర్మసూత్రాలు గ్రంథస్థం చేయబడ్డాయి. ఇవి న్యాయచట్టాలుకావు. సంప్రదాయకంగా అనుసరింప బడటానికి సూచింప బడిన ధర్మసూత్రాలు.

ధర్మసూత్రాల నుండీ ధర్మశాస్త్రాలు ఉద్భవించాయి. ఇవి శ్లోకాల రూపంలో ఉన్న న్యాయసిద్ధాంతాలు.

"మను స్మృతి" క్రీస్తుకుపూర్వం రెండవ శతాబ్ది, క్రీస్తు అనంతరం రెండవ శతాబ్దుల మధ్య యిప్పటి రూపంలోకి వచ్చి ఉంటుందని పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

రష్యన్ పండితులు చాలా కాలంగా "మనుస్మృతి" లో ఆసక్తిని చూపుతూ వచ్చారు. అయినప్పటికి వారికి దాని పరిచయం యితర భాషల ద్వారా మాత్రమే కలుగుచుండేది. (మనుస్మృతి మొట్టమొదటి ఇంగ్లీషు అనువాదం 1794 లో జరిగింది. దాని తర్వాత ఇతర యూరోపియన్ భాషల్లోకి అనువదింప బడింది.) సహజంగానే యిటువంటి పరిస్థితిలో యీ గ్రంథాన్ని బహుళ సంఖ్యాకులు చదవటానికి అవకాశం లేకపోయింది.

విస్తిఎలమనోవిచ సంస్కృతం నుండి చేసిన "మను స్మృతి" మొట్టమొదటి రష్యన్ అనువాదం 1913 లో పీటర్స్. బర్గ్‌లో (ఇప్పటి లెనిన్ గ్రాడ్‌లో) ప్రచురింపబడింది. ఆ అనువాదం సరిగ్గాలేదని ఆ కాలంలోనే రష్యన్ సంస్కృత భాషాధ్యయన వేత్తలు అభిప్రాయ పడ్డారు. ఆ అనువాదం ఎడెస్లాంగ్‌చెంప్స్ ప్రచురించిన పాఠంనుండి చేయబడిన నందువల్ల ఆ పాఠంలో ఉన్న పొరపాట్లన్నీ అనువాదంలోకి కూడా దొర్లాయి. అయినప్పటికీ ఆ మొట్టమొదటి రష్యన్ అనువాదం దాని పాత్రను అది నిర్వహించక పోలేదు రష్యాలో బహుళ సంఖ్యాకులు తమ మాతృ భాషలో "మను స్మృతి"ని గురించి తెలుసుకొనసాగారు. భారత విద్యాధ్యయయనవేత్తలే గాక సాంస్కృతిక, మత రంగాలలో పరిశోధనలను జరుపుతున్న వారికి కూడా యీ అనువాదం ఉపయోగ పడింది.

సోవియట్ ప్రజల్లో "మనుస్మృతిపట్ల" గొప్ప ఆసక్తి కనబడుతుంది. సోవియట్ బాలబాలికలకు ఇంకా పాఠశాలల్లో ఉండగానే యీ ప్రాచీనగ్రంథంలో పరిచయం కల్పింపబడుతుంది సోవియట్ విశ్వవిద్యాలయాల్లోని చరిత్రవిద్యార్థులు న్యాయశాస్త్ర చరిత్రను గురించి చదివే సందర్భంలో "మనుస్మృతి"ని గురించి కూడా తెలుసుకొంటారు.

ఎలమనోవిచ్ అనువాదం చాలా కొద్దిప్రతుల్లోనే అచ్చు చేయబడింది అందువల్ల యిప్పుడది అపురూప గ్రంధమయిపోయింది. పాఠకుల కోర్కె ననుసరించి యీ గ్రంథం సవరింపబడి తిరిగి ప్రకటింప బడటానికి నిర్ణయింప బడినది.

సోవియట్ విజ్ఞానశాస్త్ర పరిషత్తు ప్రాచ్యవిద్యా సంస్థలో పరిశోధకునిగా పనిచేస్తున్న జి. ఎఫ్. ఇల్యిన్ అనువాదాన్ని సవరించారు. వీరికి సంస్కృతం బాగా వచ్చు. చాలా కాలంగా ప్రాచీన భారతీయ గ్రంథాలను గురించి పరిశోధనలను జరుపుతున్నారు. రెండు సంవత్సరాలక్రితం ఈయన రష్యన్ భాషలో మహాభారతం సంక్షిప్తానువాదాన్ని ప్రచురించారు.

సంస్కృతంలో "మానవధర్మశాస్త్రం" అని ఉన్న దానికి రష్యన్‌లో "మనున్యాయ సూత్రాలు" అని అనువాదం చేయబడింది. జి ఎఫ్. ఇల్యిన్ కొత్త ప్రచురణకు ప్రవేశికను వ్రాస్తూ "మానవ ధర్మశస్త్రానికి" "మనున్యాయసూత్రాలు" అన్న అనువాదం సరియైనది కాదేనీ, అసలు "ధర్మ" అన్న సంస్కృత పదానికి సరియైన పదం రష్యన్‌భాషలో లేదనీ తెలియజేసాడు.

అనువాదంలో యిలాంటి కొన్ని స్ఖాలిత్యాల యింకా ఉన్నప్పటికీ, యీ కొత్తప్రచురణ సోవియట్ ప్రజలకు మనుస్మృతిని గురించి తెలుసుకోటానికి అత్యంతంగా తోడ్పడుతుంది.

అరిటాకు



[నడకకాని నడకని, పరుగుకాని పరుగుని, అందంకాని అందాన్ని, అనురాగంకాని అనురాగాన్ని మేళవించుకున్న రేవతి, శివనారాయణగారి ఆరవ కుమార్తె, కాలేజీ స్నేహితుడైన శ్రీనివాస్‌తో, స్త్రీ పురుషుల మధ్య ఆదర్శ స్నేహం అసాధ్యమనీ, సాదా స్నేహాలు సాదాగానే వుంచుకోవాలనీ హితవు చెబుతుంది. కాని, శ్రీనివాస్ తన దూరపు బంధువైన సుభద్రని బెదిరించి, రేవతి యిల్లు తెలుసుకొని, వాళ్ల యింటికి వెళ్ళి శివనారాయణగారితో తను ప్రిన్సిపాల్‌గారి మేనల్లుణ్ణని అబద్ధం చెబుతాడు. అప్పటికే రేవతికి ఒక యింజనీరుతో పెండ్లి ముహూర్తం నిశ్చయమయింది. మగపెళ్ళివారికోసమని స్టేషనుకి వెళ్ళిన నాలుగు టాక్సీలూ ఖాళీగా తిరిగి వస్తాయి....ఇక చదవండి.]

ఇంత ఆందోళనలోనూ స్థిరంగా పైకి తొణక్కుండా, వున్నది రేవతి. శివనారాయణగారూ. వెయ్యికళ్ళ ప్రశ్నల మధ్య, వెయ్యినోళ్ళ జవాబుల మధ్య, వెయ్యి చెవుల గుసగుసలమధ్య వారిద్దరూ బింకంగా నిలబడ్డారు. ఇంకో గంటకి మగ పెళ్ళివారినించి టెలిగ్రాం వొచ్చింది.

"అబ్బాయి ఎందుకనో ఈ వివాహానికి సుముఖుడుగా లేడు."

శివనారాయణగారు మగపెళ్ళివారిని కలుసుకున్నారు. పెళ్ళికొడుకుని కారణం అడిగారు.

"నన్నెందుకడుగుతారు! నేను మానసిక బలహీనతల్ని అర్థంచేసుకోగలను. అందుకనే వదులుకున్నాను. ఈ వుత్తరం చదువుకోండి" ఒక కవరు ఇచ్చి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"ఈ కాలంలో కూడా చాలామంది అస్వతంత్రులైన ఆడపిల్లలున్నారు. వాళ్ళు కోరికల వలలోపడి గిలగిల్లాడుతున్నారు. మీరు వున్నతవిద్య నార్జించారు కనుక మీ హృదయం కూడా వున్నత సంస్కారాన్ని పొంది వుంటుందని భావిస్తూ, నన్ను మన్నిస్తూ, ఒక చెల్లెలినిగా మనసారా దీవిస్తూ, నా జీవితం ఆనందయుతంగా సాగగలందులకు మీరు హృదయపూర్వకంగా తప్పుకోవాలని కోరుకుంటున్నాను.

రేవతి"

శివనారాయణగారు అద్భుతపడిపోయారు. రేవతి ఇల్లా ఎందుకుచేసింది? తను ఈ పెళ్ళిగురించి అడిగినప్పుడు, ఇష్టమే అని చెప్పిందే? తనదగ్గర ఆమెకి ఏ భయమూలేదు కదా!

"నువ్వు ఇంతపని చేస్తావు అనుకోలేదు. నిన్ను ముందు అడిగాను కదా! నీ మనస్సుకి వ్యతిరేకంగా ఏ పని చేయననీ నీకు తెలుసుండీ, ఎందుకిల్లా ప్రవర్తించావు?"

రేవతి ఆశ్చర్యపోయింది తనకి వివాహంపట్ల విముఖతలేదు. కాబోయే భర్త, ఇల్లావుండాలి, అల్లావుండాలి అనే నిర్దుష్టభావమేర్పడలేదు. సృష్టి వుత్పత్తి కార్యక్రమం అంతా స్త్రీ పురుషుల కలయికవల్ల ఏర్పడినది. తండ్రి అభిప్రాయాలను గౌరవిస్తుంది. ఆచరిస్తుంది. ఇతనివల్ల తనకే ఆపదా రాదని తెలుసును. కనుక వొప్పుకున్నది. ఇది ఎవరు చేసినపని? ఆమెకి ఆ సమయంలో శ్రీనివాస్ జ్ఞాపకానికి రాలేదు. ఇంజనీయర్ గారిమీద ఆమెకు అనుమానం కలిగింది. ఈ రోజుల్లో చాలామంది యువకుల ప్రవర్తన ఇల్లాగేవుంటుంది. వాళ్లు పైపై ఆకర్షణలుచూసి ప్రేమ ప్రేమ అంటూ మొదలెట్టారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ అబ్బాయిల విద్యలకయిన ఖర్చు వడ్డీతోసహా రావాలని చూస్తారు. అబ్బాయిలు అటు మింగాలేక, ఇటు కక్కాలేక, ఇల్లాంటి అవకతవక పనులు చేస్తారు. ఇంజనీయరుమీద జాలి వేసింది రేవతికి.

"నాన్నా! నా గురించి మీకు తెలియదా! మీ దగ్గర నేనెంత ధృఢంగా పెరిగానో మీకు తెలుసు. కాని పాపం, ఆ ఇంజనీయర్‌కి తల్లిదండ్రులవద్ద నోరువిప్పే అవకాశంలేదు కాబోలు. ఇదంతా నా నెత్తినత్రోసి తను తప్పుకున్నాడు. అంతేకాని ఇంతవరకూ నాకిష్టంలేక పోతే, పెళ్ళిచూపులకైనా రానిస్తానా! మనడబ్బు ఇంత వేస్టుచేస్తే నాకొచ్చే లబ్ధి ఏమిటి?"

శివనారాయణగారికి అర్థం అయ్యింది. పెళ్ళికొడుకు మీద, అతని తండ్రిమీద కోపం వచ్చింది. పిల్లల్ని అంత ఇరుకుగా పెంచటమెందుకు? వాళ్ళ మనస్సుల్లో వున్న విషయాలు తల్లిదండ్రులవద్దే మూగపోనిస్తే, ఇంక ఎవరి వద్ద, భాషరూపం దాల్చగలవు? ఆయన మళ్ళీ రేవతి కోసం, సంబంధాలు వెతకటం మొదలెట్టారు. కాని, రేవతి కథ బాగా ప్రచారం అయిపోయింది. పీటలమీది పెళ్ళి ఎవరి లోపంవల్ల అగిపోయినా, అది కన్యలకి చేసినంత చెరుపు పెళ్లికొడుకులకి చేయలేదు.

"ఆ అమ్మాయి ఎవర్ని కోరుకుందో వారికిచ్చే పెళ్ళిచేయండి. ఈ మారే కాలంలో కూడా, మీకీ పట్టుదల ఎందుకు?" అందరూ ఇదేమాట. రేవతి ఎవర్ని కోరుకోలేదు అన్నా నమ్మేదెవ్వరు? కంటికి కనిపించేదే సత్యం, చెవులకు వినిపించేదే నిత్యం అనుకుంటారు. కంటికి అగోచరమైనదాంట్లోనూ, శ్రవణాలకి అతీతమైన దాంట్లోనూ కూడా సూక్ష్మసత్యాలు ఇమిడి వుంటాయని ఎంత మందికి తెలుస్తుంది? అసలు అంత వరకూ ఎంత మంది ఆలోచిస్తారు? మానవుల ఆలోచనా పరిధి చాలా చిన్నది.

రేవతి పరీక్షలు వ్రాసింది. మామూలుగా ప్యాసయింది. రేవతికి తనగురించి తనకేమి పట్టించుకోకపోయినా, శివనారాయణగారు చాలా నీరసించిపోయారు. ఆయనకి ఇప్పుడిప్పుడే ఈ లోకుల సంకుచితత్వం అర్థం అవుతోంది. రేవతి పెళ్ళి ఆయన జీవితసమస్య అయిపోయింది. రేవతికి కూడా తమని ఏదో దుష్టశక్తి పీడిస్తున్నదా అన్న అనుమానం పట్టుకున్నది.

ప్యాసయినవార్త తెలియగానే శ్రీనివాస్ కన్పించాడు. "ప్యాసయ్యావటగా! ఏం చేస్తావ్!"

"ట్రయినింగ్ సీటుకి అప్లయ్‌చేసాను. యం. ఎ. కి చదువుదామంటే క్లాసురాలేదు" అన్నది రేవతి.

ఎంతో దీనంగా వుంటుందని వూహించి వొచ్చిన శ్రీనివాస్‌కి, రేవతి ఎప్పట్లాగే, దృఢంగా, ఆరోగ్యంగా మామూలుగా మాట్లాడెయ్యటంతో రేవతిమీద, ఒకవిధమైన కసిగల్గింది. తను కనపడగానే, పెళ్ళి ఆగిపోవటం, పరీక్షల్లో క్లాస్ తెచ్చుకోలేకపోవటం, తండ్రి అనారోగ్యం, ఇవన్నీ బాగా తన్ని కృంగదీశాయనీ, తన్ని ఆదరించి, అనురాగం ప్రదర్శించే వ్యక్తులులేరని, ఆమె విలపిస్తుందనీ అనుకున్నాడు. అప్పుడు తను తన ప్రేమనీ, అభిమానాన్ని ఆమెమీద వర్షించాలనీ, ఆమె పన్నీటి జల్లుల్లా దానిని ఆస్వాదించాలనీ వచ్చాడు. రేవతి మామూలుగానే వున్నది. ఇవి అన్నీ తనని ఏ విధంగానూ కదిలించలేనట్లు, ఏ సంఘటనైనా తన్ని కదిలించలేనట్లు గర్వంగా వున్నది అనుకున్నాడు. ఈ గర్వం ఎల్లా అయినా వొదిలించాలి!

"పాపం. అనవసరంగా పెళ్ళి ఆగిపోయింది. పరీక్షల్లో క్లాస్ రాలేదు" సానుభూతి వొలకపోస్తూ అన్నాడు.

"పోన్లెద్దూ, ఆయనకి తండ్రి దగ్గర చనువులేదు కాబోలు నన్ను వుపయోగించుకున్నాడు. ఇంక చదువా! వ్రాసేది మనంకాని పేపర్లు దిద్దేది మనం కాదుగా!

క్లాస్ వొస్తే యం.ఎ. చదువుదామనుకున్నాను. ఇప్పుడు ట్రయినింగ్‌కి వెళ్తాను. ఏదయినా వకటే. మన విజ్ఞానం కొలిచే మానవయంత్రాలు ఏది ప్రసాదిస్తే అదే మహా భాగ్యం!"

"పాపం నాన్నగారు చాలా నీరసపడిపోతున్నారు."

"అది వయోధర్మం శ్రీనివాస్! శరీరంలో జవసత్వాలు వున్నప్పుడున్న మానసిక బలం శరీరం జీర్ణిస్తోన్న కొద్దీ తగ్గిపోతుందనుకుంటాను. లేకపోతే ఆయన కంత బెంగ అనవసరం."

"నీకేంతెలీదు రేవతీ! నీలో పితృప్రేమకూడా లేదని నాకిప్పుడే అవగతమయ్యింది. నీ గురించి ఆయన దిగులుతో కృంగి కృశించి పోతూంటే నీవింత తేలిగ్గా మాట్లాడకలవా?"

"నాకు తేలిగ్గ ఎవర్నీ చూడటం అలవాటులేదు. బెంగ పెట్టుకుని శరీర అనారోగ్యం కలిగించుకుంటే వచ్చే లబ్ధిఏమిటి? వున్న అవకాశంలో, అందంగా ఆరోగ్యంగా, చైతన్యవంతంగా బ్రతుకుల్ని నడుపుకోవాలి"

"నీ వుదాసీనతని, ఆత్మస్థైర్యం అని మెచ్చుకోవాలో, ఆలోచన శూన్యత అని నొచ్చుకోవాలో నాకు తెలియటం లేదు రేవతీ." వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

"బి. ఇ. డి. ట్రయినింగ్‌కి సీటు వొచ్చింది. నాన్నా!" అన్నది రేవతి.

శివనారాయణగారి ఆరోగ్యం చాలా క్షీణించింది.

"ఇలా వచ్చి కూర్చో! నీతో మాట్లాడాలి." వచ్చి తండ్రి దగ్గరగా మంచం మీద కూర్చుంది.

"శ్రీనివాస్ నిన్ను పెళ్లి చేసుకుంటాడుటమ్మా! నీ కిష్టమేనా?"

"నీతో చెప్పాడా నాన్నా!"

"అవును తల్లీ. నిజంగా అమృత హృదయుడు. నిజానికి నేనే అతన్ని మొదట్లో అడిగివుండాల్సింది. ధనవంతులమనే దురభిమానంతో పెద్దవుద్యోగస్థుల చేతుల్లోనిన్ను పెట్టాలన్న వెర్రి కోరికతో, శ్రీనివాస్ నాకొక పెళ్లికొడుకుగా కన్పించలేదు. అందరి నోళ్లల్లోనూ విపరీతప్రచారం అయిపోయింది మన బ్రతుకు. ఈ స్థితిలో దేవదూతలా చెప్పాడు. నీ దంతా అతనిదే! బాగావృద్ధిలోకి వచ్చే యువకుడు. సుందరరూపం." కన్యావరయతే రూపం, అన్నారుకా తల్లీ!" నవ్వాడు శివనారాయణగారు.

రేవతికి జ్ఞాన దృష్టివచ్చింది. శ్రీనివాస్‌కి, తనంటే ఆసక్తి వున్నదన్నమాట. అందుకని! అందుకనే ఇంత నాటకం ఆడుతున్నాడు.

"ఏంతల్లీ!"

"నీ ఇష్టం." అనేసింది. రేవతి.

రేవతికీ శ్రీనివాస్‌కి వివాహం వైభవంగా జరిగిపోయింది.

"మీ కాలేజీ పదిహేనునించి తీస్తారా?" అన్నాడు శ్రీనివాస్.

"అవును," అంది ముక్తసరిగా.

"వెళ్తావా?"

"మీఇష్టం." అంది రేవతి.

"నాఇష్టమైన పని నువ్వెప్పుడూ చేయవు అని నాకు తెలుసును రేవతీ! నీమీద అపూర్వ ప్రేమవల్ల నిన్ను పెళ్లిచేసుకున్నానని అనుకోకు. మీ నాన్నగారి ఆవేదన చూడలేక, నీ చెడ్డపేరు తప్పించాలనే, సద్బుద్ధితో ఈ పెళ్లి చేసుకున్నాను. నువ్వు మునపట్లాగే చదువుకో వచ్చును. నీతో నాకు స్నేహం తప్ప ఇంకేం బంధుత్వమూ లేదు."

"నాచెడ్డపేరు కోసం శ్రమ పడ్డారన్న మాట." నవ్వింది రేవతి. శ్రీనివాస్‌కి ఆమె మీద కోపం రెట్టింపైంది.

"అవును. ఆకలేసినప్పుడే అన్నం తినాలి. అజీర్ణం వున్నవాడికీ. లంఖణాల వాడికీ, కూడా అన్నంయొక్క రుచి, బలంకూడా, పట్టివ్వవు. ప్రేమ బలికోరుతూంది. నామాటల్ని నువ్వు నిర్దాక్షిణ్యంగా, నిర్లక్ష్యంగా తృణీకరించావు."

రేవతి మౌనంగా నించుంది.

"నువ్విప్పుడు మౌనంగా నించోటంలో నాకు సుందర గ్రీక్ శిల్పం స్ఫురించటంలేదు. నిర్మోహత్వం అనే టిష్యూ ముసుగులోంచి కనపడే నైరాశ్యమూర్తి గోచరిస్తోంది. నీ అహంభావం వల్ల ఎంతటి జీవిత అమూల్య వరాన్ని కోల్పోయావో నీకు తెలిసిరావాలి. ఒక్క పున్నమి కోసరం నెలరోజులు నిరీక్షిస్తారు వ్యక్తులు. కాని నేను అమావాస్య కోసరం నిరీక్షించాను. మన ఆశల లేసులు. ఎంత గట్టిగా పట్టుదారాలతో జిలిబిలిగా, అర్థం కాకుండా, అల్లబడ్డాయో నాకు తెలిసి వస్తున్నది. నా

నిరీక్షణని నువ్వెలా, నిర్లక్ష్యంచేసావో నా ఆవేదనని నువ్వు ఎల్లా అపహాస్యంచేసావో, నా అనుభూతి అంతా నీకు కలగాలని, నీలో అల్లాంటి నిరీక్షణ ఆవేదన కలగాలని నేను కోరుకుంటున్నాను.''

''నేను విద్యావతి నవటం వల్ల, నా అభిప్రాయాలు రూపు దిద్దుకుని బలంగా నిలబడ్డాయి. నేను నిర్మోహిని, అని కానీ వైరాగ్యంతో జీవితం అంతా గడుపుతానని కాని చెప్పలేదు. స్నేహాలు చేసి చేసి, ప్రతీవాళ్లూ ప్రేమ పాఠాలు వల్లె వేస్తోంటే నాకు చిరాకనిపించేది. నాదయిన ప్రతివస్తువునూ, నేను జాగ్రత్తగా ప్రాణాధికంగా కాపాడు కుంటాను. అంతే కాని మీ మీద ఏ నిర్లక్ష్య భావమూ లేదు. "వూకదంపు కబుర్లల్లా సినిమాపాటల్లా, అస్తమానూ ప్రేమ ప్రేమ అని మాట్లాడుకోవటం, ఆ పదాన్ని వ్యర్థపుచ్చటమే అవుతుంద. మీరు నావారుకావటానికి, ఇంత విశ్వప్రయత్నం చేయవలసిరావటం నా అందానికి గర్వకారణం కూడా అవుతున్నది.'' శ్రీనివాస్ చలించాడు.

''ఒకమాట! నీ కప్పుడు ఆ ఇంజనీయర్‌తో వివాహం జరిగిపోతుందనుకో! ఆయన్ని నాలా ప్రేమించకలవా!" రేవతి ఎప్పుడూ అబద్ధంచెప్పదు. ఆమెలో కలిగిన ఏ భావమూ, శబ్ద రూపము తాల్చే సరికి వికృతి నొందదు. అదే రేవతిలోని ప్రత్యేకత!

''ఆయనకి నాకూ వివాహం జరుగుతే అల్లానే ప్రేమిస్తాను. ఇప్పుడు దాటిపోయినంత మాత్రాన్న ఆ మనిషికాలేదు కదా అని విచారించటం లేదులెండి." దృఢంగా అన్నది.

శ్రీనివాస్‌ది ఉద్ధృత ప్రకృతి. అతనిలో ఏదో తీవ్ర సంచలనం కలిగింది.

''నువ్వు ఇంజనీయర్ భార్యవైనప్పుడు, నన్ను గురించి తలుచుకుంటావా! నీగురించి అంత తపనచెందే వాణ్ణికదా! ఎల్లావున్నాడో పాపం, అని బాధపడేదానివా?"

తాళిగట్టిన భర్త అల్లా అడగగానే ఏ యువతైన వెంటనే "మిమ్మల్ని తలుచుకుని తలుచుకుని దుఃఖపడే దాన్ననో మీకోసం ఆత్మహత్య చేసుకునేదాన్ననో చెప్పేసి వుండును. భర్త ప్రేమికుడూ, ఒకరైతే యువతులకి మాట్లాడుకోవటం చాలా తేలిగ్గ వుంటుంది. రేవతికి, ప్రేమికులు ఎంత బోళాగా వుంటారో, వారెంత సులువుగా అబద్ధాలు నమ్మేస్తారో తెలుసును. కాని అబద్ధం చెప్పి తనని తను వంచించుకోవటం ఆమె ప్రకృతికి నచ్చదు. యువతుల ఎవర్ని పెళ్లాడితే వాళ్లనే ప్రేమించును. ప్రేమ, పెళ్లి అనే విషయాలు విత్తుముందా, చెట్టుముందా అన్నంత అగాధమైనవి. ఆదిమ మానవుల్లో ఈ పదాలు తెలియకుండానే స్త్రీ పురుషులు ఒకటిగా జీవించటం మొదలెట్టారు. భాషనాగరీకమైనప్పట్నించీ, బంధుత్వాలు, సౌందర్యాకర్షణ ప్రతిభావంతంగా పెరగజొచ్చాయి. కవులు గాయకులు చిత్రకారులు, శిల్పులు, ఈ అమర ప్రేమ ఆధారంగా తమ తమ కళలని విస్తృత పరుచుకోగలిగారు. పితృ ప్రేమ, భాతృ ప్రేమ, భగ్న ప్రేమ, నిమగ్న ప్రేమ, ఈ ప్రేమ అనే పదం, కలకత్తా కాళీమాత నాలికలా రేవతిని భయపెట్టింది. ఆమె నిజంగా నీతిగా దృఢంగా బ్రతకాలనుకుంది, అదే ఆదర్శం చివరంటా, చీరచెంగుకు ముడేసుకుకూర్చుంది.

''ఎందుకని బాధ పడాలి?''

''నీ ముందు ఎంతో అనురాగం ప్రదర్శించే వాణ్ణికా!"

"నాకేసి చూడండి! నేను ఇంజనీయర్‌గారి భార్యని కాలేనందుకు విచారించలేదు. అల్లానే అప్పుడు, అంటే ఆయనగారి భార్యని అయివుంటే మీరూ గుర్తువుండరు. ఆయనతో ఎల్లాఅయితే సంసారం చేద్దునో మీతోనూ, ఆ తీరులోనే సంసారం చేయిటానికి సిద్ధమైయున్నాను.''

"మరి నీతో వివాహం జరగకుండా వుండి నేను ఆత్మహత్య చేసుకుంటాననుకో! అప్పుడు?" తెలుసు కోవాలన్నదుగ్గగా అన్నాడు

''ప్రేమకోసం అంటూ ఆత్మహత్య చేసుకునేవాళ్ల మీద నాకు సద్భావంలేదు. అదొక కీర్తికండూతి అహం భావం. తన జ్ఞాపకంతో అవతలివ్యక్తి కుమిలి కుమిలి నశించిపోవాలన్న దుర్బుద్ధి అల్లాంటి ఆలోచన్లు మనసు లోనికి రానీయటం శరీరానికి ఆరోగ్యప్రదంకాదు."

"ఇవి నీకు ప్రేమికులపట్ల కలిగిన స్థిరాభిప్రాయాలు. నేను నీతో కలిసి జీవించలేను. ''నాకు నీతోనే లోకం" అనుకొనే మనిషి కావాలి. వెతుక్కొందుకు ఈ విశాల ప్రపంచంలోకి ఏకాకిగా వెళ్లిపోతాను."

"మీకు నావల్ల అసంతృప్తి కలగకుండా చూడ గలననే నమ్మకం నాకువుంది."

"అది నీవల్ల జరిగేపనికాదు."

"ఇప్పుడు భర్తృ పరిత్యక్తనన్న మాట" అన్నది రేవతి.

"నీకు భయం వెయ్యదులే! ఎవర్నో ప్రేమించటం వల్ల పెళ్లి ఆగిపోయింది అనే అపవాదునించి ఈ బిరుదుకి ట్రాన్స్ఫర్ అయ్యావు. ఈ సారి లోకం సాను భూతి నీకు పూర్తిగా లభిస్తుంది. అంతా నన్నే అంటారు. అందమైనది, చదువుకున్నది కావాల్ని చేసుకుని గంగ లోకి త్రోశాడు అని నన్నే తిట్టుకుంటారు. నాకు నీమీద అపూర్వ ప్రేమ వదల్లేదనుకుంటాను. నీ అపవాదుని నామీద వేసుకుని వెళ్లిపోతున్నాను."

"ఎప్పుడూ రారా!"

"రాను. నా అడ్రస్ నీకు దొరక్కుండా కట్టుదిట్టం చేసుకున్నాను."

రేవతి ట్రయినింగ్ ప్యాసయ్యి వుద్యోగం చేస్తుం టోంది. తన అభిప్రాయాలు తను ఎందుకు చెప్పిందా అని ఇప్పుడు చింతిస్తేమటుకు లాభం ఏమిటి! మనం అనుకున్నదేదో మనం చెప్పి జీవితంలో నెగ్గుకురావటం ఎంతకష్టం! అబద్ధంకధ! నిజం జీవితం! అబద్ధం నలుపు జీవితం తెలుపు! సగం అబద్ధం సగం నిజం కలిపి జీవితకధలూ, కధల్లాంటి జీవితాలూ ఈ నిత్యం మార్రే రంగులలో ఒకే రంగుని వుపయోగిస్తే ఎవరికి నచ్చు తుంది? మారేవాళ్లతో మారాలి. మారని మనుష్యులూ కూడా లేరు. పదిసంవత్సరాల కాలంనించి, రేవతి మారిన మనస్సుతో, తీరని తమస్సులో కొట్టుకలాడుతోంది.

గాలిజోరుగా వీస్తోనే వుంటుంది. వాళ్లు రోజూ అక్కడ, టెన్నిస్ ఆడుతోంటారు. అరటిచెట్టు వేసిన ప్రతీ ఆకూ చిరుగుతూనే వుంటుంది. అయినా, అరటి చెట్టుకి లెక్కలేదు. పువ్వు పూస్తూంటుంది. గెలవేస్తూం టుంది. పళ్లుపండుతూంటుంది. అరిటాకులాంటిది స్త్రీ జీవితం! ప్రతిక్షణం ఆమె కోరికల పట్టు గుడ్డపీ "చిమ్మెట"లు కొట్టేస్తూనే వుంటాయి. అయినా స్త్రీ ఏవేవో అతుకులుపెట్టి, ఆనందం అనుభవిస్తున్నానను కుని, తృప్తిపడుతుంది. రేవతి ఆశాహృదయంతో చినిగిన అరిటాకల్లే శ్రీనివాస్ కోసం ఎదురుచూస్తోంది.

తిరిగి రానివీ తీయని ఘడియలు

మానేపల్లి సత్యనారాయణ

నీ కోసం -
యీ సుందరమైన పచ్చికల్ని
పూలతో పరుస్తాను.
నీవు వస్తావని
అందంగా వుంచుతాను.
రా! నారాజా! పూలరాజా!
యెదురు చూసే నాకోసం -
వచ్చి -
అనాఘ్రాత పుష్పాల్ని,
మల్లెల్ని,
నీ కోసం -
నన్ను ప్రోగు చేసుకోనీ.
తిరిగి రానివీ
తీయని ఘడియలు,
సెలయేటి ప్రక్కన పూలు
నీ కోసమే వికసించాయి.
నీ కర్పింప బడాలని కుసుమించాయి.
ప్రపంచ మంతా గాఢంగా నిద్రిస్తోంది.
కాని,
యిప్పటి కింకా నీ నుండి
జవాబు రాలేదు నాకు.
పచ్చదనాలు
దండలు చేసి దాచుకున్నాను.
అవేల మాట్లాడతాయి పాపం!
విధి నిర్ణయాన్ని
మార్పు చేయడం
ఎవరి సాధ్యం ... ?
నా రాజా!
పుష్పాల్ని ప్రేమించే రాజా!
రావూ —
నీ కోసం యెదురు చూసే
నా కోసం ... ?

[కాశ్మీర రాజ్ఞిరచయిత్రి హబ్బా ఖాటూన్‌కు కృతజ్ఞతతో]

ప్రాయశ్చిత్తం

జోగులమ్మ గారింట్లో నల్లపిల్లిది ఒక ప్రత్యేకస్థానం. ఆ నల్లపిల్లికీ యింటి కోడలు లలితకీ బద్ధవైరం. ఒకరి నొకరు అతి జాగరూకతతో కనిపెడుతూంటారు. ఇలా వుండగా లలిత విసిరిన ఆయుధం నల్లపిల్లికి తగలగా, ఆ బ్రహ్మహత్యా పాతకం గురించి అవధానులుగారూ ఇందిరమ్మ యిత్యాదులు చర్చ ప్రారంభిస్తారు. ప్రాయశ్చిత్త మేమిటవుతుందో చదవండి.

అసలే అవధాన్లు గట్టి పిండం. అతగాడి చెప్పుడూ లాభసాటి బేరమే. అవకాశం దొరికితే చాలు దొరికినంత వరకూ నొల్లుకునే రకం. అంచేత వున్నవీ, లేనివీ కల్పించి చెప్పి అమాయకప్రజల్ని మోసంచేస్తూనే బ్రతకనేర్చినవాడు కావడంచేత, జోగులమ్మగారింట జరిగిన దారుణకాండకు చిలవలు, పలవలు అల్లి బాగా సంపాదించుకోవాలనే నిర్ణయానికి అతను చాలా ముందుగానే వచ్చాడు.

అవధాన్లు ఒక్క క్షణకాలం ఆలోచించి "ఏ నరకమో చెప్పడం అంత తేలికకాదు. హత్యజరిగిన కాలాన్ని బట్టి, ఆ క్షణంలో తిధి నక్షత్రాల స్థానాలనుబట్టి చేసిన పాపానికి వచ్చే ప్రతిఫలం లెఖ్ఖకట్టాలి. ఎన్నిగంటలకు హత్యజరిగిందో చెబితే లెఖ్ఖగట్టి తేలుస్తాను" అన్నాడు.

"ఉదయం సుమారు ఆరుగంటలకు" అంది జోగులమ్మ లలితకు ఎట్టినరకం వ్రాసి పెట్టబడి వుందోనన్న భయం ముఖంలో కదలాడగా.

అవధాన్లు కొద్ది నిమిషాలు కళ్లమూసుకుని, పెదిమలు ఆడించి, వ్రేళ్లమీద ఏవేవో లెఖ్ఖలుకట్టి కళ్లు తెరిచాడు. కూడా తెచ్చిన పుస్తకాలలో ఏవేవో చదువుకుని, ఆందోళన వ్యక్తమయే ముఖంతో నలుదిశలా చూస్తూ "హే రామా! హేకృష్ణా!" ఎంతదారుణం! ఎంత మహాపాపం! ఉదయాన్ని లేస్తూనే పిల్లిని చంపడం కంటె మహాపాతకం మరొకటి లేదు. పదివేల గోవుల్నీ, వెయ్యిమంది బ్రాహ్మణుల్నీ చంపినంత పాపానికి సమానం. అందులోనూ నల్లపిల్లిని చంపడంమరీని. హత్యచేసిన వ్యక్తి యొక్క ఆత్మకు నరక యాతనలనుండి విముక్తి లేనేలేదు. అయ్యో జోగులమ్మగారూ! మీ కోడలు ఎంతటి పాపాన్ని ఒడికట్టుకున్నారండీ!" అంటూ మొసలి కన్నీళ్లు కార్చాడు అవధాన్లు సానుభూతినీ, ఆందోళనీ వ్యక్తపరుస్తున్నట్లుగా.

అవధాన్లుగారి మాటలువిని అక్కడున్నవాళ్ళంతా నిశ్చేష్టులైపోయారు. జోగులమ్మగారు మరీను. ఆవిడకు ఒక్కసారిగా దుఃఖం పొంగుకువచ్చి వెక్కి వెక్కి ఏడ్వ సాగింది. జోగులమ్మ పరిస్థితిచూసి అక్కడ చేరినవాళ్ళ హృదయాలన్నీ ద్రవించిపోయాయి.

సమవయస్కురాలైన సుందరమ్మ జోగులమ్మను సముదాయిస్తూ "అవధాన్లుగారూ! ఈ పాపకర్మ నుంచి విముక్తికావడానికి మార్గాలు తమ గ్రంధాల్లో ఏమీ చెప్పలేదా అండీ!" అనడిగింది.

"అయ్యో! లేకేమమ్మా? కావల్సినన్ని వున్నాయి. అవి చెప్పడానికే కదా నేనిక్కడికి వచ్చింది. నర మానవులను పాపకర్మలనుండి విముక్తి చేయడమే కదా మా వృత్తి. అయితే, ఈ హత్యాపాతకం బ్రహ్మ హత్యాపాతకం కంటె ఘనమైంది కనుక, ప్రాయశ్చిత్త కర్మకు అధికవ్యయం అవుతుంది. మీరు "సరే" అంటే పని నడిపిస్తాను" అంటూ అభయహస్తం చూపించాడు అవధాన్లు.

"ఏమాత్రం వ్యయమౌతుందేమిటి?" ఇందిరమ్మ అడిగింది

"అబ్బే! మీరేమీ గాభరా పడకండి. ప్రాయశ్చిత్త కర్మకాండకి కావల్సిన సామగ్రిని క్లుప్తంలో నేనే సమకూరుస్తాను. పోతే, ఈ పాపపరిహారంకోసం, దాన ధర్మాలకోసం ఖర్చు అవుతుంది. ఒక బస్తా బియ్యం,

అరబస్తా కందిపప్పు, అందుకు తగిన ఉప్పు, చింత పండు వగైరా చిల్లరదినుసులు, తగినన్ని కాయగూరలు మూడురకాలు, కల్తీలేని ఆవునెయ్యి ఎనిమిది శేర్లు, గురుదక్షిణ ఒక్క బంగారుకాసు — అంతే "

అవధాన్లు పట్టిక విని జోగులమ్మ గుండె బాదుకుంది. "అమ్మయ్యో! దీనికి మూడు, నాలుగు వందలు ఖర్చవుతాయే!'' నని.

జోగులమ్మ అవస్థని అర్థం చేసుకున్న అవధాన్లు ''జోగులమ్మగారూ! అలా గుండె బాదుకుంటారెందుకు? కావల్సిన దానికంటె తక్కువే చెప్పాను. ఇంతకు తక్కువైతే పనిజరగదు. ప్రాయశ్చిత్తం అంటే మాటలతో పనికాదు. మీ కోడలు జరిపిన దారుణహత్య వల్ల సంప్రాప్తించిన పాపం, తద్వారా మీ వంశానికి వచ్చిన కళంకంతో పోల్చిచూస్తే, ఇదేమంత ఎక్కువ ఖర్చుకాదు. తర్వాత మీ యిష్టం" చేతులు దులుపుతూ అన్నాడు.

అక్కడున్న వాళ్ళందరికీ అవధాన్లు చెప్పిన మాటలు బాగానే తోచాయి.

ఇందిరమ్మ అంది "అవును అవధాన్లుగారు నిజం చెప్పారు. పాపం పెరిగినకొద్దీ ఖర్చుకూడా పెరగడం సహజం'' అని.

"డబ్బుకోసం చూసి చేసిన పాపాన్ని వదిలించుకోక పోవడం అంత మంచిదికాదు జోగులమ్మా!" అంది సుందరమ్మ ఇందిరమ్మను సమర్థిస్తూ హెచ్చరికలా.

"వారికేమమ్మా! డబ్బున్నవాళ్ళు. వారికి ఈ ఖర్చొక పెద్దలెఖ్ఖా!" వంటాయన వంతపాడాడు.

చుట్టూవున్న వాళ్ళంతా "భళి, భళి" అన్నారు.

జోగులమ్మకి ఏంచెయ్యడానికీ తోచలేదు. నిస్సహాయురాలై చుట్టూవున్న మనుషులకేసి చూసింది. ఏ నిర్ణయాన్ని చెప్పడానికి ఆమె సాహసించలేక పోయింది.

తన సూచనలకు ఏకగ్రీవామోదం లభించినందుకు అవధాన్లు బ్రహ్మానంద భరితుడైపోయేడు. ''అమ్మా, జోగులమ్మా! మీ కోడలు చేసిన పాపాన్ని ఒక్కసారి చూడు, ప్రాయశ్చిత్తానికయ్యే ఖర్చుకోసం వెనకాడకు." అంటూ అవధాన్లు మరింత నొక్కి అన్నాడు.

జోగులమ్మకు గత్యంతరంలేక "సరే ఏంచేస్తాం. మీరు చెప్పినట్లు చెయ్యక తప్పుతుందా!" అంది.

జోగులమ్మ అన్న ఈ మాటలు మరోవిధంగా అర్థం చేసుకున్నాడు అవధాన్లు. ఈ ప్రాయశ్చిత్తమేదో తన కోసం, తన బలవంతం మీద జోగులమ్మ చేయ సంకల్పించినట్లు భావించాడు. "ఏమండోయ్ జోగులమ్మగారూ! మీరు ఈ ప్రాయశ్చిత్తం చేయిందుకోవాలని సంకల్పించు కుంటేనే జరిపించండి. ఇందులో నాకు వచ్చే లాభం ఏమీలేదు. నాకోసం మీరేదో చేస్తున్నట్లు భ్రమించకండి. అలా అనుకున్నట్లయితే మీ ప్రయత్నం మానుకోండి. పిల్లి బ్రహ్మహత్యా పాతకానికిగాను మీకు సంభవించే కష్టనష్టాలను భరించడానికి సిద్ధంగా వుండండి. నాకేం? నేపోతాను" అంటూ జోగులమ్మను భయపెడుతూ, కోపాన్ని ప్రదర్శిస్తూ మూటా ముల్లూ సర్దుకో సాగాడు అవధాన్లు.

పరిస్థితి విషమిస్తుండడం గమనించి "అవధాన్లుగారూ! కోపగించకండి. కాస్త శాంతించండి. జరిగిన ఉదంతానికి జోగులమ్మ ఎలా తల్లడిల్లిపోతోందో గమనించండి. మీరేం చెప్పినా, ఏం చెయ్యమన్నా కాదనదు ఆవిడ. ఆ హామీ మేం యిస్తున్నాం" అంటూ ఇందిరమ్మ, సుందరమ్మలు ఒక్కపై అవధాన్లు గారిని అర్థించారు.

అప్పటికే జోగులమ్మ అవధాన్లు పాదాలమీదపడి క్షమాపణ వేడుకుంటూ, తనసంసిద్ధతను తెలియజేసుకుంది. ఇంకా ఏమేం కావాలని అడిగింది. అప్పటికి కాని అవధాన్లు మామూలు మనిషికాలేదు

"సరే, ఇక వినండి. ఈ ప్రాయశ్చిత్తకర్మ సుమారు 21 రోజులు జరుగుతుంది. ప్రతి రోజూ సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో మంత్రజపం, హోమం వుంటాయి. ఈ ఇరవై ఒక్కరోజూ రెండుపూటలు నలుగురు బ్రాహ్మణులకు సంతర్పణచేయాలి" అంటూ కొద్దిక్షణాలు ఆగి ''మీరేం చింతించకండి. రోజూ మీరు వెళ్ళి నలుగుర్ని పిల్చుకు రానక్కర్లేదు. నా ఒక్కడికే

శ్రీ ఎ. ఎస్. రామారావు



శ్రీ జమ్మి లక్ష్మీ నరసింహం, శ్రీమతి లక్ష్మీ నరసమ్మ
18-5-1963 వ తేదీ విజయనగరంలో జమ్మి బిల్డింగ్స్‌లో షష్టిపూర్తి
మహోత్సవము వైభవముగా జరిగింది.

మీరు రెండుపూటలా తిండి పెడితేచాలు మీకు నలుగురు బ్రాహ్మణులకి భోజనం పెట్టినంతటి పుణ్యం వస్తుంది." అన్నాడు.

"అవునవును. అవధాన్లుగారి అవతారాన్ని చూస్తేనే ఆ సత్యం తెలుస్తుంది" అన్నాడు వంటాయన పరాచికం ఆడుతున్నట్లుగా.

కాని, అవధాన్లు ఆ మాటలు వినిపించుకోనట్టే "సరి, సరి భోగులమ్మగారూ! ప్రాయశ్చిత్తానికి కావల్సిన వస్తువు లన్నీ వివరంగా చెప్పేవున్నాను. నాకు ముందుగా ఒక ఏభై రూపాయిలు యివ్వండి. చనిపోయిన పిల్లికి బదులుగా, ప్రాయశ్చిత్తం జరిపించడానికిగాను సువర్ణ మార్జాలం చేయించుకువస్తాను. ఈ లోపున కావల్సిన సామానన్నీ బజార్నుంచి ...."

యింకా అవధాన్లుగారు మాటల్ని పూర్తి చేయనేలేదు. వంటింటి వైపునుంచి పని మనిషి గాభరాగా వగరుస్తూ అక్కడికి వచ్చింది.

పనిమనిషి అలా రావడంచూసి భోగులమ్మ "ఏమే! ఏంజరిగిందేమిటి? ఎందుకలా ఖంగారుగా పరుగెత్తి వచ్చావు?" ప్రశ్నించింది.

పనిమనిషి ఆయాసపడుతూనే "అమ్మగారూ! నల్ల పిల్లి పారిపోతోందమ్మగారూ!" జవాబిచ్చింది.

(భగవతీ వారి సౌజన్యం కృతజ్ఞతతో)

నేటికాలానికి

శాకుంతలం - నీతి

మహాకవి కాళిదాసు వ్రాసినటువంటి మహా దృశ్యకావ్యాలలో అభిజ్ఞాన శాకుంతల నాటక మొకటి. ఇందులో కథానాయకుడు, దుష్యంతుడు, రాజు, ఏండ్లు మీరినవాడు పైగా వివాహమైనవాడు. వివాహానికి ముందే హంసపదిక అనే వేశ్యకూడా ఉంది. సంస్కృత నాటక నాయకులందరున్నూ పెద్దవాళ్లే. యువకులు కారు. ఎక్కడనో ఒక మాధవ్యుడు అనిరుద్ధుడు లాంటివారు తప్ప, నవయౌవనులుకూడ కారు. ఐతే, నాటికాలానికి కన్యలకు చక్కని త్రోవ చూపిందీనాటకం. ఈ నాటకాలలో రాజుల అవినీతి, దుష్టచర్యలు చూపబడ్డవి. వీరికి నేస్తగాడు ఒక విదూషకుడు, బ్రాహ్మణుడు ఉంటాడు. వాడికిరాజుల అంతరంగాలు తెలిసి ఉంటుంది. అప్పటికప్పుడు ఏదో విధంగా వారి రాణులకు నచ్చచెప్పి సరిపుచ్చుకొనేటట్లు చేస్తూంటాడు. ఇటువంటి భావాలు, కలతలు, సామాన్య ప్రజల ఇండ్లలో రావడం సహజమే. ఎప్పటికీ అంతే. రాజులు మాత్రం మానవులు కారా? ఆ కాలంలో బహుభార్యాత్వం సహజం కాబట్టి కాళిదాసు తన శాకుంతల నాటకం మూలంగా రాజులకంటె కన్యలకు మంచి హితోపదేశం హెచ్చరిక చేసినాడు.

శాకుంతల నాటకంలో నాయక శకుంతల. క్షత్రియకన్య. అప్సరస్త్రీకి పుట్టినది. మేనక కూతురు. అనాధ. కణ్వాశ్రమంలో కణ్వ మహర్షుల వారిచేత పెంపబడింది. ఈమె చెలికత్తెలిద్దరున్నూ బ్రాహ్మణ కన్యలు. కణ్వమహర్షి శిష్యులు చిన్న చిన్న మునికుమారులు. ఈయన ఏదో ఒక యజ్ఞమని యాగమని అది అని, ఇది అని తరుచూ ఆశ్రమంలో ఉండరు. కాబట్టి మునికుమారులు ఇతరత్ర వ్యవహారాలను చూచుకోవడం మామూలు, ఆశ్రమానికి కాపలా కూడ.

అదే నేటికాలానికి చూద్దాం- మనకు అనుకూలంగా కణ్వాశ్రమం వంటివి కాలేజీలు, స్కూల్సు, హాస్టల్సుగా బయలుదేరినవి. కణ్వ మహర్షిలాగ కాలేజి ప్రిన్సిపాలు ఉండడం, ప్రిన్సిపాలు దయార్ద్ర హృదయం గలవాడుగా, ఏదో ఒక కాన్ఫరెన్సో అని మీటింగ్‌లనీ బయట తిరుగుతూ ఉండడం జరుగుతుంది. ఈ కాలేజి హాస్టలు మీదేపై పెత్తనమంతా ఏదో ఒక వార్డనమ్మ వృద్ధ గౌతమి లాంటిది చూచుకొంటుంది. శకుంతల వంటి కన్యలు ఇటువంటి వాతావరణంలో పెరుగుతారు. ప్రిన్సిపాలుగారు లేని సమయాలలో వైస్ ప్రిన్సిపాలు, ఇతర ప్రొఫెసర్లు కణ్వ శిష్యులలాగ కాలేజి పనులను గమనించుకొంటారు.

ఆనాటి శకుంతల చెట్లు చేమలకు నీళ్లుపోస్తూ తన చెలులతో ఆడుకొంటూ, ఆశ్రమ మృగాలతో విచ్చలవిడిగా దుముకుతూ; వంటజోక్యం లేకుండా పెరిగింది. ఈ నాటికి ఇటువంటి హాస్టలులో పెంపబడు శకుంతల కూడ ఇంచుమించు అటువంటి జీవితమే గడుపుతుంది. వంటయేమో రాదుగదా, కాలానుగుణ్యంగా ఆడుకోవటంలోనేతేడా కనబడుతుంది. బాడ్మింటన్, టెన్నికాట్, కార్యమ్ బీచ్ షికార్లు, సినిమా క్లబ్బు ఇవే నేటికాలపు పొద్దుపోవడానికని ఏర్పడిన ఆటలు, చదువులతో సహా.

కాళిదాసుని శకుంతల కన్యగా, ఆవిధంగా సంతోషంగా ఉంటే దుష్యంత మహారాజు వేట మిషపెట్టి ఆ కణ్వాశ్రమానికి వచ్చాడు. శకుంతల అంతవరకు ఏ పురుషుణ్ణి చూచి ఎరగదేమో,

మొదటి పర్యాయంగా రాజదుస్తులలో ఒక అందమైనవాడిని చూచింది. ఆమె ఇదివరకు చూచిందంతా గడ్డాలు పెంచిన మునికుమారులే. శకుంతల క్షత్రియకన్య. దుష్యంతుడు క్షత్రియుడు. విదూషకుడు, ఎప్పుడును రాజును వెంటనంటి తిరుగువాడు, రాలేదు. శకుంతల చెలికత్తెలు బ్రాహ్మణకన్యలు గనక, వారికి ఏవిధమైన భావమును తోపలేదు శకుంతలకు మట్టుకు దుష్యంతుని చూడగానే తన పురుషుడుగా వరించాలని తోచింది. తండ్రి ఊళ్లోలేరు. కాని, తన చెలికత్తెల సాయంతో 'గాంధర్వ విధి' అని ఒకటి ఉండడం మూలాన, ధైర్యంగా ఉంగరాలు మార్చుకొని దుష్యంతుని వివాహమాడింది. క్షత్రియులకు తొందర ఎక్కువ పైగా సాహసంకూడా ఉంటుంది. దుష్యంతుడు కొన్ని దినాలు ఉండి, శకుంతలకు నచ్చ చెప్పితన రాజ్యానికివెళ్లిపోతాడు. భారత కథలో లోకానికి భయపడి శకుంతలను వదలివేస్తాడు. శకుంతలను రక్షించుకొని ఉండవచ్చును. కాని రాజుల స్వభావాలే అంత. కాని కాళిదాసు దుర్వాసులవారి శాపమును తెచ్చిపెట్టి కథను పెంచాడు. దుర్వాసులవారి శాపం, పాపం శకుంతలకు తెలియదు. చెలికత్తెలకు తెలుసు. కాని భయంచేత, కణ్వ మహర్షులవారు ఊరినుండి వస్తూనే చెప్పకుండ, వృద్ధ గౌతమికిగాని, ఇతర మునికుమారులకుగాని తెలియనీయకుండా దాచారు. కణ్వ మహర్షులవారికి గనక తెలిసి ఉంటే జాగ్రత్తపడి ఉందురు. కడకు చెలికత్తెలవరైన కూడ పోయి ఉంటే, ఆ ఉంగరాన్ని జాగ్రత్తగా కాపాడి శకుంతలకు ఎటువంటి పరాభవమున్ను జరగకుండా చేసి ఉందురు. శకుంతల గర్భవతి అని తెలియగానే కణ్వ మహర్షులవారు ఆమెకు మంచిబుద్ధులు చెప్పి తానే తల్లీ తండ్రీగా, వృద్ధగౌతమి, ఇతర మునికుమారులతో దుష్యంతుని వద్దకు పంపుతారు. దుష్యంతుడు ఆమెను నిరాకరిస్తాడు. ఆమె అతని పత్ని. విధిగా గాంధర్వ విధానమున పెండ్లియై ఉంగరాలు మార్చుకొన్నసంగతి అతనికి గురుతుకు రాలేదు. అసలా ఉంగరం ఎటుమాయమైందో తనకు తెలియక, ఆధారాలు లేని అనాథలాగ నిలబడిన శకుంతలను, వెనకకు మరల పిలుచుకొని పోవడానికి మునికుమారులకు మనసొప్పలేదు. ఆనాటి సంఘంలో, సమాజంలో భర్తచేత నిరాకరింప బడ్డ స్త్రీకి చోటులేదు. మునికుమారులు దుష్యంతుని తిట్టారు. ఇక ఆమెగతి అంతే అని, ఆమెను ఆరాజసభలోనే వదలి హాయిగ తమ దోవను వెళ్ళిపోయారు. గత్యంతరములేని ఆమెను తల్లియైన మేనక తనతో కూడ మారీచాశ్రమానికి కొనిపోతూంది.

నేటికాలానికి వద్దాం. నేటి శకుంతలను వంచించుటకు ఏదో ఒక జమీందారుని కొడుకు చదువులకనో ఉద్యోగము మూలకంగానో పల్లెలనుండి నగరాలకు వస్తాడు. ఈ కాలేజీల ప్రక్కనే ఎక్కడనో ఒక ఇంట్లోగది ఒకటి తీసుకొని కొన్నిదినాలు ఉంటాడు. అతని కారు, వైభవాలను చూచి మోసపోతూంది ఒక అమ్మాయి. చాల దగ్గర పరిచయమై బీచ్, క్యాంటీను, సినిమాలకని బాగా ఆ అమ్మాయితో తిరిగి 'రిజిష్టరు మ్యారేజి' అనేటటువంటి వివాహమును, ఉంగరాలు మార్చుకోవడాలు జరిపించుకొని ఆ అమ్మాయి గర్భవతి అని తెలియగానే తప్పించుకొంటాడు. ఈ జమీందారుని కొడుక్కి చిన్నప్పుడే వివాహమై ఉంటుంది. కాకపోతే ఒక మేనరికమైనా కాచుకొని ఉంటుంది. లేదా ఈపిల్లసంగతి తెలిసిన పెద్ద

శ్రీమతి వేదం జానకి


వాళ్లెవరైనా తర్వాతనైనా మంచిపెళ్ళి ఒకటి చేస్తారు. 'లా' (న్యాయం) పాటికి లా, లోకం పాటికి లోకం. ఈ అమ్మాయికి అప్పటికి తెలివి కలుగుతుంది. కాని ఏం లాభం? సంఘం ఆమెను చేర్చుకోదు. హాస్టలులో మునుపటి గౌరవం ఉండదు. ఇటువంటి అమ్మాయిలకు అనాథ ఆశ్రమాలున్నూ, శరణాలయాలున్నూ మారీచాశ్రమంలాగ ఉపయోగపడతాయి. ఆ కాలం మేనక అప్సరస గనక శకుంతలను తన వద్దకు తీసుకొనిపోయింది. నేటికాలానికి అటువంటి సరసలు కనబడవు. తమ పిల్లలను తీసుకోరు, ఒప్పుకోరు కూడా.

మారీచాశ్రమంలో శకుంతలకు కాన్పు అవుతుంది. పిల్లవానిని పెంచి పెద్దచేసే బాధ్యత ఒకటిన్ని, దుష్యంతుని కలుసుకోవలెనని కుతూహలముచేత శకుంతల సన్యాసినిలాగ పూజలు పునస్కారాలు చేస్తూ కాలం గడుపుతుంది. దుర్వాసులవారి శాపానికి నాలుగేండ్లే బలం గనక దుష్యంతుడికి ఉంగరం కనబడడం, అందు మూలకంగా పూర్వస్మృతి, పశ్చాత్తాపం గలగడం, ఇందుకు అనుకూలంగా ఇంద్రలోకానికి పోవడం, వచ్చేదోవలో మారీచాశ్రమంలో దిగడం, శకుంతలను పిల్లవాడి మూలకంగా కనుక్కోవడం, అటుతర్వాత ఆమెను తన రాజ్యానికి పిలుచుకొనివచ్చి పిల్లవానికి యౌవరాజ్య పట్టాభిషేకం చేయడంవల్ల కథ సుఖాంతమవుతుంది – నాటకం గనుక.

నేటికాలపు శకుంతల అనాథాశ్రమాలలో నిలిచిపోయి అక్కడనే ఏదో ఒక ఉద్యోగం చేస్తూంటూంది. ఆమె గ్రహబలం గనక బాగా ఉంటే ఆ మోసంచేసిన జమీందారుని కొడుకే పై అధికారిగా వచ్చి మరల ఆమెను కలుసుకోవచ్చు. లేనిపోతే ఆమె అలాగే ఉండిపోవచ్చు. లేకపోతే పిల్లవాడు ఎదిగి పెద్దవాడవడమున్నూ ఏదో ఒకమార్గాన ఆ పిల్లవాడు తండ్రియైన పెద్ద అధికారిని కలుసుకోవడం, అతని మూలంగా అధికారి తన భార్యను కలుసుకోవడం జరుగుతుంది.

కాళిదాసు హృదయం – ఈ నాటకంవ్రాయడం మూలాన గోచరిస్తుంది. లోకానికి నీతిని చాటడమే పరమావధిగా తలచినట్లుకనిపిస్తుంది. గొప్పకులాలలో వంశాలలోకూడ అవినీతిగల వాళ్లు దుష్యంతులవంటి వాళ్లు పుట్టుతూనే ఉంటారు. సంఘం, సమాజాలు, స్వభావాలు మారవు. మనుష్యులు మారుతారు. అప్పటికీ ఇప్పటికీ స్త్రీలస్థానం మాత్రం మారదు. మారలేదుకూడా. కాబట్టి శాకుంతల నాటకం చదివేవారెప్పటికన్నీ కాళిదాసు హృదయం బాగా అర్థం చేసుకొని ఈ దృష్టితో చదివితే బాగుంటుంది. అందుకే మునికుమాళ్లు, కణ్వశిష్యులు, శకుంతలను రాజువద్దన్నప్పుడు అంటారు— 'అరసి చేయందగు మఱి యారసి చేయందగు రహస్యంగతమున్, ఈ రీతి మనసు తెలియని వారలతో సౌహృదంబు వైరంబె యగున్.' మనసు తెలియని వారన్నారు. పెద్దవాళ్ళకు తెలియకుండా చేసే పనులైతే అని మహాకవి అభిప్రాయం. గాంధర్వ వివాహం ఎంతశాస్త్ర సమ్మతమైనా సాక్ష్యం లేకపోతే అనర్థకారి, అని తేల్చారు. దుష్యంతుడి కార్యం ఐశ్వర్య మదోన్మత్తుల పనులవంటివని కణ్వశిష్యు లంటారు. అదేనిజం. ఎంత చదివినా, ఎంతదూరం పాశ్చాత్య దేశాలకు పోయినా, అక్కడ ఎవడో ఒక దుష్యంతుణ్ణి పెళ్ళి చేసుకొని తర్వాత జీవితంలో బాధపడడానికంటే ఆడపిల్లలు తల్లీ తండ్రీ చెప్పే మాటలువిని సంఘంలో బాగాబ్రతకడం మంచిదన్నాడు కవి. ఈ రోజుల్లో మన పిల్లలు, పిల్లవాండ్రు విదేశాలకు ఉన్నతవిద్యలకోసం పోతున్నారు. వాళ్ళను అంత పెద్ద చదువులకు పంపే తలిదండ్రులు ఒకమారు శకుంతల కథను అధునిక దృష్ట్యా చూడ్డం మంచిదేమో, ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో.

★



రాలిన రత్నం

చంద్రం రఁయ్యిమంటూ మహా వేగంతో వచ్చి, ఆసుపత్రి గేటుముందర సైకిల్ దిగాడు. చెమటతో అతని చొక్కా పూర్తిగాతడిసిపోయింది. మొహంనిండా చెమట్లు పోశాయి. సైకిల్‌కి స్టాండువేసి, ఆతృతగా అడుగులు వేసుకుంటూ, గేట్లోంచి మెటర్నిటీవార్డుకేసి నడవడం ప్రారంభించాడు. అప్పుడే గదిలోంచి బయటి కొచ్చిన కాంతమ్మగారిదృష్టి హఠాత్తుగా చంద్రం మీద పడింది. అప్పటి అతని ఆకృతిని గమనించి, లోలోన ఎంతో బాధపడింది. అతని మనస్తత్వం ఎలాంటిదో ఎరిగివున్నది గనుక ప్రస్తుత పరిస్థితిని వివరించి చెప్ప లేక, గబ గబ అతనికి ఎదురువెళ్ళి "ఏం నాయనా, చంద్రం! నీవేమి కంగారుపడనవసరం లేదు. పరిస్థితి కొంచెం కష్టంగావున్నా, మరేం ఆందోళన పడనవసరం లేదంటున్నారు డాక్టర్లు." అంది ధైర్యం చెప్పేట్టు

"నా రత్నానికేం పరవాలేదంటారా...!" ఆతృతతో తడబడుతూ అన్నాడు చంద్రం.

"ఆఁ మరేంపరవాలేదు. నీవిక ఇంటికివెళ్ళు, నే నిక్కడే వుంటాగా! అన్నీ చూసుకుంటాను వెళ్ళు నాయనా!" అంది.

చంద్రానికి కొంచెం ఆందోళనతగ్గి, మనసు స్థిమిత పడింది. "మీకు చాలా శ్రమిస్తున్నానండీ! ఇంటిదగ్గర విమల..." అని ఇంకా ఏదో చెప్పబోయాడు. మధ్య లోనే అందుకుని "అదేమిటి నాయనా, అలా అంటావ్, ఆపదసమయాల్లో ఒకరికొకరం సాయం చేసుకోకపోతే ఎలా? నీవికవెళ్ళు, వీలైతే మళ్ళీ సాయంత్రం ఓమాటురా" అంది కాంతమ్మగారు.

"సరే వస్తానండీ! కాస్త జాగ్రత్తగా చూస్తూం డండీ...!" అంటూ చంద్రం బయటికి నడిచాడు.

"నిజంగా విమలకీ, తనకీ ఏమిటిసంబంధం? ఏమీ లేదు ఆమె తన కాలేజిమేట్ మాత్రమే! తను అత్యంత విషమపరిస్థితుల్లో వున్నప్పుడు, విమల తనభర్త సుధా కర్‌చేత ఉద్యోగాన్నిప్పించి తనకు జీవనోపాధిని కలి గించింది. సుధాకర్ సహృదయుడు, నిత్యం తనశ్రేయోభి లాషి. విమలకి తగిన భర్త. పాపం విమలకి బిడ్డపుట్టి పోయి మూడురోజులే అయింది. పచ్చిబాలింతరాలు! ఆమె అలాంటిస్థితిలో వుండికూడా, తన భార్య డెలివరీ అయ్యేంతవరకు సహాయకారిగా వుండేందుకని, తన అత్తయ్య కాంతమ్మగార్ని ఆసుపత్రికి పంపింది. నిజంగా

కాంతమ్మగారు తన తల్లిలాంటిది. "అదేమిటి నాయనా అలా అంటావ్? ఆపదసమయాల్లో ఒకరికొకరం సహాయం చేసుకోకపోతే ఎలా?" అని ఎంతఓదార్పుగా అంది. నిజంగా వీళ్ళుముగ్గురూ తనపాలిటి దైవాలు! అమృతమూర్తులు. జీవితంలో మర్చిపోలేని మనుషులు, వీళ్ళఋణాన్ని తనీజన్మలో తీర్చుకోలేడు! ఆలోచిస్తూ నడుస్తున్న చంద్రం, హఠాత్తుగా ఓలారీ, మలుపు తిరుగుతూ రయ్‌మని తనమీదకే రావడం గమనించి గభాల్న సైకిల్ని దగ్గరకు లాక్కుని ప్రక్కకు తప్పుకున్నాడు. అదృష్ట వశాత్తు కొస్తలో ప్రమాదం తప్పిపోయింది.

చంద్రానికిప్పుడు గుర్తొచ్చింది తనీ ఆలోచనలో పడి అనవసరంగా సైకిలిని నడిపించుకొస్తున్నాడేఅని, అక్కడికి తనఇల్లు ఇంకా ఫర్లాంగు దూరంలో వుంది గనుక సైకిలెక్కి బయల్దేరాడు.

చంద్రం ఇంట్లో కూర్చున్నాడేగాని, అతని మనసు మాత్రం అనుక్షణం భార్యపరిస్థితిని గురించే ఆలోచిస్తోంది. ఆమెకు నొప్పులు ప్రారంభమైతే ఉదయం 10 గం॥లకు ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. ఇప్పుడు ఒంటిగంట దాటినా అతనికి ఆకలనిపించలేదు. బలవంతాన భోంచేద్దామన్నా, మనస్కరించలేదు.

"రత్నం ఇంతసేపటిదాకా డెలివరీ కాకపోవడమేమిటి? ఏమైనా ప్రమాదం జరగలేదుకదా! పాపం ఎంతబాధ పడుతోందో?" ఇలా మళ్ళీ అదే ఆలోచనలో మునిగిపోయాడు. కొంతసేపటికి హఠాత్తుగా తనగడియారంకసి చూసుకున్నాడు. సరిగ్గా మూడైంది. అతనిలో ఈసారి తీవ్రాందోళన ప్రారంభమైంది. ఇక క్షణంకూడా ఉండడం కష్టమనుకుని, ఆసుపత్రికి బయల్దేరాలని పడకకుర్చీలోంచి లేచాడు.

ఇంతలో ఇంటిముందర రిక్షాఆగింది. కాంతమ్మగారు క్రిందకు దిగారు. చంద్రం గుండెలు భయంతో వేగంగా కొట్టుకోడం ప్రారంభించాయ్ తన రత్నానికేం ప్రమాదం జరగలేదుగదా! గభాల్న ఆమెకెదురువెళ్ళి "ఏమండీ! ఏంజరిగింది...." అంటూ ఆందోళనగా కాంతమ్మగారి మొహంలోకి చూశాడు. అతని కాళ్ళూ, చేతులు వొణకడం ప్రారంభించాయి.

"ఏం జరగలేదు నీవేం కంగారుపడకు చంద్రం! డాక్టర్ నిన్నెందుకో ఓసారి రమ్మన్నారు. త్వరగారా!" అంది.

ఇద్దరూ రిక్షాఎక్కారు. రిక్షా వేగంగా ముందుకు పోతోంది. కాసేపట్లో ఇద్దరూ ఆసుపత్రి గేటుముందర దిగారు. ఇంతకుముందే కాంతమ్మగారు తన అల్లుడు సుధాకర్‌కి కబురుపంపడంవల్ల అతనూ కంగారుపడుతూ వచ్చి, అక్కడే స్కూటరు దిగాడు. ముగ్గురూ కలిసి గబగబ లోపలికి వెళ్ళారు.

రత్నంచాలా ప్రమాదపరిస్థితిలో వుంది. ఆమె బెడ్డు ప్రక్కన లేడీడాక్టరు, ఓనర్సు నిల్చునివున్నారు. ఇంతలో చంద్రం బాణంలా గదిలోకిదూసుకువచ్చి, "రత్నం... ! రత్నం... ! ఎలావుంది? ఏంజరిగింది...?" అంటూ భార్యబెడ్డుని సమీపించి ఆందోళనగా ఆమె మొహంలోకి చూసి, నిలువునా చలించిపోయాడు. ఆమె మొహం అదోరకంగా ఉంది. కళ్ళు తేలిపోతున్నాయి! ఆమె ఎంతో సేపు బ్రతికేట్టు కన్పించలేదు!

చంద్రం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతనినోటినుండి మాటలు పెగిలిరావడంలేదు. ఎంతో ప్రయత్నంమీద భర్తను కాసేపు తేరిపార జూసింది రత్నం. ఆమె కనుకొలుకుల్లో నీళ్ళునిల్చాయి. కొన్ని క్షణాలతరవాత "అమ్మా....! ఒక్కసారి నాబాబునిలా తీసుకురండి" అంది నూతిలో మాట్లాడినట్టు.

వెంటనే నర్సు లోపలికి వెళ్ళి ఎంతో ముద్దువచ్చేట్టు, అందాలుచిందుతున్న బుజ్జిబాబును తెచ్చింది. రత్నం తన బిడ్డని ఆప్యాయంగా అందుకుని వాడిబుల్లి మొహంనిండా ముద్దులవర్షాన్ని కురిపించి భర్తకేసి చూసి "ఏమండీ! నాబాబు రక్షణ, ఇకముందు మీ జీవితం ..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది. హఠాత్తుగా ఆమెలో ఏంమార్పు జరిగిందో, మనిషి గిలగిలా తన్నుకోడం ప్రారంభించింది. గభాల్న నర్సు డాక్టరు ఆమెనదిమిపట్టుకున్నారు. కానీ అమె మెలికలుతిరిగిపోతోంది. కళ్ళు వికృతంగా తిరిగిపోతున్నాయి. "ఊఁ! ఊఁ!" అంటూ రెండుసార్లు బాధగామూల్గి చివరికి ఒక్కసారి పెద్దగా మూల్గింది. అంతే— ఆమెశిరస్సు ప్రక్కకు ఒరిగి

శ్రీ దొండపాటి దేవదాసు

పోయింది. "రత్నం..." అని పెద్దగా వెఱ్ఱికేకపెట్టి ఆమె శవంమీద విరుచుకు పడ్డాడు చంద్రం.

ఆదృశ్యానికి అక్కడున్నవాళ్ళందరికళ్ళు అశ్రువుల్ని నింపుకున్నాయి.

సాయంత్రం ఆరుగంటలైంది. చంద్రం నిద్రనుండి మేల్కొన్నట్టు హఠాత్తుగా కళ్ళుతెరిచాడు. ప్రక్కగది లోంచి మాటలు విన్పిస్తున్నాయి. చంద్రం తనున్నగది నంతా ఓ మాటు కలయజూసి తనిప్పుడు విమల ఇంట్లో ఉన్నాడని గ్రహించాడు. హఠాత్తుగా మళ్ళీ అతనికి క్రితం జరిగిన దారుణసంఘటన స్ఫురణకొచ్చి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

రత్నంతో తను ఇంతవరకు గడిపిన తమ దాంపత్య జీవితంలోని ముఖ్యఘట్టాలన్నీ ఒక్కొక్కటే అతనికళ్ళ ముందర కదలసాగాయి.

''తను బి. ఏ. పాసయినట్టు, ఫలితాలొచ్చిన పది హేనవ రోజు హఠాత్తుగా తనతండ్రికి జబ్బుచేసింది. ఆ మరునాటి రాత్రి తండ్రి తన్ను దగ్గరగా పిల్చుకుని, తమ్ముళ్ళ భావిజీవిత భారమంతా తనదేనని చెప్పి, అలా తను ఒప్పుకున్నట్టు మాట తీసుకుని, ఆయన నిశ్చింతగా కన్నుమూశాడు, తల్లిపోయి, నాలుగేళ్ళు తిరక్కముందే తండ్రి కూడా పోవడంతో ఎంతో దుఃఖంతో కుమిలి పోయాడు తను.

తన తండ్రి తన వివాహాన్ని కళ్ళారా చూసి ఆనం దించాలని ఎంతో ఆశపడ్డాడు. కానీ ఆ కోర్కె తీరకుం డానే గతించిపోయాడాయన.

తను బి. ఏ. ఫైనలియర్ చదువుతూ సంక్రాంతి పండుగకు ఇంటికొచ్చాడు. ఆ మరునాడే తన తండ్రి పనుందని ఏదో వూరెళ్ళి మళ్ళీ రాత్రికి ఇంటికివచ్చీ రావడంతోనే గదిలో చదువుకుంటున్న తన్ను పిల్చి ''ఒరేయ్ చంద్రం! నీకు సంబంధం కుదిరిందిరా! నా అనంతరం ఈ ఇంటిని ఎప్పటిలా ఐకమత్యంతో, సమర్ధవంతంగా నిర్వహించగల సామర్ధ్యం, సహనం అన్నీ ఒక్క ఆ విశ్వనాథం కూతురు రత్నకుమారి లోనే కన్పించాయి. పిల్ల అన్నివిషయాల్లోనూ నీకు తగింది. నిజంగా నీవు చాలా అదృష్టవంతుడివి! ఈ పెండ్లి విషయంలో నీవునాకడ్డుచెప్పకు, ఈ సంవత్సరం చివర్లో నీవివాహం చేస్తాను" అన్నాడు. తను తండ్రి ఆదేశాన్ని సంతోషంగా అంగీకరించాడు. కానీ చివర కాయనలేకుండానే తను వివాహం చేసుకోవాల్సివచ్చింది.

రత్నం కాపరానికి వచ్చిన తొలిరోజునే ఇంటిపరి స్థితిని గూర్చి ఉన్నదున్నట్టు ఆమెతో చెప్పాడు తను. ఆమె అర్థంచేసుకుంది.

తమ్ముళ్ళిద్దర్నీ కాలేజీలో చేర్పించాడు. తను, తండ్రి సంపాయించిన ఆరెకరాల పొలాన్ని స్వయంగా నాగలి పట్టి వ్యవసాయంచేయడం ప్రారంభించాడు చదువుకుని కూడా, అహంభావంలేకుండా తమ్ముళ్ళకోసం తృటిలో రైతుగా మారి చమటోడ్చి బండచాకరి చేస్తున్నాడని తన్ను గురించి ఊరంతా ఎంతో ఆశ్చర్యంగా చెప్పు కున్నారు.

తనెలాంటి కష్టాల్ని ఎదుర్కొన్నా, గుంటూర్లో చదువుతున్న తనతమ్ముళ్ళకెలాంటి ఇబ్బందీకలుగకుండా చేయాలని తనెంతో ఆత్రుత పడేవాడు. వాళ్ళడబ్బుపంప మని అడిగిందే తడవుగా అడిగినదానికంటే అధికంగానే పంపేవాడు. లేకపోతే క్లాస్‌లో డబ్బువాలక ఎంతో ఇబ్బంది పడవలసి వస్తుందని భయంతో అలా చేసే వాడు.

తనకు స్వతహాగా కొంచెం ఆవేశం జాస్తి, కూలి వాళ్ళతో పనిచేయించడంలో గాని, అవసరమైన వాళ్ళని కూడగట్టుకుని పనులు నిర్విఘ్నంగా జరిగేట్లు చూసు కోడంలో గాని, అప్పులు చేయడం, తీర్చడంలోగానీ, తగిన మెళుకువలు తనకు తెలియవని రత్నం ఇట్టే గ్రహించి అప్పటినుండి ఆమె తనకు తనసంపూర్ణ సహ కారాన్నందిస్తూ, నేర్పుగా తన్ను నడిపించింది. భగవం తుడు తనకు నిజంగా రత్నాన్నే ప్రసాదించాడని ఎంతో ఉప్పొంగిపోయి రోజులు నిశ్చింతగా గడిపాడు.

అత్తమామలు లేకపోయినా కుటుంబాన్ని వెనకటి కంటే, చక్కగా, నైపుణ్యంగా నడుపుకురావడాన్ని గమనించి, ఊళ్ళోఅంతా ఆశ్చర్యపడుతు దీనికికారణం తన భార్య రత్నమేనని అందరూ చెప్పుకొంటుంటే విని తనెంతో ఉప్పొంగిపోయేవాడు,

అలా తామిద్దరూ పడిన కష్టానికి ఫలితం దక్కింది. తమ్ముళ్ళిద్దరూ శ్రద్ధగా చదువుకుని పైకొచ్చి ఆఫీసర్ల య్యారు. తన తమ్ముళ్ళకు హోదాకలిగిన ఉద్యోగాలు రాగానే. తను ఆనందాతిశయంతో వెళ్ళి, తన తమ్ముళ్ళ ఘనతను గూర్చి పొగుడుతూ ఊరంతా చెప్పాడు.

"మీ మొగుడూ పెళ్ళాలిద్దరూ పాపం ఎంతోకష్టపడి వాళ్ళని పైకితీసుకొచ్చారు. మీమేలును వాళ్ళెన్నటికీ మర్చిపోరయ్యా చంద్రం" అని తనకు తెలిసిన పెద్ద లంతా అన్నారు. తన తమ్ముళ్ళనుగూర్చి తనకంటే తన భార్య రత్నం ఎంతో ఆనందించింది.

డబ్బు మనుషుల మనసులను ఏకంచేయలేదని తన నమ్మకం. అసలు కట్నాలు పుచ్చుకోవడమంటేనే తన కసహ్యం ! అందుకని తన తమ్ముళ్ళకూ్కడా తనలానే కట్నాలు పుచ్చుకోకుండానే ఘనంగా వివాహాలు జరిపించాడు.

మరదళ్ళు కాపరాలకి వచ్చినప్పట్నుంచి. రత్నం వాళ్ళతో ఎంతో అన్యోన్యంగా వుంటూ కుటుంబాన్నంతటిని ఏకత్రాటిమీద నడుపుకురావడాన్ని చూసి ఆమెపట్ల తనెంతో సంతోషించేవాడు. తమ్ముళ్ళిద్దరూ దగ్గర ఊళ్ళోనే ఉద్యోగాలు చూసుకుని సాయంకాలానికి ఇంటికి చేరుకునేవారు. భోజనాలు వడ్డించడం మొదలైన మంచి చెడ్డ అంతా రత్నం చేతులమీదగానే నడిచిపోయేది. విశాలమైన తమ డాబాలో, నూతనంగా మరదళ్ళు రావడంతో ఎంతో నిండుగావుండి, క్రొత్తశోభను సంతరించుకున్నట్టు కళకళలాడుతుండేది.

కానీ తన సంతోషం అట్టేకాలం నిలవలేదు. తన ఆశాసౌధాలు సమట్టంగా కూలిపోయాయి. ఆడవాళ్ళ మధ్య ఈర్ష్యద్వేషాలు పెరిగాయి. రత్నం ఆధిపత్యాన్ని వాళ్ళు సహించలేక ఆమెని దెప్పిపొడవడం ప్రారంభించారు. అసలామెను పల్కరించేవారుకాదు. అయినా తన రత్నం వాళ్ళలో సామరస్యాన్ని కల్పించి సంతోషాన్ని కలిగించడానికి ఎంతో ప్రయత్నించింది. ఎంతో ఓర్పు వహించింది. కానీ వాళ్ళు గ్రహించలేకపోయారు. రత్నం ఈ విషయాలన్నిటినీ తనకు చెప్పకపోయినా తను అంతా గ్రహించాడు. కొన్నిసార్లు తను రత్నాన్ని "ఏమిటి రత్నం వాళ్ళు నీతో ఎందుకు మాట్లాడ్డంలేదు ఏమైనా పోట్లాడుకున్నారా?" అని అడిగేవాడు. "ఆఁ... కుఱ్ఱతలంపులు వాళ్ళకేం తెలుసు. నిదానంగా వాళ్ళే గ్రహిస్తారు" అని ఎంతో నిబ్బరంగా జవాబుచెప్పేదామె. తను కూడా అలాగే జరుగుతుందిలే అనుకుని తృప్తిపడేవాడు. కానీ అలాకాకపోగా, నిత్యం వాళ్ళు అదే పనిగా రత్నంమీద సణగడం ప్రారంభించారు.

ఒకరోజు రాత్రి తమ్ముళ్ళడిగిన ప్రశ్నకు పిడుగు పడ్డట్లదిరిపోయాడతను. వాళ్ళలాఅంటారని తను కలలో కూడా ఊహించలేదు. ఆస్తిలో భాగం పంచమన్నారు. స్వార్థంతోకూడిన వాళ్ళ ఉద్దేశాన్ని విని తను సహించలేకపోయాడు. "పెద్దవాళ్ళనిచేసి చదివించినందుకు ఇదేనా మీరు చూపిస్తున్న కృతజ్ఞత! నా సుఖాన్ని విస్మరించి బండచాకిరిచేసి మీ సుఖంకోసం ఇంతచేస్తే ఇవాళ కాస్త పెద్దవాళ్ళై రెక్కలొచ్చాయని ఆస్థి పంచమనీ వెఱ్ఱివాళ్ళలా మీరూ అడుగుతున్నారా? ఇదేనా సోదర ప్రేమ ! ఇంతకంటే దారుణం, మోసం, మరొకటుందా" ఇలా తను ఇష్టమొచ్చినట్లు వాళ్ళనికేకలేస్తుంటే, లోప లేదో పనిచేసుకుంటున్న రత్నం తుఫాన్లా తమదగ్గర కొచ్చి, "ఏమిటండీ,మీరు మాట్టాడుతున్నది? వాళ్ళఆస్థిలో వాళ్ళకు న్యాయంగా రావాల్సిన భాగాన్నిమ్మని అడగడంలో తప్పేముంది? దానికి మీరలా కోప్పడ్డండేనికి?" అంటూ తన్నక్కడనుండి లోపలికితీసుకుపోయింది.

రత్నంచేసింది చాలా అనుచితమైన పనని భావించి తనామెను ఇష్టమొచ్చినట్లల్లా తిట్టాడు. కానీ రత్నం ఏమీ బాధపడకుండా, తనవేపు సూటిగాచూస్తూ, గంభీర స్వరంతో "మీకు నిజంగా మీ తమ్ముళ్ళపైన ప్రేమంటూ ఉందా !" అంది. "ఎందుకులేదు ! ఏమిటి అలాగడుగుతున్నావ్?" అని తను ఆశ్చర్యపోతూ అడిగాడు. "మీ తమ్ముళ్ళు సుఖంగాఉండడానికి, వాళ్ళడిగింది చేయడానికి మీకసలు ఇష్టంలేదా? నిజంగా వాళ్ళశ్రేయస్సుని కోరుతున్నారా?" అంది మునుపటి ధోరణిలోనే.

"నా తమ్ముళ్ళ సుఖంకోసం అవసరమైతే నా సర్వస్వాని సంతోషంగా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు తను అంతే. వెంటనే రత్నం తన చెవులో ముందుకార్యక్రమాన్ని గూర్చి చెప్పింది. కాసేపాలోచించాక ఆమె చెప్పినట్లేనని తన అంగీకారాన్ని తెలిపాడు.

వెంటనే రత్నం అక్కడనుండివెళ్ళి మర్దుల్ని పిల్చి, "నాయనా ! మీ అన్నగార్కి కోపమొస్తే ఎలామాట్లాడేది మీకుతెలుసు, అయనస్వభావమేఅంత. అందుకు మీరేమీ బాధపడవద్దు, మీరడిగినదాన్ని ఇప్పుడు అర్థంచేసుకుని, అనవసరంగా మిమ్మును కోప్పడ్డందుకు చాలా పశ్చాత్తాప్పడుతున్నారు. ఈ ఆస్థిని ముక్కలుచేయవద్దని అంటున్నారాయన. అలాగే ఈ డాబానుకూడా ! నాకు తెలిసినంతవరకు మీ చదువులకైతేనేమి, పెళ్ళిళ్ళకైతేనేమీ కొన్ని బాకీలైనమాట వాస్తవం. వాటిని మీరే నిదానంగా తీర్చుకుని అంతా మీరే తీసుకుని చక్కగా నడుపుకోండి.

మీరెల్లప్పుడూ సామరస్యభావంతో, సుఖంగా వుండడం కంటే మాక్కావల్సిందేముంది? మీరడిగినవన్నీ తీర్చడం మావిధి" అని రత్నం తనతమ్ముళ్ళతో అనాడన్న మాటలు తనకిప్పటివరకు బాగాజ్ఞాపకమున్నయి. వాటిని తన జీవితంలో మర్చిపోలేడు.

ఆఇంట్లో తామింకా వున్నందువల్ల స్పర్ధలు పెరగడం తప్ప, సామరస్యం కుదరదని గ్రహించడానికి తమకి అట్టే కాలంపట్టలేదు.

చాలాకాలానికి తమకి జీవనం జరగడంకోసం, తను ఉద్యోగం వెతుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. ఎందులో చేరదామన్నా వయసు పరిమితి దాటిపోయింది. దాంతో తనపరిస్థితి మరీ విషమపరిస్థితిలో పడింది. అలాంటి సమయంలో ఒకపెద్దమనిషి ఓప్రైవేట్ కంపెనీలో ఆఫీసరుస్థాయిలో ఉన్న ఒకాయనచేత తనకు ఉద్యోగమిప్పిస్తానని అంటే ఒకరోజు ఆదివారం తామిద్దరూకలిసి గుంటూరెళ్ళారు. ఆఫీసరుగారి ఇంటికి చేరుకునేసరికి సరిగ్గా నాలుగైంది. తలుపు తట్టగానే ఓయువతి వచ్చి తలుపుతీసింది ఆమె చంకలో పిల్లాడున్నాడు. తామిద్దరూ ఒకర్నొకరు కాసేపు ఆశ్చర్యం చూసుకుంటూ నిల్చుండిపోయారు 'తనస్నేహితుడు గోపాల్ చెల్లి రమకి ఈమె మంచిస్నేహితురాలు. అక్కడ అప్పుడప్పుడు కొన్ని ఆదివారాలు ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటుంటే ఈమె కూడా పాల్గొంటూ హుషార్‌గా కబుర్లుచెప్తుండేది' ఇలా తనను ఆమెకూడా తనని గుర్తుతెచ్చుకుందేమో కొన్ని క్షణాలు గడిచాక "చంద్రం" అంది. ఆమే! అలానే తనపేరు అంతచనువుగా పిల్చేది. వెంటనే "విమలా" అన్నాడు తను. వెంటనే తమను సాదరంగా లోనికి తోడ్కొనిపోయి కూర్చోబెట్టి నిమిషాల్లో కాఫీతెచ్చిచ్చింది.

అన్నికంటే ఆశ్చర్యం ఆవచ్చినపెద్దమనిషి తమవేపు తెల్లమొహంవేసుకుని చూడ్డం, తనకిప్పటికీ బాగాజ్ఞాపకముంది. విమలకి ముగ్గురుపిల్లలని, అన్ని వివరాలు చెప్పింది. ముఖ్యంగా తన్నమితంగా ఆశ్చర్యపరచిన విషయం తను ఏ ఆఫీసరినైతే ఉద్యోగమిమ్మని అర్ధించడానికి వచ్చాడో? ఆ ఆఫీసరు విమలభర్త!

తమ విషయం తెలుసుకున్నతరువాత "నీవు అదృష్టవంతుడవయ్యా!'' అన్నాడావచ్చిన పెద్దమనిషి. ఇలా మాట్లాడుకుంటుండగా విమల భర్త సుధాకర్ స్కూటర్ దిగి లోపలికొచ్చాడు. పరిచయాలైపోయాయి. పరిస్థితి విన్నాడు. అభయమిచ్చాడు. తత్ఫలితంగా తనో ఉద్యోగి అయ్యాడు.

ఇంట్లో ఏముందీ, లేందీ, తను పట్టించుకునేవాడు కాదు జీతంరాగానే తెచ్చి రత్నం చేతిలోపెట్టి ఆమె తెమ్మనేదేమిటో తెచ్చేవాడు. అంతే! మొత్తానికి ఇంట్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నా, బైటవాళ్ళకెంతో నిండుగా కన్పించేది. పొదుపుగా సంసారాన్ని నడపడం విషయంలో, ఆ చుట్టుప్రక్కలవారంతా రత్నాన్నే ఆదర్శంగా తీసుకున్నారు శ్రీమంతులతో తన్నెప్పుడూ పోల్చుకునేదికాదు. లేనిపోని ఆశలు పెట్టుకుని బాధపడేదికాదు. సామాన్యంగా ఎవ్వరితోనూ మాట్లాడేదికాదు. ఎవరైనా మాట్లాడిస్తే అవసరమైన వరకు అవతలి వ్యక్తి తన్నిక ఎప్పుడు మర్చిపోలేని విధంగా చక్కగా మాట్లాడేది.

విమలకి రత్నం అంటే ఎంతోఅభిమానం."రత్నంలో తను నేర్చుకోవలసిన విషయాలు, చాలా పున్నాయని. ఆమెతో స్నేహం ఏర్పరచుకున్నందువల్ల అసలు జీవితమంటే ఏమిటో అర్ధం చేసుకోగలిగానని, రత్నం చదివింది హైస్కూల్ చదువే అయినా ఎంతో వివేకవంతురాలని" అంటుండేది విమల.

"రత్నకుమారి వలన విమల దుబారా ఖర్చు తగ్గించి, తను తృప్తిపడ్డమే గాక తనకూ ఎంతో మనశ్శాంతిని సంతోషాన్ని కలిగిస్తోందని అప్పుడప్పుడు సుధాకర్ కూడా అంటుండేవాడు. ఇలాంటి జీవితాన్ని తామనుభవిస్తున్నా, ఎప్పుడూ తన మర్దుల క్షేమాన్నే కోరుతుండేది. నిత్యం వాళ్ళ దాంపత్యం సుఖంగా వర్ధిల్లాలని ఆశీర్వదిస్తుండేది. అలాంటి రత్నానికి భగవంతుడెందుకనో సంతానాన్ని **అను**గ్రహించలేకపోయాడు.

రత్నానికి నాలుగు సార్లు గర్భస్రావాలు జరిగాయ్. దాంతో ఆమె ఆరోగ్యం క్రమేపీ క్షీణించిపోతూ వచ్చింది. తాహతున్నంతవరకు మందులుకొని వాడుతూనే వచ్చాడు తను. కానీ ప్రయోజనం లేకపోయింది. ఇంతలోనే రత్నం గర్భవతైంది. నెలలు నిండుతున్న కొద్దీ తనలో ఉత్సాహం పెల్లుబుకుతుండేది. త్వరలో రత్నం మాత కాబోతోందని, తనూ త్వరలో 'నాన్నా అని పిలిపించుకోబోతున్నాడని ఎంతో ఉబలాట పడుతుండేవాడు.

కానీ ఏంలాభం రత్నం మాతృమూర్తి అయ్యింది. కానీ అమ్మాని పిలువబడ్డానికి నోచుకోలేకపోయింది.

తను ఏకాకిని చేసి ఏలోకానికో వెళ్ళిపోయింది. తన బ్రతుకుని గాఢాంధకారం చేసింది. ఇక తనెలా బ్రతకాలి? ఒంటరిజీవితాన్ని ఎలాగడపాలి? ఈ దుఃఖాన్ని భరించి తనెలాబ్రతగ్గలడు ? ఇక ఎప్పటికీ తన రత్నం తనకిహ కన్పించదు. తనజీవిత భాగస్వామిని ఇన్నాళ్ళకా బంధాన్ని త్రెంచుకుపోయింది. ఇక తన రత్నం తనకిహలేదు! ఇలా గతస్మృతులను గుర్తుకు తెచ్చుకుని "రత్నం ...." రత్నం ...." అంటూ పెద్దగాఏడ్వడం ప్రారంభించాడు చంద్రం.

చంద్రం స్పృహలోకి వచ్చాడని, విమల ఆమె భర్త సుధాకర్, కాంతమ్మగారు, సలుగురూ తలుపులు తెరుచుకుని అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు.


"ఏమిటి చంద్రం! జరిగి పోయినదానికి ఇలా విచారిస్తేఎలా? ఊరుకో ...." మధ్యలోనే అందుకుని, "విమలా నారత్నాన్నెలా మర్చిపోను? ఆమెలేని నా జీవితం ఎలావుంటుందో నీకు తెలియందేముంది? నా జీవితానికి వెలుగేపోయింది. నా రత్నం రాలిపోయింది, ఆమె లేకుండా నేనెలా జీవించగలను? తను పోతూ పోతూ పిల్లవాడి రక్షణభారం నాపైపెట్టింది. అందు కోసం నన్ను బ్రతకమని శాసించింది. ఆడదానిచేతిలో అర్థం బ్రతకదు. మగవాడిచేతిలో బిడ్డా బ్రతకదన్నట్లు ఈ పసికందుని నేనెలాపెంచి పెద్దవాణ్ణి చెయ్యను? నాకిహ ఎవరున్నారు?" ఇలా వొణుకుతున్న కంఠంతో అంటూ చేతుల్లో మొహందాచుకుని విలపించాడుచంద్రం.

"ఇలా అనకు చంద్రం! నీ బిడ్డను రక్షించడానికే గాబోలు. భగవంతుడు నాబిడ్డని తీసుకున్నాడు. నీవేమీ దిగులుపడకు ! నేటినుండి నీ పిల్లవాణ్ణి, నాపిల్లవాడిగా పెంచుతాను. నీవుకూడా ఈ రోజునుండి ఇక్కడే నా ఇంట్లో నా తోడబుట్టినవాడివిగా, నా సొంతసోదరుడివిగా ఉండు."

"విమలా .... !" అన్నాడు చంద్రం ఆమె మాటల కాశ్చర్యపోతూ. "అవును చంద్రం! నీపిల్లవాడికి, నీకూ ఏం పరవాలేదు. నీవిక ఇక్కడే వుండు. విమల అంత విశాలంగా మాట్లాడినందుకు నే నెంతైనా సంతోషిస్తు న్నాను," అన్నాడు సుధాకర్.

ఇంతలో లోపలపిల్లవాడు నిద్రనుండి లేచేడేమో కెవ్వుమన్నాడు. విమల ఉలిక్కిపడి ఒక్కపరుగున వెళ్ళి పిల్లాణ్ణి తీసుకుంది. ఆ అందాల బుజ్జిబాబు బుల్లి పెదాలకి తనవక్షాన్నందించింది. అంతే– వాడి ఏడుపు ఠక్కున ఆగిపోయింది.

ఆ దృశ్యానికి హఠాత్తుగా చంద్రంలో సంతోషతరంగాలు ఉవ్వెత్తున లేచాయి. వెంటనే అతని కళ్ళనుండి ఆనందాశ్రువులు జలజల రాలాయి.



*



★ మహానది ★

హిందూస్థాన పదము హిందూదేశ మంతకును, వింధ్య పర్వతముల ఉత్తర దేశమునకును, గంగా నది వుత్తర మైదానమునకును వలెనె, దక్కను పదము నర్మదకు, దక్షిణముగనున్న దేశమంతకును, నర్మదకును, కృష్ణానదికిని, మధ్యదేశమునకును, వాడ బడుచున్నది. దక్కను పీఠభూమి వింధ్యాద్రులకును, పడమటికనుమలకును, తూర్పుకనుమలకును మధ్యగా, త్రిభుజాకారముగ నున్నది. కాబట్టి వుత్తరమున వెడల్పుగను, దక్షిణమునకు పోనుపోను సన్నముగను వున్నది. తూర్పు కనుములును, పడమటి కనుములును పీఠభూమిని యావరించి యంచులవలె నుండి నీల గిరులలోగలియుచున్నవి. పీఠభూమి పశ్చిమము నుండి తూర్పు దెసకు వాలి యేటవాలుగ నున్నది. ఎత్తు 1000 అడుగుల నుండి 3000 అడుగుల వరకును గలదు. దక్కను ఉత్తర సరిహద్దున నర్మదను, తపతిని మినహాయించిన, తదితర ముఖ్యనదులు - మహానది, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, కావేరి – పశ్చిమ తీరమునకు షుమారు యేబదిమైళ్ళ దూరమున జన్మించి తూర్పు వైపునకే ప్రవహించుచున్నవి. అందు వలననే తూర్పుతీరమున సారవంతమైన డెల్టాలు యేర్పడు చున్నవి.

మహానది నైసర్గికముగ వింధపర్వతములకు జెందిన సప్తపురపర్వతములందలి మేఖలపర్వత పంక్తి తూర్పు కొనను — అమరకంటకమునకు కొంతదూరమున, రాయపూరునకు 25 మైళ్ళు దక్షిణమున జన్మించినది. జన్మస్థానము నర్మదా తపతులకు వలె మధ్యయిండియా పీఠభూమిలో మధ్యప్రదేశ్ (మధ్యపరగణాలు) రాష్ట్రమున నున్నది. మహానది తొలుత చిన్న ప్రవాహమై వుత్తరమునకు ప్రవహింపుచు చ్ఛట్టిసుగర్ మైదానపు తూర్పు భాగమును తడుపుచున్నది; శౌరినారాయణ్ కు కొంత పైగా, సియోనాథ అను వుపనదిని కలుపుకొనుచున్నది; అచటనుండి కొంతవడి తూర్పునకు ప్రవహించి శాంభల్ పూరును ఛోటానాగపూరునుండి విభజించుచు Uptora, Korba, తదితర పర్వతపంక్తులనుండి స్రవించు చిన్నచిన్న నదీ ప్రవాహములను తనలో జేర్చుకొనుచున్నది. పద్మపూరు సమీపమున మహానది దక్షిణమునకు మళ్ళి కొండశిలలో కష్టసాధ్యముతో ప్రవహించి శాంభల్పూరును దాటి సోన్ పూరుకు ప్రవహించుచున్నది. చిన్నచిన్న ప్రవాహములవలన బలపడి మధ్యరాష్ట్రములందు ప్రవహించుచు రాయపూరునకు కొంతదూరమున నొకపాటి ప్రవాహముగల్గి, శాంభల్పూరుకడ దక్షిణముగ మరలి మరికొన్ని ప్రవాహముల జేర్చుకొని సోన్ పూరుయొద్ద ఆగ్నేయమునకు మరలి కొండల, గుట్టల, శిలాసముచ్చయముల గోసికొని బోవుచు తూర్పు కనుమలకు ప్రవహించును. దుర్గమారణ్యములతో నిండిన కొండచరియ నొరసికొని ప్రవహించు మహానది కటకమునకు యేడుమైళ్ళ దూరమున నారజ్ సమీపమున ఒరిస్సా డెల్టాను ప్రవేశించి, కటకమండలమున పశ్చిమము నుండి తూర్పునకు ప్రవహించి, అనేక పాయలుగ జీలి ఫండీబాలేశ్వరము రేవుయొద్ద False PoinE కడ బంగాళాఖాతమున గలియుచున్నది. కటకమునకు పైగా, ప్రవాహము రెండుగ జీలి, కటకమును జుట్టి తిరుగ కలిసికొనుచున్నది మహానది.

బంగాలు — నాగపూరు రైలుదారి పడిన పిమ్మట మహానది ప్రయాణమున కంతగా నుపయోగపడుట లేదు. 50,000 చదరపు మైళ్ళ వైశాల్యమును మహానది నీరు తడుపుచున్నదని యంచనా వేయబడినది. వరదల సమయముతో భారతదేశపు నదులన్నింటికంటె విపరీతమైన వేగముతో నీరు ప్రవహించును. నారజ్ లోయ గుండా ఒక సెకండుకు 1,500,000 ఘనపుటడుగుల నీరు ధారాపాతముగ బడుచుండును. ఇతర ఋతువులలో నీ జలపాతము 500 ఘనపుటడుగులకు తగ్గుచున్నది. వరదల సమయములలో ఒరిస్సా డెల్టాపై బడుచున్న నీ విపరీత జలమును ప్రయోజనకరముగ వినియోగపర్చుటకు యెన్నియో ప్రయత్నములు జేయబడెను. డెల్టా ముఖమున మూడు శాఖలుగ చీలియున్న మహానది ఒక్కొక్క శాఖకు నొక్కొక్క డామ్ కట్టబడినది. ఒరిస్సా పంట కాలువలకు సంబంధించిన నాల్గు కాలువలు 292,000 యెకరముల భూమి సాగుకు నీరు సరఫరా జేయుచున్నవి, వీనిలో రెండు కాలువలు Biropa డామ్ నుండియు, మరొకటి మహానది డామ్ నుండియు, ప్రవహించుచున్నవి. రాయపూరు మండలమును రక్షించుటకు మరొక కాలువ 1926 సం॥లో 300,000 ఎకరముల భూమికి నీటి సరఫరాకు అంచనా వేయబడి మహానదిపై రోద్రికడ ప్రారంభింపబడెను. ఈవిధముగ పంటకాలువల గల్గి మహానది ప్రక్కసీమల నెక్కువగ ఫలింపజేయుచుండును. కటకము యొద్ద ఆనకట్ట కట్టియున్నారు. నలుబది మైళ్ళ పొడవున నొకలోయను గోసికొని తూర్పు కనుమలను మహానది దాటుతావు నరణ్యమధ్యమై వింతగొల్పును.

మహానది డెల్టా భాగము చాల సారవంతమైనది. ఇచట వరి ముఖ్యమగు పంట. మహానదికి ఒరిస్సాలో హీరాకుడ్ యొద్ద నొక పెద్ద యానకట్ట కట్టుటకు ప్రారంభించిరి. వరిపంటకు ప్రసిద్ధమైన నీ ప్రాంతము Ukraine of India అను పేరొందవచ్చును.

నదులను అవి జన్మించు పర్వతములకు పుత్రికలుగ వర్ణించుట కవి సమయము; వాయుపురాణమందటులే చెప్పబడియున్నది. ఉదా :— మహేంద్రపర్వతమున బుట్టిన నది మహేంద్రతనయ. మహానదికి వుపనదులలో తెలివాహా లేక తేల్ యనియు, తెలింగిరి యనియు బిల్వబడుచుండెను; మరియొక వుపనది Hutfee. శాసనములలో మహానదికి చిత్రోత్పల యను నామధేయము గానవచ్చుచున్నది. డార్జిలింగు సమీపమున

శ్రీమతి వారణాసి యశోదాదేవి

నొకనది మహానది యనబడుచున్నది. మహాభారతము ఆదిపర్వతములో గయాక్షేత్రము యొద్ద ఫల్గుణీనదికి మహానది యను పేరు వాడబడియున్నది.

భౌగోళికముగను, చారిత్రికముగను కళింగదేశమునకు వుత్తరపు ఎల్ల మహానది. ఈశాన్యమున వైతరణీ నదిలోయ కలిసినప్పటికిని, సాధారణముగ మహానదీ గోదావరీ మధ్య దేశము కళింగ మను పేర బరగుచుండెను. ఆంధ్రరాజు రాజధాని అంధకాపురము లేక ఆంధ్రపురము. మహానది వుపనది తెలివాహ తీరమున నుండెను. మగధరాజైన బలిచక్రవర్తి యోర్గురు కుమారులలో నొకడైన ఆంధ్రరాజు రాజధాని అంధకాపురమని సరివంజియ జాతకములో జెప్పబడియున్నది. క్రీ. శ. 541 సం॥ ప్రాంతమున సింహపురము రాజధాని కళింగమును బరిపాలించిన మాధరవంశపు ప్రభంజనవర్మ మహానదీ కృష్ణవేణీ మధ్యదేశపు చక్రవర్తిగ శాసనములలో వర్ణింపబడియున్నాడు. కృష్ణవేణీ మహానద్యాంతరస్థ ప్రజా ధర్మానుశాసన యన్నది ప్రభంజనవర్మ బిరుదు. అంతకు పూర్వము గుప్తసామ్రాట్టు సముద్రగుప్తుని సామ్రాజ్యములో మహానది, గోదావరి మధ్యదేశపు రాజులు సముద్రగుప్తునికి సామంతులై యుండిరి.

ఆంధ్రదేశము నేలిన చక్రవర్తులకు మహానది వరకును తమతమ సామ్రాజ్యముల విస్తృతపర్చుట, కటకమును జయించుట యభీష్టములై యుండెను. రెడ్డి సామ్రాట్టులు తమ సామ్రాజ్యమును మహానది పర్యంతము వ్యాపింపజేసిరి. వారి ప్రశస్తిలో నొక బిరుదము పాదుబ్రహ్మకుండి (గుండ్లకమ్మ), కృష్ణవేణీ, గోదావరీ, మహానదీ, పుభయతారములందును బ్రాహ్మణులకు భూదానముల గావించిరని వక్కాణించుచున్నది; రాజమహేంద్రవర రెడ్డిరాజ్యము చిలుక సరస్సు వరకును వ్యాపించెను. విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జైత్రయాత్ర కటకమును దాటించెను గదా! 10వ శతాబ్దమున మహానదీతీరమువ సువర్ణపురము (సోనేపూరు) రాజధానిగ బాలించిన దక్షిణకోసల మహారాజు సోమేశ్వరవర్మ II మహానదిలో జలక్రీడల వినోదించుచుండెనట. పంచధారల రాజధానిగ రాజ్యమేలిన చాళుక్యులు, గంగా యమునల మధ్యదేశమును బోలిన మహానదీ గోదావరీ మధ్యదేశమును బాలించినట్లు శాసనములు జెప్పుచున్నవి. చాళుక్య చోడ చక్రవర్తి III గోదావరీ మండనమండలేశ్వర బిరుదు వహించెను.

కళింగములో మహానదికి యీవల రుషికుల్యా, నదియును, వంశధార నదియు, పౌరాణిక ప్రసిద్ధియు చరిత్రవిఖ్యాతియు గల్గియున్నవి. శాతవాహన సామ్రాజ్యము వంశధార తీరమున పరిఢవిల్లెను. ముఖలింగ క్షేత్రము నచటనే గలదు. మహానదీ తీరమున కటకము 18వ శ॥లో మహారాష్ట్రి రాజ్యమునకును, బెంగాలు, నాగపూరు, మద్రాసులలో బ్రిటిషు వారికి సైనిక ప్రాముఖ్యతగల లంకెవల నుండెను. మహారాష్ట్రిలకును, బ్రిటిషువారికిని మధ్య సువర్ణ రేఖానది సరిహద్దుగ భావింపబడుచుండెను. బెంగాలు నుండి వుత్తర సర్కారులకు పోవు నేకైక బాటపై నుండుటచే, కటకమును పరిసర ప్రాంతములను తన స్వాధీనమందుగల బీరారు రాజు ప్రాముఖ్యత బెంగాలు ప్రభుత్వమునకు కంటగింపుగ నుండెను. నాగపూరు నుండి శంభల్ పూరుకు పోవు రెండు బాటలలో మొదటిది పల్లపుబాట. రెండవది మీదుగ మహానదీ ప్రవాహమును యీదుకుపోవుట కనువగు భాగమును దాటుచున్నది. మొట్టమొదటి Dundah, Surangapur మీదుగాపోవు మహానది Hutfu Auronga నదీ సంగమస్థానమున దాటుచున్నది. చిలుకసరస్సు తీరమునటారకు వుప్పు, యెండు చేపలు, తదితరవస్తువులు మహానదీమూలమున శంభల్ పూరు, నాగపూరులకు రవాణా జేయబడుచుండెను. మహారాష్ట్రిలకు దక్షిణముగ నున్న చిలుక సముద్ర తీరముననున్న, తూర్పుగను, సువర్ణరేఖనదికి తూర్పున Auranga యందును విరివిగ వుప్పు తయారగుచుండెను. చరిత్ర ప్రసిద్ధిగల కటకము క్రీ. శ. 1937. నుండి 1952 సం॥ వరకు ఒరిస్సా రాష్ట్రిమునకు రాజధానిగ నుండెను. తర్వాత భువనేశ్వరం రాజధానియైనది. కటకములో జనుము యంత్రశాల, కలప వర్తకము గలదు. ప్రాచీనకాలమునుండియు కటకము కంచుసామగ్రికి ప్రసిద్ధి. రాజకీయముగ పూర్వము కటకము ఆంధ్రదేశమునకు తూర్పు హద్దుగ జూడబడుచుండెను. మహానది జలముల జలక్రీడల వినోదించిరట రెడ్డిసామ్రాట్టువులు. ఇవ్విధముగ తూర్పు తీర మైదానముననున్న మహానదియు, దాని డెల్టాలోనున్న కటకమును ఖ్యాతిగాంచినవి.

దురాశ

చాలా కాలంనాటి సంగతి. నేనొకసారి డార్జిలింగ వెళ్ళాను. అక్కడ వర్షాలవల్ల, మేఘాలవల్ల దట్టమైన చీకట్లు అలముకుంటున్నవి. గదిలోనుంచి బయట కాలు పెట్టబుద్ధి పుట్టదు. లోపల కూర్చుని, కూర్చుని ప్రాణం మరీ విసిగిపోతుంది.

హోటల్లో ఉదయం భోజనం ముగించుకుని, కాళ్ళకు మొద్దుబూట్లు, ఆపాదమస్తకం 'రెయిను కోటు' ధరించి, షికారుకు బయలుదేరాను. మధ్య మధ్య జల్లు పడుతూవుంది. నలుదిక్కుల కమ్ము కొస్తున్న కారుమబ్బులు చూసి, విధాత హిమాలయ పర్వతాలతోసహా, ప్రపంచపటాన్ని రబ్బరుతో తుడిచి వేసి, నామరూపాలు లేకుండా చేస్తాడేమోనని పిస్తూంది.

నిశ్శబ్దంగావున్న రోడ్డుమీద వొంటరిగా పచార్లు చేస్తూ, యీ నిరాధార మేఘ సామ్రాజ్యంలో వుండ టానికి మనస్కరించటంలేదు; యింకను రూపరసగంధ వర్ణాలతో శోభిల్లే, విచిత్ర ధరత్రీ మాతను మళ్ళీ పంచేంద్రియాలతో అయిదు విధాలా బంధించటమే శ్రేయస్కరమని ఆలోచిస్తూ వున్నాను.

ఇంతలో యెటునుంచో, సమీపాన యెవరో వొక స్త్రీ కరుణాక్రందనం విన్పించింది. ఆధివ్యాధులతో అలమటించే ఈ ప్రపంచంలో యేడ్పు, చెవిని పడటం వింత సంగతేమీ కాదు. మరొకచోటనో, మరొక సమయానో అయితే మొహం తిప్పిచూసే వాడినో కాదో చెప్పలేను. కాని యీ అనంత మేఘ సామ్రా జ్యంలో, ఆరోదనము సంపూర్ణంగా విలుప్తమైన ప్రపంచంలో యేకైక ఆక్రందన సదృశంగా నా చెవి సోకుతూవుంది. నాపట్ల అది తుచ్ఛమని యెంచటం, అసాధ్యమయింది.

యెటునుంచి ఆ ధ్వని వస్తుందో వెదుకుతూ ముందుకు సాగాను. నాలుగడుగులు వెళ్ళాను. వొక స్త్రీ కాషాయ వస్త్రాలు ధరించివుంది. పర్వత శిఖరం మాదిరి, తైల సంస్కారమెరుగని బంగారు రంగు శిరోజాలు తలమీద చుట్టగా చుట్టుకుంది. రోడ్డు అంచున చిన్న బండమీద కూర్చుని, కుమిలి కుమిలి విలపిస్తూవుంది. ఇది ఆకస్మికంగా సంప్రాప్తమైన దుఃఖవిలాపముకాదు. చిరకాలసంచిత నిరవశ్రాంతి గాఢ విషాదాలు, కారుమబ్బుల చీకటికి, పర్వతప్రాంత నిర్జనత్వానికి ధారాక్రాంతమై ముప్పిరి గొన్నట్టుంది.

వ్యయ ప్రయాసలకు లోను గాకుండానే, కథా వస్తువు దొరికిందిగదా అనుకున్నాను లోలోపల. పర్వతశిఖరంమీద యేడుస్తూ వొక సన్యాసి కూర్చుని వుండటమూ, నేను కంటితో చూడటమూ జరుగుతుం దని ఎన్నడూ ఆశించలేదు.

ఆమె కులగోత్రాలేమిటో యేమాత్రమూ వూహించలేకపోయాను. నేను మృదుమధురంగా— "ఎవరు నీవు? ఏమి జరిగింది ? ఎందుకు యేడుస్తు న్నావు?" అని అడిగాను.

మొదట ఆమె సమాధానం చెప్పలేదు. సజలదీప్త నేత్రాలతో వొక్కసారి పరిశీలనగా నా వంక చూసింది.

"నన్నుచూసి, భయపడవొద్దు. నేను పెద్ద మని షిని!" అని చెప్పాను మళ్ళీ!

ఆ మాటకు ఆమె నవ్వి, ఆలసట వున్నప్పటికీ, సహజ మధుర కంఠంతో చెప్పసాగింది. "చాలా కాలం నుంచీ భయసందేహాలు నా దరిదాపులకు రావు; సిగ్గు బిడియాలుకూడా యెప్పుడో త్రోసివుచ్చాను. బాబు గారూ! ఒకప్పుడు నేను ప్రత్యేక అంతఃపురంలో

వుండేదానిని. అక్కడ సొంత అన్నదమ్ములుకూడా, ముందుగా సోదరి అనుమతిలేకుండా, లోనికి అడుగు పెట్టలేరు. కాని యివాళ ప్రపంచంలో నాకు గోసా అనేదిలేదు."

ముందు నాకు కొంచెం కోపం వచ్చింది. నా వేష భాషలన్నీ దొరల ధోరణిలో వున్నప్పటికీ, ఆ సురదృష్ట వంతురాలు నన్ను నిస్సంకోచంగా 'బాబుగారూ' అని పిలిచింది! యింతటితో కథను కంచికి పంపి, సిగరెట్టు పొగ ఆకాశంలోకి వదలుతూ, దొరల దూమ శకటం మాదిరి, దర్పంతో వేగంగా వెళ్ళిపోదామనిపించింది. కాని నాలోని ఆసక్తి, రహస్యం తెలుసుకోవాలనే కుతూహలమూ నిలిపినవి. నేను అభిమానం తెచ్చుకొని, మెడపక్కకు తిప్పి— "నేను మీకేమైనా సహాయం చేయవచ్చునా? చెప్పండి, యేంకావాలో?" అని అడిగాను.

ఆమె రెప్ప వెయ్యకుండా పాదాలనుంచి నా మొహం కేసి చూసి, కొంచం ఆగి— "నేను బదాయూనవాబు గులామ్ ఖాదిర్ ఖాను కుమార్తెను?" అని సమాధాన మిచ్చింది.

బదాయూ యెక్కడో, ఆ నవాబు యెవరో అతని కుమార్తె ఏ తీరనిదుఃఖంతో సన్యాసిని వేషంతో డార్జిలింగు రోడ్డుపక్కన కూర్చుని యేడుస్తూవుందో — నాకేమీ తెలియదు. అసలు నాకు యిలాంటి విషయాల మీద నమ్మకంలేదు. అయినా- కథ రక్తికడతున్నపుడు, అడ్డుపుల్ల వేయటమెందుకని వూరుకున్నాను.

తర్వాత, రాకుమారి ప్రశంసావాక్యము నాచెవిని పడగానే, తక్షణమే ఆమె కొక సలాంకొట్టి — "రాకుమారీ! నా అవిధేయతను మన్నించండి! మిమ్మల్ని గుర్తించలేకపోయాను" అని చెప్పుకున్నాను.

గుర్తించకపోవడానికి చాలా కారణాలున్నవి ప్రధానమైన మొదటికారణం, యిదివరకెన్నడూ ఆమెను చూడలేదు. రెండోది; దట్టంగా పట్టిన పొగ మంచులో, చేతులూ కాళ్ళూ ఎవరివి వారికే సరిగా కన్పించటంలేదు.

ఆమెకూడా అన్యథా భావించక, సంతోషంతో యెదురుగావున్న బండకేసి కుడిచేత్తో సైగచేస్తూ "కూర్చోండి!" అని ఆజ్ఞాపించింది.

రాకుమారికి, సన్యాసిని వేషంలోకూడా 'ఆజ్ఞాపించే' శక్తిసామర్థ్యాలు వున్నవి. పొగమంచుకు తడిసి, నాచుబట్టిన ఆ కిటికీ రాతిమీదకూర్చోటానికి అనుమతి పొందినప్పుడు, మున్నెన్నడూ ఆశించని ఆదర సత్కారాలు జరిగినట్లుంది నాకు. రెయినుకోటు వేసుకుని బయలుదేరినప్పుడు, యింత అదృష్టం పడుతుందని కలలోకూడా అనుకోలేదు — యివాళ బదాయూ నవాబు గులాము ఖాదర్ ఖాను కుమార్తె తెలుస్తినా లేక మెహరున్నీసా, అనుగాని నాకు ఒక సరసన సమాన స్థానంలో కూర్చునే భాగ్యం ప్రసాదించింది!

హిమాలయపు వక్షస్థలం మాదిరి విస్తృతంగావున్న తావున, కొండరాతిమీద కూర్చుని జాటవారులయిన స్త్రీ పురుషుల ప్రణయగాథ, దైవికంగా అప్పుడే రచింపబడిన కావ్యకథవలె రుచిస్తుంది. ఊరిస్తున్నది వినిపిస్తున్న పర్వత గుహల్లోని సరస్సుల అలల నాదాలు, కాళిదాసు రచించిన మేఘసందేశం, కుమార సంభవంలోని విచిత్ర సంగీత ధ్వనులు పాటకుల హృదయాలను స్పందింపజేయవచ్చు; అయినప్పటికీ బూట్లు, రెయినుకోటు ధరించి, రోడ్డుపక్కన వర్షానికి తడిసి, మురికిగొట్టుకున్న బండమీద; సన్యాసిని వేషంలో వున్న వొక అపరిచిత రాకుమారికి యెదురుగా కూర్చుని, డాబు దర్పాలను యథాప్రకారం నిలుపుకోటం, నాలాంటి నవనాగరికునికి తేలిక కాదని అందరూ అంగీకరించక తప్పదు. కాని, ఆరోజున దట్టమైన పొగమంచుకు చీకట్లు కమ్ముతూన్నవి. లోకంయెదుట సంకోచించవలసిన పనే లేకుండా పోయింది. ఆ అనంతమేఘ సామ్రాజ్యంలో నేను, నవాబు పుత్రిక యిద్దరమే: ఒక నవ నాగరికుడు, ఒక రాజకుమారి — ప్రళయశేషం మాదిరి మిగిలాము. సాపత్యంలేని యీ విడ్డూరపు సన్నివేశం మా యిద్దరి నొసటనే వ్రాసిపెట్టి వుంది, పరులకు గోచరించకుండా!

"రాకుమారీ! మీ దుస్థితికి కారకులెవరు?"

శ్రీ నన్నపనేని సుబ్బారావు

ఆమె అరచేతితో నొసలు కొట్టుకుని – "అన్నీ యెవరు చేస్తారో నేనేమి యెరుగుదును? అభేద్యమైన యీ హిమాలయ పర్వతాన్ని మామూలు పొగ మంచుతో యెవరు కనుమరుగు చేస్తున్నారు?" అని అంది.

నేను యేలాంటి తాత్విక చర్చలోకి దిగకుండా, ఆమె మాటను అంగీకరించాను. "అవును! అదృష్టం సంగతి యెవరు చెప్పగలరు? మన మందరం క్షుద్ర జీవులం!"

చర్చ ప్రారంభిస్తే, రాకుమారిని అంత తేలగ్గా వదలను కాని, మనోభావాలను వ్యక్తం చేయదగిన భాషా పరిజ్ఞానం లేదు. నాకున్న కొద్ది వుర్దూ పరిచయం, రోడ్డు పక్కన కూర్చుని, రాజపుత్రికలతో అదృష్టవాదము, స్వతంత్ర యిచ్ఛా వాదాలను గురించి సాకల్యంగా చర్చించటానికి సరిపోదు.

"నా విచిత్ర ఆత్మకథ నేడే సమాప్తమయింది. మీరు సమ్మతిస్తే, విన్నవిస్తాను."

నేను ఆత్రతగా – "అలా సెలవిస్తారేమిటి రాకుమారీ! నేను సమ్మతించటమా? అవును, మీరు గనుక కనికరించి విన్పిస్తే, అది నా అహోభాగ్యంగా యెంచుతాను" అని చెప్పాను.

నేను సరిగా యివేమాటలు చెప్పాననుకునేరు! చెప్పాలనుకున్నాను. కాని, తగిన సామర్థ్యం లేదు. ఆమె మాట్లాడుతుంటే, మంచులో స్నానంచేసి, కాంతులీను పంటచేల బంగారు రంగు కంకులమీదుగా వుదయకాలపు పిల్ల వాయువులు వుయ్యాల లూగుతున్నట్టుంటుంది. ప్రతిమాటలో వుట్టిపడే ఆ సరళ వినయమూ, సుకుమారత, సౌందర్యము, పదలాలిత్యమూ చెప్పనలవికాకుండా వున్నవి. నేనేమో ముక్తసరిగా మోటుగా సూటి జవాబులు చెపుతున్నాను. సంభాషణలలో యింత సరళశిష్టత నాకు యేకాలంలోనూ కన్పించలేదు. ఆమెతో మాట్లాడుతుంటే, మొట్టమొదటగా యివాళ అడుగడుగునా, నా దైన్యము కన్పించసాగింది.

"మా తండ్రిగారి వంశములో ఢిల్లీ పాదుషాల రక్తం ప్రవహిస్తూ వుంది. అది సురక్షితం చేయడానికి తగిన సంబంధము నాకు యెక్కడా కుదరలేదు. యెంత గాలించినా, అన్ని లక్షణాలూవున్న రాకుమారుడు లభించలేదు. నన్ను వివాహం చేసుకోవాలని లక్నో నవాబు వర్తమానం పంపాడు. కాని, మా తండ్రిగారు రోజులు గడపసాగారు. యింతలో, తోటాలు కొరికిన విషయం పురస్కరించుకుని, ప్రభుత్వం సైన్యంలో తుఫానుమాదిరి తిరుగుబాటు చెలరేగింది; ఫిరంగుల పొగవల్ల హిందూదేశమంతటా చీకట్లు కమ్మినవి!"

ఒక స్త్రీ ముఖతా, ముఖ్యంగా రాజవంశానికి చెందిన ఒక రాకుమారి వుర్దూ మాట్లాడటం నే నెన్నడూ వినలేదు. ఇవాళ ఆ భాగ్యం కలిగింది. వుర్దూ భోగవిలాసాలు మినహా, మరో పనిపాటులు లేని ధనసంపన్నుల భాష అని స్పష్టంగా అర్థమయింది. కాని, నేడు ఆ కాలం గతించింది. నేను ఆమెతో రైల్వేలు–టెలిగ్రాఫులవల్ల, పనిపాటుల వొత్తిడివల్ల, గొప్ప గొప్ప వంశాలు నశించిపోవటంవల్ల సర్వమూ క్షుద్రమము, అలంకార విహీనము అయినట్టుంది. రాకుమారి భాష విని, ఆంగ్లేయులు కొత్తగా నిర్మించిన డార్జిలింగు భోగమందిరాలతో గూడా, నా మనోనేత్రాల ముందు మొగలు చక్రవర్తుల మానసపురం, మాయాబలంతో ప్రత్యక్షమయింది – ఆకాశాన్ని చుంబించే తెల్లని చలువరాతి భవంతులు' రాజవీధుల్లో కుచ్చు తోకలతో శోభిల్లే జాతిగుర్రాల వీపులమీద జరీ పని చేసిన ముఖమల్ గలిసెనలు, అందాలుచిందే బంగారు జాలరుల ఏనుగు అంబారీలు, నగరవాసుల శిరస్సున శోభిల్లే అమూల్యమయిన తలపాగాలు, మంచి పట్టు పాజామాలు, మేలిమస్తులు, నడుమున వ్రేలాడు వక్ర ఖడ్గము, ముందు భాగంలో వంపులు తిరిగి జరీపని చేసిన ముచ్చెలు, దీర్ఘ విశ్రాంతి సమయము. వొదులు వొదులుదుస్తులు, అమితశిష్టాచారము, ఆదర సత్కారాలు– అన్నీ నాకు కళ్ళకు కట్టినట్టు కన్పించినవి.

ఆమె చెప్ప నారంభించింది – "మా దుర్గము యమునా నది వొడ్డునవుంది. మా సేనాపతి హిందూ బ్రాహ్మణులు. వారి పేరు కేశరలాలు."

నవాబు పుత్రిక 'చివరి' 'కేశరలాలు' శబ్దంమీద, నారీకంఠంలోని సమస్త సంగీతాన్నీ క్షణకాలంపాటు గుమ్మరించినట్టుంది. చేతిబెత్తం నేలమీద పెట్టి, కథ విందామని, సర్దుకుని సావధానుడనై కూర్చున్నాను.

"కేశరలాలు సనాతన హిందువు. నేను నిత్యమూ వుదయమే లేచి, అంతఃపుర భవనంలోని కిటికీలో

నుంచి చూసేదాన్ని — కేశరలాలు రొమ్ములోతు నీటిలో దిగి చేతులు జోడించి, ఉదయించే సూర్య భగవానునికి ప్రదక్షిణచేసి, జలాంజలి సమర్పించేవాడు. ఆ పిమ్మట, తడిబట్టలతో యమున వొడ్డున కూర్చుని, యేకాగ్ర చిత్తంతో జపంచేసి, కమ్మని స్ఫుటకంఠంతో భగవత్సంకీర్తన చేస్తూ యింటికి వెళ్ళేవారు.

నేను పేరుకు మహమ్మదీయ బాలికనే! కాని, మా మతాన్ని గురించి, మతోపాసనగురించి నాకు ఓనమాలు కూడా రావు. ఆ కాలంలో మా మగవారందరూ, భోగ విలాసాల్లో, ఆమోద ప్రమోదాల్లో, ప్రేమ కలాపాల్లో మునిగి తేలుతున్నారు; బాహ్యాడంబరము తప్ప, వాస్తవమైనధర్మచింత వారిలో పూర్తిగాలుప్తమయింది. అందువల్ల అంతఃపుర విలాసమందిరాల్లో కూడా కలికానికయినా కానరాకుండాపోయింది.

ఆ పరమాత్ముడు నాలో స్వభావసిద్ధంగానే ధార్మిక తృష్ణ ప్రసాదించాడనుకుంటాను. లేక మరో కారణమేదైనా వుందేమో చెప్పలేను. కాని నిత్యమూ ప్రశాంత, ప్రభాతకాలాన అప్పుడే ఉదయించిన సూర్యుని యెఱ్ఱని వెలుగులో, నిస్తరంగ వినీల యమునానది చలువరాతి మెట్లమీద కేశరలాలు పూజాసంకీర్తనల దృశ్యము చూసి, నిద్ర నుంచి మేల్కాంచిన నా హృదయము అవ్యక్త భక్తి మాధుర్యంతో నిండిపోయేది.

నిత్య విశుద్ధవర్తన వల్ల కేశరలాలు శరీరచ్ఛాయ దబ్బ పండుమాదిరి మిసమిసలాడుతూ ధూమ్రవిహీనమైన దీపశిఖవలె ప్రకాశించేది. ఆ బ్రాహ్మణుని పుణ్య మహత్త్వము అపూర్వ శ్రద్ధాభారంతో నావంటి మహమ్మదీయకన్య విమూఢ హృదయాన్ని వినయ సంపన్న మొనర్చేది."

ఆమె చెపుతూ చెపుతూ మధ్యలో క్షణకాలం ఆగింది. ఆమె మోముమీద అలముకున్న ఉజ్వల బ్రాహ్మణత్వ దీప్తులను పొక్కవుదుటన త్రోసివేసి కథాక్రమాన్ని ప్రారంభింప జూస్తున్నట్టుంది. కేశరలాలు ప్రసంగంలో విశుద్ధసంస్కృతశబ్ద ప్రయోగాలకు నేను విస్తుపోయాను. ఆ మాట్లాడేది నవాబు పుత్రికా లేక సన్యాసినా!

ఆ సన్యాసిని చెప్పసాగింది :—

"నా వద్ద ఒక హిందూ పరిచారిక ఉంది. ఆవిడ నిత్యమూ కేశరలాలుకు నమస్కరించి, పాదధూళిని గ్రహించేది. ఆ దృశ్యం చూసి, నాకు ఒక చెంపన ఆనందమూ, ఒక చెంపన యీర్ష్యా కలిగేది. ఆ పరిచారిక పండుగ పబ్బాలకు బ్రాహ్మలకు భోజనాలు పెట్టి, దక్షిణ యిస్తుండేది. నేను ధన రూపంగా తోడ్పడుతూ 'కేశరలాలును భోజనానికి యెందుకు పిలవవు?' అని అడిగేదానిని. కాని, ఆవిడ నాలుక కరచుకుని- 'ఆ బాబుగారు ఒకరి భోజనము, దక్షిణ ముట్టరు!' అని చెప్పేది.

యిలా ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాకాని కేశరలాలు పట్ల నా భక్తి ప్రపత్తులను వెలిబుచ్చలేక పోవటంవల్ల నా మనసు క్షుధాతురుడైన లోభి మాదిరి తయారైంది. మా పూర్వీకులెవరో బ్రాహ్మణకన్యను రాక్షసవివాహం చేసుకున్నారు. నేను అంతఃపుర మందిరాల్లో ఏకమూల కూర్చుని, ఆ పవిత్ర రక్తమే నాలో ప్రవహిస్తున్నట్టు భావించే దానిని. ఆ రక్త సంబంధం కారణంగా కేశరలాలుతో నా ఆత్మీయత ఊహించుకుని కొంత తృప్తి పడుతుండేదానిని.

నేను హిందూ పరిచారికవద్ద హిందూమత ఆచార వ్యవహారాలు, ఆశ్చర్యకరమైన దేవతాగాథలు, రామాయణ మహాభారతాది అపూర్వ యితిహాసాలు సందేహనివృత్తి చేసుకుంటూ, చక్కగా ఆలకించాను. వినగా వినగా, అంతఃపురంలో కూర్చున్న నా కాళ్ళ ముందు ఒక అపూర్వ హిందూ ప్రపంచ దృశ్యం ప్రత్యక్షంగా సాగింది. ఆ విగ్రహాలు, ఘంటారవాలు, బంగారు కలశాలతో విరాజిల్లే దేవాలయాలు, సువాసనలు విరజిమ్మే ధూపదీపాలు, అగరుచందనాలతో మేళవించిన పూలవాసనలు, యోగుల అద్భుతశక్తులు, బ్రాహ్మణుల లోకోత్తర మహత్తూ, మానవావతారంలో దేవతల విచిత్రలీలలు — యివన్నీ కలిసి, బహు పురాతనము, అత్యంత విశాలము అయిన ఒక అస్వాభావిక మాయాలోకాన్ని సృష్టించేవి. నా మనసు గూడు మరచిన పక్షి మాదిరి, సంధ్యవంటి పురాతన విశాల భవనంలోని చిన్న గదుల్లో తిరుగాడు తున్నట్టుండేది. హిందూ ప్రపంచము నా కిశోర హృదయానికి చవులుగొలిపే 'కథా సరిత్సాగరం' మాదిరి మారిపోయింది!

అప్పుడే కంపెనీ గవర్నమెంటుతో యుద్ధం ప్రారంభమయింది. మా కోటలోకూడా విద్రోహాగ్నులు రాజుకుంటున్నవి. 'ఆర్యావర్తనం నుంచి యీ

గోమాంస భక్షకజాతిని పారద్రోలటానికి హిందూ మహమ్మదీయులు కలిసి ప్రయత్నించాలి, అని నిర్ణయించుకున్నారు కేశరలాలు.

మా తండ్రిగారు దూరదృష్టి గలవారు; చతురులు. వారు ఆంగ్లేయుల్ని ఒక ప్రత్యేక బాంధవ్యంతో సంబోధిస్తూ — 'వీళ్ళు చేయలేనిదంటూ యేమీలేదు. హిందూ దేశస్థులు వీళ్ళతో యుద్ధంచేసి నెగ్గలేరు. నేను పేరాశకుపోయి, చేతిలోని యీ కోట పోగొట్టుకోను! వీళ్ళతో యుద్ధానికి దిగటం నాకు సుతరామూ యిష్టంలేదు!' అన్నారు.

హిందూదేశంలోని హిందూ మహమ్మదీయుల రక్తం, పొంగులువారే తరుణంలో, మా తండ్రిగారు అవలంభించిన వైశ్యచాతుర్యానికి, మేమంతా యేవగించుకున్నాము; చివరికి అంతఃపుర రాణులుకూడా విచలితులయారు.

అంతలో, ఆయుధపాణులైన తన సైనికులతో కేశరలాలు వచ్చి మా తండ్రిగారితో — "నవాబుగారూ! మీరు మా పక్షంలో చేరకపోతే, కనీసం యుద్ధం సాగనంతకాలమయినా మీరు మా బందీలు! నేటినుంచీ యీ కోట సంరక్షణ బాధ్యత నామీద వుంటుంది!" అని విస్పష్టంగా చెప్పారు.

"దీనికి యింతఆర్భాటందేనికి? నేనూ మీ పక్షమే!"

"ఖజానానుంచి కొంత ధనం యిప్పించండి."

తండ్రిగారు పెద్దగా యిచ్చిందిలేదు కాని, పైకి మాత్రం "అవసరాన్నిబట్టి యిద్దాం?" అన్నారు.

నేను ఆపాదమస్తకం ధరించే అమూల్యాభరణాలన్నీ మూటకట్టి, మా హిందూ పరిచారికచేత కేశరలాలుకు పంపాను. వారు నా కానుకను స్వీకరించారు. సంతోషంతో నా సర్వావయవాలూ పులకరించినవి; శరీరం గగుర్పొడిచింది.

కేశరలాలు తుప్పుపట్టిన తుపాకులు, కత్తులు శుభ్రం చేస్తున్నారు. యింతలో అకస్మాత్తుగా ఒకనాడు జిల్లా కమీషనరు, ఎర్రని, దుస్తులతోవున్న ఆంగ్లేయ సైనికదళాన్ని వెంట పెట్టుకుని, భూమ్యాకాశాలను ధూళితో నింపుతూ, కోటను ముట్టడించారు.

మా తండ్రిగారు యీ తిరుగుబాటువార్త, కమీషనరుకు పంపారు రహస్యంగా!

కాని బదావూ సైన్యం కేశరలాలు కనుసన్నల్లో మెలిగేది. వారి వుత్తరువుకాగానే, ఆ తుప్పుపట్టిన ఆయుధాలతోనే ప్రాణా లర్పించటానికి సిద్ధపడింది.

నమ్మక ద్రోహియైన మా తండ్రిగారి భవనం నాకు నరకంలా తోచసాగింది. సిగ్గుతో, దుఃఖంతో, యేవగింపుతో నా హృదయం వ్రయ్యాలవుతూవుంది. కాని ఒక్క కన్నీటి చుక్కకూడా రాలలేదు. పిరికిపంద అయిన సోదరుని దుస్తులతో వేషం మార్చుకుని అంతఃపురం విడిచిపెట్టాను. అక్కడ యిదంతా గమనించే స్థితిలో యెవరున్నారు అప్పుడు?

అప్పటికి కాల్పుల సొదలు, సైనికులఆర్తనాదాలు, తుపాకుల మ్రోతలూ అన్నీ స్తంభించినవి. భూమ్యాకాశాల్లో భయంకరమైన మృత్యుశాంతిఅలముకుంటూ వుంది. సూర్యుడు యమునానది వినీల జలాన్ని రక్త రంజితమొనర్చి, అస్తమించాడు. చంద్రుడు నిర్మలాకాశంలో పండు వెన్నెలలు విరజిమ్ముతున్నాడు. యుద్ధభూమి రక్తపాతంతో, భయంకరంగా కన్పిస్తూంది. మరొక సమయాన అయితే, కనికరంతో నా హృదయం చీల్చుకుపోయేది. కాని నేను స్వప్నంలోనుంచి మేల్కాంచి, అనాడు ఇటూ తిరుగుతున్నట్లుంది. కేశరలాలును అన్వేషిస్తూ! ఆ వొక్కటి మినహా, సమస్త ప్రపంచమూ భ్రమలా తోస్తూవుంది.

వెదకగా, వెదకగా నడిరాత్రికి ఆ పండు వెన్నెల్లో రణక్షేత్రానికి సమీపంలోనే యమునానది తీరాన మామిడితోపులో వొక చెట్టుక్రింద కేశరలాలు, వారి నమ్మినబంటు దేవకీనందను శవాలు కన్పించినవి. యుద్ధంలో క్షతగాత్రులయిన పిమ్మట, యజమానిని సేవకుడో, లేక, సేవకుడు యజమానినో యీ నిరాపద స్థానానికి చేర్చివుంటారని నాకు అర్థమయింది. తర్వాత యిద్దరూ ప్రశాంతంగా మృత్యుదేవతను ఆలింగనం చేసుకున్నారు.

మొదట నేను నా హృదయంలోని చిరకాల భక్తి తృష్ణను సార్థకం చేసుకున్నాను. కేశరలాలు పాదాల చెంత కూర్చుని, పదేపదే ఆజాను లంబితశిరోజాలతో వారి పాదధూళిని తుడిచాను; వారి శీతల చరణ కమలాలు నా శిరస్సున అద్దుకున్నాను. తర్వాత, పాదాలు చుంబించగానే, చిరకాలావరుద్ధమైన కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహించ సాగింది.

అంతలో శరీరం కొంచెం కదిలింది; వారు బాధతో ఒకసారి మూలిగారు. నేను త్రుళ్ళిపడి, పాదాలు వదిలి పెట్టాను. తర్వాత వారు నిమీలిత నేత్రులై, తడి యారిన గొంతుతో – "మంచినీళ్ళు!" అనటం విన్పించింది.

నేను తత్షణమే యమునా నదికి వెళ్ళి, దుప్పటి నీటిలో ముంచుకు వచ్చాను. దుప్పటి పిండుతూ, వారి దాహం తీర్చసాగాను. యెడమ కంటిమీద, తలమీద తీవ్రమైన దెబ్బలు తగిలినవి. దుప్పటి చెరగు చింపి, కట్టుకట్టాను.

ఇలా యమునానదినుంచి నీళ్ళు తెస్తూ, వారి మోము, కన్ను తడుపుతూ వున్నాను. క్రమంగా స్పృహ వచ్చింది. "యింకా నీళ్ళు తెమ్మంటారా?" అని అడిగాను.

"ఎవరవు నీవు?"

నేను నిగ్రహించుకోలేక చెప్పివేశాను! "మీ పాదదాసిని! నవాబు గులాము కాదిర్‌ఖాను కుమార్తెను!"

కేశరలాలు తనువుచాలిస్తూ, తన భక్తురాలి ఆద్యంత పరిచయం తనతో తీసుకు వెళ్ళుతారు; యీ సుఖంనుంచి నన్నెవరూ వంచించలేరని తలంచాను.

కాని, నా పరిచయం చెప్పగానే, సింహం మాదిరి– "విశ్వాసఘాతకుని బిడ్డవు! మ్లేచ్ఛవు! చనిపోయే సమయాన, నీ చేతిమీదుగా గొంతుకలో నీళ్ళు పోసి, నన్ను ధర్మభ్రష్టుణ్ణి చేశావు" అని గర్జిస్తూ, కుడి చేత్తో గట్టిగా ఒక చెంపపెట్టు పెట్టారు. నా కళ్ళ ముందర చీకట్లు కమ్మినవి; యించుమించు తెలివితప్పినంతపని జరిగినది.

అప్పటికి నాకు పదహారేళ్లు వుంటవి. అదే మొదటిసారిగా యిల్లు కదలటం! అంతవరకూ బాహ్యాకాశంలోని బుద్ధభానుని తప్తకిరణాలు నా సుకుమార కపోలాల రక్తిమను, ముఖలావణ్యాన్ని అపహరించలేదు. ఆనాడు బాహ్య జగత్తులో అడుగిడగానే, నా యిహదేవత ప్రసాదించిన ప్రథమ ప్రేమాశీర్వాదాలు యివే!" అని చెప్పి రాకుమారి మౌనం వహించింది.

నేను యింకా ఆరిపోయిన సిగరెట్టు చేతిలో పెట్టుకుని ముగ్ధుణ్ణయి, చిత్రాంకితమూర్తివలె నిశ్శబ్దంగా కథ ఆలకిస్తున్నాను. ఆ భాషాలాలిత్యమూ, సంగీత మాధుర్యమూ చెప్పనలవికాదు.

"చాలా సేపు జరిగిపోయింది; నేను ఆపుకోలేక, హఠాత్తుగా నోరు జారాను— 'పట్టి పశువు!'"

"పశువెవరు? పశువు దాహంతో ప్రాణాలు పోయేటప్పుడు, నోటిదగ్గరకి వచ్చిన నీటిని ముట్టకుండా వుంటుందా?"

నేను సిగ్గిలి— "అవునవును! అతను దైవము!" అన్నాను.

"యెలాంటి దైవం? యెక్కడైనా దైవము భక్తురాలుదీక్షతో చేసిన శుశ్రూషను కాలరాస్తుందా!"

"అవును! మీరు చెప్పేది వాస్తవమే!"

రాకుమారి మళ్ళీ చెప్పసాగింది :—

"మొదట నా హృదయం తీవ్రంగా గాయపడింది. హఠాత్తుగా మిన్ను విరిగి మీదపడినట్టుంది. తర్వాత కొంతసేపటికి తేరుకుని, సద్గుణుడు, నిష్కళంకుడు, నిర్వికారుడు, పవిత్రుడు అయిన ఆ బ్రాహ్మణుని పాదాలకు దూరంనుంచే నమస్కరించాను. 'మీరు అల్పుల పరిచర్య, పరాన్నము, ధనవంతుల ధనము, యువతుల యౌవ్వనము, స్త్రీల ప్రేమ— దేనినీ వాంఛించరు, దేనినీ స్వీకరించరు. మీరు స్వతంత్రులు, స్వాధీనులు మోహబంధవిదూరులై వున్నారు. మీ సాన్నిధ్యానికి వచ్చి ఆత్మార్పణచేసే అధికారం మాకెక్కడిది?' అని మనసులో అనుకున్నాను.

రాకుమారి సాష్టాంగ ప్రణామం చేసినందుకు కేశరలాలు యేమనుకున్నారో చెప్పలేను, కాని వారి మోముమీద ఆశ్చర్యం కాని, మరోవిధమైన భావ పరివర్తనం కాని కన్పించలేదు. వారు ప్రశాంత దృక్కులతో వొక పర్యాయం నాకేసి చూసి, నెమ్మదిగా లేవటానికి ప్రయత్నించసాగారు. నేను విహ్వలురాలినై, చేయూత నివ్వబోయాను. కాని వారు నీరవంగా తృణీకరించి, అతికష్టంమీద కాళ్ళీడ్చుకుంటూ, రేవు దగ్గరకు నెమ్మదిగా చేరుకున్నారు. అక్కడ ఒక నావవుంది; కాని నావికుడులేడు; ప్రయాణీకులులేరు. కేశరలాలు నావయెక్కి, లంగరు యెత్తారు. చూస్తూ వుండగానే, నావమధ్య ప్రవాహంలోకి వెళ్ళిపోయింది. క్రమంగా అదృశ్యమయింది. నా సమస్త హృదయభారంతో, నా సంపూర్ణ యవ్వన భారంతో, అనాదృత భక్తిభారంతో ఆ అదృశ్య నావకు చేతులు జోడించి, ఆ నిస్తబ్ధ నిశీథ సమయాన,

పండు వెన్నెల్లో తేలియాడుతున్న ప్రశాంత యమునా నదీ గర్భంలో, ఆ కాలంలో వృంతచ్యుతినొందిన పుష్పమంజరి మాదిరి, నా యీ వ్యర్థ జీవితాన్ని సమర్పించాలని, ప్రపంచంలో నా అస్తిత్వం తుడిచి వేయాలని ఒకకోరిక నాలో పొడచూపింది.

కానీ, అలా చేయలేకపోయాను. ఆకాశంలోని చంద్రుడు, యమునానది, ఆవలివొడ్డున దట్టంగా పెరిగిన నల్లని వృక్ష పంక్తులు, కాళిందీనదిన వినీల నిస్తరంగ జలాలు, దూరాన మామిడితోపు మీదుగా, వెన్నెల్లో ధగధగ మెరుస్తున్న మా కోట బురుజులు— అన్నీ యేకమై, ఒకే తానంతో గంభీర మృత్యు గీతాన్ని ఆలాపిస్తున్నవి. ఆ నిశీథంలో, గ్రహ, చంద్ర, తారలతో విరాజిల్లే, నిస్తబ్ధ త్రిభువనాలూ యేక కంఠంతో మృత్యు సందేశం విన్పిస్తున్నవి. నిస్తరంగ, ప్రశాంత నదీ ప్రవాహంలో అదృశ్యమైన జీర్ణ నావ, ఆ వెన్నెలరాత్రి, సుందరము, శాంతము, అనంతము, భుపిన మోహనము అయిన మృత్యుపాశంనుంచి విడిపించి, నన్ను జీవనపథానికి తీసుకువచ్చినది. నేను ఆ మోహ స్వప్నంలో స్మృతి నొందినట్లు, యమునానది వొడ్డున— పచ్చిక ప్రదేశాలు, యిసుక తిప్పలు, యెగుడు దిగుడు తావులు, విరిగిన అంచులు— పడి, నడిచిపోతున్నాను.''

ఆమె యింతవరకూ చెప్పి, వూరుకుంది. నేనూ యేమీ మాట్లాడకుండా కూర్చున్నాను.

కొంత సేపటికి మళ్ళీ చెప్పనారంభించింది :—

"తర్వాత సంఘటనలు చాలా జటిలమైనవి. వాటిని యెలా విడమర్చి స్పష్టం చేయాలో నాకు బోధపడకుండా వుంది. కీకారణ్యంలోగుండా ప్రయాణంచేస్తూ, మనము యేదారిని యెక్కడనుంచి బయలుదేరామో, వెదికి చెప్పగలుగుతామా? కథ అస్వాభావికము, అసంభవమనిపించకుండా, ప్రత్యక్షమయే విధంగా, యెక్కడనుంచి ప్రారంభించేది? యెక్కడ ముగించేది? యెంత విడిచిపెట్టను? యెంతవరకు జరిగింది జరిగినట్లు చెప్పను?

కానీ, యీ అల్పజీవితంలోనే అసంభవమనేది లేదని అవగతమయింది. అంతఃపుర రాజపుత్రికలకు బాహ్య ప్రపంచము చాలా దుర్గమైనది కావచ్చు. కాని అది ఊహామాత్రమే! ఒకసారి బాహ్య జగత్తులో అడుగిడిన తర్వాత మార్గం దానంతటదే గోచరిస్తుంది. అది రాజమార్గం కాకపోవచ్చు కాని మార్గమేకదా! ఆ మార్గాన మానవుడు ఆది కాలం నుంచీ ప్రయాణం చేస్తున్నాడు. అది అనంతము, విచిత్రమయినది; యెగుడు దిగుడుగా వుంటుంది; శాఖోప శాఖలుగా చీలుతుంది! సుఖ దుఃఖాలతో, సాధకబాధకాలతో నిండివుంటుంది. కాని అదీ మార్గమే!

సాధారణ వ్యక్తులకు అసాధారణ మార్గాన యేకాకిగా దీర్ఘయాత్ర చేసిన ఒక రాకుమారి గాథ వినసొంపుగా వుండకపోవచ్చు! ఒక వేళ వున్నప్పటికీ నాకు లవలేశమూ వుత్సాహం లేదు. సారాంశమేమిటంటే, నేను యెన్నో కష్టాలు, ఆపదలు, అవమానాలుభరించాను. కాని నిన్నటివరకూ జీవితం దుర్భరమనిపించలేదు. అవ్వాయిచువ్వమాదిరి కాలినకొద్దీ మహావేగంతో తిరిగాను. అప్పుడు నాకు 'దగ్ధమవుతున్నాను' అనే తలంపే లేదు. యివాళ హఠాత్తుగా సుఖదుఃఖాల దీపశిఖ పొక్క గాలివిసురుకే ఆరిపో దానితో నేనూ, గోడ అంచున వుండే జడపదార్థం మాదిరి పడిపోయాను. నేడీజీవనయాత్ర నా జీవితంలో అన్నిటికంటె మహత్తరము, ప్రియతమము అయిన ప్రయాణం పూర్తయింది. యిక్కడే నా కథ కూడా సమాప్తమయింది"

రాకుమారి అంతవరకూ చెప్పి మళ్ళీ వూరుకుంది. నేను మనసులో 'కాదు యింతటితో కథ యెలానూ ముగియటానికి వీల్లేదు' అనుకున్నాను. కొంచెం తాళి, వచ్చిరాని వుర్దూలో "నా విధేయతను మన్నించండి! చివరిరోజు విషయం కొంచెం స్పష్టంగా చెపితే, నా మనోవ్యాకులత కొంతయినా వుపశమిస్తుంది" అన్నాను.

ఆమె ఫక్కుమని నవ్వింది! నా వుర్దూ పాండిత్యం వ్యర్థంకాలేదని గ్రహించాను. నేను చక్కని వుర్దూలో మాట్లాడగలిగితే నాముందర చాలా సిగ్గుపడేది. నాకు ఆమె మాతృభాషలో చక్కని ప్రవేశం లేకపోవటమే మా యిద్దరి మధ్యా పరదాగా పనిచేసింది; సిగ్గు కాపాడింది.

ఆమె మళ్ళీ కథ అందుకుంది :

"కేశరలాలు వార్తలు నాకు యెప్పటికప్పుడు అందుతూనే వున్నవి; కాని వారిని కలుసుకోవటం

యెలానూ పడలేదు. వారు తాంత్యాటోపీ దళంలో చేరి విద్రోహ పతాకం చేపట్టి, నలుదిక్కులా మెరుపు మాదిరి శత్రుసైన్యం మీద ఆకస్మిక దాడులుచేసి నష్ట పరుస్తూ, మరు క్షణంలోనే అదృశ్యమవుతూ వుండే వారు.

నేను యోగినయాను. కాశీ శివానందస్వాముల వారిని ధర్మపితగా యెంచి, వారివద్ద శాస్త్రాలుచెప్పు కుంటున్నాను. దేశంలోని వార్తలన్నీ వారికి అందు తుండేవి. నేను భక్తితో శాస్త్రాధ్యయనం చేస్తూ, శంకిత చిత్తంతో, గుండెలు చీల్చే వ్యాకులపాటుతో యుద్ధవార్తలు కూడా తెలుసుకుంటూ వుండేదాన్ని

ఆంగ్ల ప్రభుత్వం విద్రోహాగ్నిని కాలరాచి, అణచి వేసింది. వున్నట్టుండి కేశరలాలు వర్తమానం తెలి యటం ఆగిపోయింది. భీషణ ప్రళయాగ్నికీలల్లో సుదూర ప్రాంతాలనుంచి క్షణ క్షణమూ కన్పించే వీరమూర్తులు, హటాత్తుగా అంధకారంలో విలీన మయారు.

ఇక నేనక్కడ వుండలేక, వారి ఆశ్రయం వదిలి, భైరవి వేషంలో బయలుదేరాను. అనేక తీర్థాలు, మఠాలు, మందిరాలు తిరిగాను. యెక్కడా కేశర లాలు జాడ తెలియలేదు. 'వారు యుద్ధంలో చని పోయి అయినా వుండాలి, లేకపోతే ప్రభుత్వమయి నా పురికంబం యెక్కించి వుంటుంది.' అని, వారి పేరు తెలిసిన యిద్దరి ముగ్గురి నోట విన్నాను. అసం భవం, వారు మరణించి వుండరు. ఆ బ్రాహ్మణుడు, ఆ ప్రజ్వలిత దీపశిఖ యెప్పటికీ అస్తమించకూడదు. నా ఆత్మాహుతిని స్వీకరించటానికి, యెక్కడో వొక తావున, యే దుర్గమ, నిర్జన యజ్ఞ వేదికవద్దో ఆ దీప శిఖ, ఊర్ధ్వ శిఖలతో జ్వలిస్తూ వుంటుం'దని నా అంత రాత్మ ప్రబోధిస్తూ వుంది.

జ్ఞానార్జనవల్ల, తపస్సువల్ల శూద్రులు బ్రాహ్మణు లవుతారని హిందూశాస్త్రాలు ఘోషిస్తున్నవి. మహ మ్మదీయులుకూడా అలా బ్రాహ్మలవుతారో, లేదో యెక్కడా చెప్పలేదు. అందుకు కారణం, అప్పటికి మహమ్మదీయులు రాకపోవటమే ! వారిని పొందటా నికి దీర్ఘకాలం పడుతుందని యెరుగుదును. కారణం: ముందుగా నేను బ్రాహ్మణిని కావాలి ! వొక్కొక్క సంవత్సరమే పైబడుతూ ముప్ఫయియేళ్ళు గడిచి పోయినవి. నేను బాహ్యాభ్యంతరాలా, ఆచార వ్యవ హారాలా మనోవాక్కాయలా, బ్రాహ్మణి నయాను. మా బ్రాహ్మణ ముత్తవ రక్తం, నిష్పాప తేజంతో నా సమస్త శరీరంలో ప్రవహిస్తూ వుంది ! నేను మనసులో, యవ్వనారంభంనాటి ప్రథమ బ్రాహ్మణు నికి, తుది యవ్వనంనాటి ఆ అంతిమ బ్రాహ్మణునికి నా ముల్లోకాలలోని యేకైక బ్రాహ్మణునికి నిస్సం కోచంగా, నన్ను సమర్పించుకుని, వొక అపూర్వ దీప్తిని పొందగలిగాను.

కేశరలాలు వీరత్వాన్ని గురించి అనేక వార్తలు నా చెవిని పడినవి. కాని, అవేవి నా హృదయఫలకం మీద అంకితం కాలేదు. నేను ఆనాడు పండువెన్నెల రాత్రి, నిస్తబ్దంగా వున్న యమునానది మధ్య ప్రవా హంలో, చిన్న నావమీద వొంటరిగా ప్రయాణం చేస్తున్న కేశరలాలును చూశాను. నేటికీ ఆ దృశ్యమే నా హృదయంలో చెక్కుచెదరకుండా వుంది. ఆ ధీర బ్రాహ్మణ్యుడు, నిర్జనము, అనిర్దిష్టము అయిన మహా రహస్యం కేసి, సాగిపోతూవున్న దృశ్యమే నేను అహో రాత్రులు తిలకిస్తున్నాను. వారివెంట సేవకులుగాని సహచరులుగాని లేరు. వారికి యెవరి అవసరమూ లేదు. నిర్మల,ఆత్మనిమగ్నమైన పురుషుడుతనకు తానే పరిపూర్ణుడు. ఆకాశంలోని చంద్రుడు, నక్షత్రాలు ఆ పూర్ణపురుషుని నిరీక్షిస్తున్నవి.

కేశరలాలు రాజదండంనుంచి విముక్తి పొంది, నేపాలుప్రాంతం పరారు అయారని అప్పుడే తెలిసింది నేనూ అక్కడకు చేరుకుని, చాలారోజులు వున్నాను. కేశరలాలు నేపాలు విడిచిపెట్టి, కొద్దిరోజుల క్రితమే యెటో వెళ్ళారని, అతని భోగట్టాలు లవలేశమూ తెలియటంలేదని నమ్మకంగా జాడా తీశాను.

తర్వాత అనేకపర్వతప్రాంతాలు గాలించాను.పత్తా దొరకలేదు. యిది హిందూ ప్రాంతంకాదు. యిక్కడ నివసించే భూటానులు, లేపచాలు మ్లేచ్ఛలు ! వీరి ఆహార విహారాల్లో ఆచారము, నిష్ఠ కలికానికయినా కానరావు. వీరి దేవుళ్ళు, ఆ పూజాపద్ధతులు చాలా భిన్నంగా వుంటవి. దీర్ఘకాల సాధనవల్ల నేను పొందిన విశుద్ధ పవిత్రతకు యెక్కడ భంగం కలుగుతుందోనని భయపడసాగాను. నేను అతికష్టంమీద, అన్నివిధాలా అంటు సొంటులనుంచి నన్ను కాపాడుకుంటూ వచ్చాను. నా జీవిత నావ వొడ్డుకు చేరేరోజు దగ్గరకు వచ్చిందని, నా జీవితానికి పరమ పునీత, చరమ తీర్థం సమీపానికి వచ్చిందని నాకు తెలుసు !

యికను తర్వాత యేమి చెప్పను ?— అంతగా చెప్పవలసింది లేదు! దీపం కొండ యెక్కేటప్పుడు 'ఉఫ్' అంటే ఆరిపోతుంది. దాని నింకా దీర్ఘంగా యేమి వ్యాఖ్యానించను?.... ముప్ఫయి యెనమిది సంవత్సరాల పిమ్మట. డార్జిలింగు వచ్చి, యివాళ ఉదయమే కేశరలాలును చూడటం తటస్థించింది."

ఆమె మౌనం వహించగానే, నేను కుతూహలంతో "యెవరినీ చూసింది ?" అని అడిగాను.

"వృద్ధ కేశరలాలు, భుటానుల పల్లెలో, భుటానీ భార్యా పిల్లలతో, వాళ్ళకు కలిగిన మనుమలు, మనుమరాండ్రతో కలిసివుంటూ, మురికితోడి గుడ్డలు కట్టుకుని పొలం పనులు చేసుకోవటం కళ్ళారా చూశాను !"

కథ సమాప్తమయింది. యేదైనా సదార్భుగా రెండు మాటలు చెప్పాలనిపించింది. "ముప్పది యెనిమిది సంవత్సరాలు అహోరాత్రులూ ప్రాణ భయంతో, విజాతీయుల సాంగత్యంలో వుండవలసిన వ్యక్తి, తన ఆచార వ్యవహారాలు యెలా కాపాడుకో గలడు ?"

"నాకు ఆ మాత్రం తెలియదా ? కాని, యింత కాలంనుంచీ యే మోహానికి కట్టుపడి తిరిగాను ? యే బ్రాహ్మణత్వం నా కిశోరహృదయాన్ని హరించిందో. అది కేవలం వొక అభ్యాసము, సంస్కార విశేషమని నేనేం యెరుగుదును ? నేను అది ధర్మము; అనాది, అనంతము, సర్వకాల సర్వావస్థల్లో నిశ్చలంగా వుంటుందని భావించాను. అలా కాకపోతే, షోడశ వర్షప్రాయంలో, మొట్టమొదటసారిగా పితృగృహం వీడి, ఆ వెన్నెలరాత్రి, నవోన్మేషమై సద్యోపుష్పిత మయిన భక్త్యావేగంతో కంపించే, మనశరీర ప్రాణా లర్పించిన ఫలితంగా, ఆ బ్రాహ్మణుడు దక్షిణ హస్తంతో ప్రసాదించిన దుర్భర అవమానాన్ని గురు దీక్షగా యెంచి: నతమస్తకనై, ద్విగుణీకృత భక్తితో దేనికి శిరసావహించేదానిని? కేశరలాలు ఒక అభ్యాసానికిమారు, మరొక అభ్యాసం స్వీకరించారు. కాని నేను జీవితానికి బదులు మరో జీవితాన్ని, యవ్వనానికి మారు మరో యవ్వనాన్ని యెక్కడ పొందను?" అని చెప్పి ఆ రాకుమారి సత్వరమే లేచి నిలబడి— "నమస్కారం ! వస్తాను బాబుగారూ !" అంది.

మరుక్షణమే ఆమె తన తప్పు దిద్దుకుంటున్నట్టు— "సలామ్ బాబూసాహబ్ !" అంది.

ఆమె ఆ మహమ్మదీయ అభివాదనద్వారా, దుమ్ము కొట్టుకున్న జీర్ణ శీర్ణ బ్రాహ్మణత్వానికి తుది తిలోదకాలు యిచ్చింది. నేను పెదవి విప్పేసరికే, ఆమె హిమాలయాల పొగమంచులో మేఘం మాదిరి అదృశ్యమయింది.

నేను కొంతసేపు కళ్ళు మూసుకుని, ఆ రాకుమారి జీవితంలోని సంఘటనలన్నిటినీ నా మానసఫలకంమీద చిత్రించుకోసాగాను. యమునాతట దుర్గ గవాక్షసమీపాన పక్క—మీద కూర్చునివున్న షోడశవర్షీయ రాకుమారిని కాంచాను; తీర్థాల్లో, దేవాలయాల్లో, సందె వేళ హారతి యిచ్చేటప్పుడు, భక్తి భావంతో గాద్గద్యం చెంది, యేకాగ్ర చిత్తయైన తపస్విని చూశాను. ఆ తర్వాత డార్జిలింగురోడ్డు పక్కన, పొగమంచుచే కప్పబడిన భగ్నహృదయ భారంతో విహ్వలయైన ప్రౌఢ స్త్రీని, నిరాశామూర్తిని కూడా తిలకించాను. ఒక సుకుమార దేహంలో మహమ్మదీయ బ్రాహ్మణ భక్తి తరంగ సంఘర్షణనుంచి ఉద్భవిల్లిన విచిత్ర వ్యాకుల సంగీత ధ్వనులు, సుసంపూర్ణ సాహిత్య భాషారూపం ధరించి నా హృదయంలో స్పదించసాగినవి.

కన్నువిప్పి చూశాను: అకస్మాత్తుగా మబ్బుతేలిపోయింది. స్నిగ్ధ సూర్యకిరణాలతో నిర్మలాకాశము కళ్ళకు మిరుమిట్లు గొల్పుతున్నది. ఆంగ్లేయ వనితలు రిక్షాలలోను, పురుషులు గుర్రాలమీదా వ్యాహ్యాళికి బయలుదేరారు. చెదురుగా ఒకరిద్దరు భారతీయులు మఫ్లర్లు చుట్టుకుని, కుతూహలంతో వ్యంగ్య దృష్టిని నామీదికి పరపుతూ, వెళ్ళుతున్నారు.

నేను త్వరగా లేచి నిలబడ్డాను. సూర్యకాంతులచే ఉజ్వలము, అనావృతము అయిన ప్రపంచ దృశ్యంలో మేఘావృతమైన యీ కథ నాకు వాస్తవ మనిపించ లేదు. నేను పర్వతప్రాంతపు పొగమంచుతో నా సిగరెట్టు పొగను కలిపి, ఒక కల్పనాఖండం రచించినట్టు యెంచుతున్నాను. ఆ మహమ్మదీయ బ్రాహ్మణీ, ఆ విప్రపీరుడు, ఆ యమునా తటదుర్గము— యివేవీ యదార్థంకాదు !

మాతృక : రవీంద్రనాథ్ టాగూర్
(రవీంద్ర గ్రంథమాల సౌజన్యంతో)

శారద లేఖలు

సౌభాగ్యవతి కల్పలతకు.

నెచ్చెలీ!

నీవు వ్రాసినట్లు ఈ సంవత్సరము పెండ్లిండ్లు జరిగినంత విపరీతముగా ఇటీవల యెప్పుడును జరగని మాట వాస్తవము. ఈ వివాహముల కోలాహలము జూడ వెనుక శారదాబిల్లు పెట్టిన సమయములో జరిగిన వేలాది లక్షలాది వివాహములు తలంపునకు వచ్చినవి. కాని ఆనాటి పెండ్లిండ్లకును, నేటి పెండ్లిండ్లకును చాలా వ్యత్యాసమున్నది. ఆనాటి వధూవరులు ముక్కుపచ్చలారని పసివారు. ఏడాది లోపు పిల్లలకు గూడ అప్పుడు వివాహములు జరిగినవి. ఈనాటి వివాహములట్టివి కావు. ఈనాటి పెండ్లి కొమారులు పెండ్లి కొమార్తెలకూడ వయసు వచ్చినవారు, చదువుకొనినవారు, ఆనాడు వరకట్నములింత దారుణముగాలేవు, ఈనాడు వధూవరుల వయసుతో పాటు, విద్యతోబాటు, కట్నములు పెరిగినవి. ఈనాడు సకల వస్తువుల ధరలెంత మిన్నంటి యున్నవో వరకట్నములు గూడ అంత మిన్నంటియున్నవి. చదువుగాని, సంస్కారముగాని, యుక్తవయస్సుగాని ఈ దురాచారమును ఖండించ లేకపోయినది, సరిగదా ఇక ముందుగూడ ఖండింప జాలదను నిస్పృహ కూడ గలుగుచున్నది. వధూవరుల వివాహవయస్సు హెచ్చింపబడినచో వారు బాగుగా చదువుకొని లోకజ్ఞానము కలవారై యుక్త యుక్త విచక్షణగలిగి తమ తమ విషయమున గూడ ఉచితముగా ప్రవర్తింప గలరనియు వారి వివాహమున వారి తలి దండ్రులే కాక వారు గూడ బాధ్యత వహించు అవకాశముండ గలదనియు, వివాహ వయస్సు హెచ్చించుటకు సంస్కర్తలు ఊహించిరి. కాని ఆ ఆశలన్నియు అడియాసలైనవి. వయస్సు పెరిగినకొలది వధూవరులకు తాహతుకు మించిన తలంపులు మెండైనవి. హరవిలాస శారదా హెచ్చింప గోరిన వివాహ వయస్సు వధువునకు పదునాల్గు, వరునకు పదునెన్నిది మాత్రమే యనుకొందును. కానియీనాడు ఆ వయస్సులు బాల్యము క్రిందనే లెక్కయైనవి, వయసుమీరిన భయము యెవరికిని లేదు. వారికి కావలసినది వారి కోరికలు నెరవేరుట. ఈనాడు ప్రతి పెండ్లి కొమారునకు బి. ఏ పరీక్షలిచ్చిన కన్నెయే కావలయును. చక్కని చుక్కయే కావలయును. పదివేల కట్నము కావలయును. ఏది తక్కువైనను అంగీకరించురేమో కాని వరకట్నములో నయాపైసా తక్కువైన వరుడు అతని వాళ్ళు ఒప్పుకొనరు. ఇంక పెండ్లి కొమార్తెకో వరుడు తప్పకుండ ఎం. బి. బి. యస్స్, ఐ. ఎ. యస్, ఇంజనీరో చదివి ఉద్యోగమునున్నవాడై యుండవలెను. విదేశమున చదివి వచ్చినవాడై యుండిన మరింత సంతోషము. దీనితో పాటు చక్కదనము, ఆస్థి, హోదా, అన్నియు తప్పక యుండవలయును, ఈ పరిస్థితులేర్పడిన తరువాత వధూవరులను సమాధానము పెట్టలేక సంరక్షకులైన తల్లిదండ్రులు వెనుకటి బాల్యవివాహములే నేటి యీ యుక్తవయస్సు వివాహముల కంటె వేయిరెట్లు నయమని మొత్తుకొనుచున్నారు. ఆనాడు వధూవరులు అభయు, శుభమునెరుగని చిన్నవారు ననునది ఒకటే సమస్య. ఈనాడన్నియు సమస్యలే. ఈ కోరికలు తీర్చలేక. ఈ సమస్యలు పరిష్కరించలేక, ఈ ద్రవ్యమును వెచ్చించలేక అల్లాడిపోవుచున్నారు. ఈ పెండ్లీ గొడవచూడ నాకొకటితోచుచున్నది. ఈ తరమువారు పెద్దలిచ్చిన వెనుకటి పొలమునో పుట్రనో, తోటనో, దొడ్డినో, కొంపనో గోడనో, అమ్మి పిల్లలపెండ్లి చేయుచున్నారు. కాని ఈనాటివారికా ఆశలేదు. ఈనాటి జీతనాతములతో సంసారమును గడపుటయే దుస్తరముగా నున్నది. అట్టివారు ఆస్తిపాస్తులేమి సంపాదించగలరు? ఆస్తి లేనివారు ఏమి అమ్మి ఆడుబిడ్డ వివాహము చేయగలరు? కనుక ఇకముందు ఈ కట్నములింతగా పెచ్చు మీరుటకు అవకాశము గలుగదు. ఇవ్వగలవారు లేనప్పుడు పుచ్చుకొనగల వారుండి ఏమి

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

ప్రయోజనము? కనుక వివాహములలో వరకట్నముల ధర పడిపోక తప్పదు. అప్పుడు ముది కన్నెలును, ఘోటక బ్రహ్మచారులను మెండుకాగా తమకు తామై యథోచితముగా వివాహమాడక తప్పదు. పాపము యువతీ యువకులు మాత్రమేమి చేయుదురు? ఏండ్లు పైబడుచున్నవి గదా. ఏదో విధముగా కట్నకానుకలు లేకుండానే, పెండ్లిండ్లకు మొగ్గి తీరుతారు. అయితే ఇది ఇంతలోనే అయ్యేపని కాదనుకో, కొన్నేండ్లు కష్టపడ వలెను. యువతీ యువకులకలో మార్పు రావలయును. సంఘములో విప్లవము చెలరేగవలయును. లేకున్న ప్రతి ఒక్క కుమార్తెకు పదివేలు ఖర్చుపెట్టి, చదువు చెప్పించి, పదివేలు వరకట్నమిచ్చి వరుని తెచ్చి, పది వేలు ఖర్చుపెట్టి వివాహము చేయవలెననిన ఎంత సంపన్న గృహస్థులైనను ఎంతకాలము చేయగలరు? ఎందరికి చేయగలరు? "అల్లుళ్ళ కట్నాలు అంతకంతకు పెరిగి ఆకాశపథమును అంటే కట్నమియ్యలేక కన్నెల తండ్రులు పాతాళ లోకానికి క్రుంగేరయా" సత్యామయా గురుడ సత్యామయా అని పాడవలసి వచ్చినది. నిజ మునకు చదువుకొనినదైన కన్నె హృదయములో పెద్ద చదువరి, పెద్ద ఉద్యోగి, పెద్ద స్థితిపరుడును కావలెనని తలంపు ఉండుట అత్యాశ కాదు, కాని తలిదండ్రులకు కష్టములు లేకుండనువారి కొంప లార్చుకొని పోయే పరిస్థితి రాకుండను, తన్ను పోషింప గలవాడైన చాలునను భావముండుట అవసరమగును. ఏమన తాను కూడ చదువుకొనినది కావున తానుగూడ ఉద్యోగము చేసి కుటుంబ నిర్వహణకు తోడ్పడ గలదు గదా అతడు గొప్ప ఉద్యోగి కాకపోయి ననేమి అను ఉదారభావము కలుగ వలసినది, కాని అది ఈ నాటివధువుకు లేదు. "తనకుచదువు కలదు కదా ఇంకను ఉన్నతస్థితికి రాగల నుగదా, కన్నె తండ్రిని జలగవలె నింతగా పీడించి వారి రక్త మాంసము పిండుకొని నల్లు ఈ కట్నములను తీసికొనక పోయిననేమి! వారు మనస్ఫూర్తిగా ఇచ్చినదే మనకు శ్రేయస్కరము, ఆనంద ప్రదమను త్యాగశీలత కాని ఉదారభావము కాని ఈనాటి వరుని ఎదలో లేదు. ఇది అత్యంత శోచనీయము. ఈ సందర్భమున వధూ వరులే నింద్యులుగాదు. వీరి తల్లి దండ్రుల తప్పుగూడ కొండంత ఉన్నది. ప్రతి కన్య తండ్రి గొప్ప అల్లుడు కావలెనని అందులకు తన సర్వస్వము కోల్పోవుటకు సిద్ధపడుచున్నాడు. ఏవిధముగనైనను కన్నెచెరవిడిపించు కొనవలెనను కక్కుర్తి తానేమైనను పిల్లసుఖపడవలెనను ఆపేక్ష కారణము అనుకొందము. ఇక వరుని తల్లి దండ్రుల అడియాసకా హద్దులులెవు. వారు కుమారునకు చదువు చెప్పించినది పుత్ర వాత్సల్యములోగాదు. కట్నము మీద వాంఛలో గర్వముతో కాఠిన్యముతో ఏమైనను మాఅబ్బాయి పెద్ద చదువు చదివినవాడుగదా! ఎవరి కొరకు ఇచ్చెదరు, చచ్చినట్టు ఇచ్చెదరు. ఇవ్వకున్న పోయెదరు మనకేమి అను అహము! ఈ సమయములో తండ్రి ద్రవ్యము కొరకు ఎంత పోరాడునో, తల్లియు తోడబుట్టువులు తమ లాంఛనాల కొరకంత, పోరాడె దరు. వారి ముచ్చటలన్నియు, అలకయు ఇప్పుడే తీర వలయును. కాకున్న కన్నె పెండ్లివారిమీద కావలసినంత హంగామా చేయుచున్నారు. ఇందువల్లనే వివాహవయసు లెక్కువైనను, చదువులు అధికమైనను మొండి గోడల వలె ఈ దురాచారములు మాత్రమటులనే ఉన్నవి. పరిస్థితులను బట్టి పలుదోషము ప్రుల్లు జరగక పోయినను దొమ్మ సప్పగించడములు మొదలైననిగూడా సంస్కార మాత్రముగా జరిగినను అసలే జరగక పోయినను పరవాలేదు కాని పసిడాసలు పైరాటములన్నియు గావితా ప్రకారము జరుగ యుంటిని చేయవలెనని.

కల్పలతా!

మధ్య నిషేద చట్టమువచ్చి కొంప కొంప సారాయ బట్టియై నటులనే, వరకట్న నిషేధ చట్టమువచ్చి ప్రతి పెండ్లి వరకట్నముతో కలుషితమై పోయినది. కాని ఏదియు తగ్గలేదు సత్యము చెప్పవలెనన్న దీనికి కావసినది హృదయసంస్కారము, కఠోరదీక్ష, నిశ్చయ బుద్ధి కాని ప్రభుత్వ చట్టముకాదు. ఈనాడు యువకుడు తల్లి దండ్రులను కాదని తన అభిమతము వలనెన్నియో తీర్చుకొను చున్నాడు. కట్నము తీసికొనకుండ వివాహ మాడగలననుకొనినచో తన పంతము నెగ్గించికొనలేడా! కాని అతనిలోనే ఆ ధర్మదీక్షలేదు. కట్నముతీసికొనుట తన విద్యకు తన హోదాకు గొప్ప చిహ్నముగా భావిం చుచున్నాడు. లేదా ద్రవ్యాపేక్షకు లోనగుచున్నాడు. అంతే. ఒక మేజస్ట్రేటుగారి యింట్లో ఈమధ్య చీరాలలో ఒక పెండ్లికి వెళ్ళి వచ్చినామని మాకు మా మేనగోడలు చెప్పినది, ఆ మేజిస్ట్రేటుగారు ఇద్దరు కొమార్తెల వివాహమొకమారే చేసినారంట. ఆ అల్లు డ్రిద్దరు కట్నము తీసికొనలేదట. ఆ మాటపసులకెంతో ముచ్చట వేసినది. ఎంత సహృదయులా విద్యాధిక వరులు ఎంత అదృష్ట వంతుడా కన్యాదాత.

మిత్రురాలు శారద.

★

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపు అడ్మిషన్, ఆంధ్రా మెట్రిక్, ఇ. ఎస్. ఎల్. సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. పేద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడు చున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపీడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమ కేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూపురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
వనితా బాలవిహార్	: స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం

ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు

హైదరాబాదు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు : (1) రీజనల్ హేండిక్రాఫ్ట్సు, (2) సంక్షిప్త విద్యాప్రణాళిక, (3) చేనేత శిక్షణ– ఉత్పత్తికేంద్రము, (4) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (5) వసతిగృహము.

Printed and Published by N. R. Chendur at Andhra Mahila Press, 7-A, Rosary Church Road, San Thome, Madras-4. Hony. Editor: Mrs Malati Chendur